



సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 242

బుధవారం 17-5-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రెండో రౌండ్‌కు సురేఖ**

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్‌–2 టోర్నీలో సత్తా చాటిన ఏపీ క్రీడాకారిణి - 12లో



**క్యాంపస్ బాటలో కార్ల కంపెనీలు**

కాలేజీల నుంచి జోరుగా హైరింగ్.. నైపుణ్యాలకు ప్రాధాన్యం - 13లో



**'ఉద్యోగాల్లో' అవినీతికి చెక్‌పెట్టాం**

ఉద్యోగ నియామకాల వ్యవస్థలో తమ ప్రభుత్వం అవినీతి, బంధుప్రీతికి చెక్ పెట్టిందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



**30వ తేదీన ప్రారంభం!**

ఢిల్లీలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనాన్ని ఈ నెల 30వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని తెలుస్తోంది.

వివరాలు 6లో ▸



**'నైరుతి' రాక 4న!**

నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ఆలస్యం కానున్నాయి. జూన్ 4న దేశంలోకి ప్రవేశించే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది.

వివరాలు 6లో ▸



**అమెరికాలో మళ్లీ కాల్పులు**

అమెరికాలోని న్యూజెర్సీలో ఓ యువకుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### 19 నుంచి 'వలంటీర్లకు వందనం'



ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాదీ సత్కరించబోతోంది. ఈ నెల 19న విజయవాడలో సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. దాదాపు నెల పాటు అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వలంటీర్లను సత్కరిస్తారు.

వివరాలు 2లో ▸

### పేదలకు ఇళ్లివ్వడంలో ఏపీ నంబర్ వన్



పేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని కేంద్ర గృహ నిర్మాణ శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ చెప్పారు. అర్హులైన వారందరికీ గృహాల నిర్మాణం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతమని ప్రశంసించారు. కేంద్రం నుంచి కూడా అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

వివరాలు 3లో ▸





బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

# జనంతోనే వారి యుద్ధం

## స్వార్థ రాజకీయాల కోసమే జనసేన–టీడీపీ నీచపు పొత్తులు

## నిజాంపట్నం సభలో సీఎం వైఎస్ జగన్ మండిపాటు

- వచ్చే ఎన్నికల్లో పొత్తులు, ఎత్తులు, కుయుక్తులనే నమ్ముకున్న బాబు, దత్తపుత్రుడు
- సీఎం పదవి వద్దట, ప్యాకేజీ ఇస్తేచాలట!.. ఒక్కసీటూ గెలవక ముందే కుట్రలు మొదలు
- వెంటిలేటర్‌పై చంద్రబాబు పార్టీ.. నలుగురు కలిపి లేపితే తప్ప లేవలేని స్థితి
- చంద్రబాబు చెబితే ప్యాకేజీ స్టార్.. దేనికైనా సరే చిత్తం ప్రభు అంటారు
- పొత్తులు పెట్టుకుని వివాహం చేసుకునేది వీళ్లే, విడాకులు ఇచ్చేదీ వీళ్లే
- ఎన్నిసార్లయినా విడిపోతారు.. మళ్లీ కలుస్తారు.. విశ్వసనీయత, విలువలతో వీరికి పని లేదు
- ఈ నాలుగేళ్లలో మీ బిడ్డ ప్రభుత్వం రూ.2.10 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో వేసింది
- మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు
- గతంలోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్.. మరి బాబు ఎందుకు ఇలా చేయలేదు?
- ఆ డబ్బులన్నీ ఏం చేశారు.. ఎక్కడికి వెళ్లాయి?
- వీళ్ల ఆలోచన అంతా దోచుకోవడం, పంచుకోవడంపైనే..

2లో



"రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధానిని, రాష్ట్రపతిని కలిసిన ప్రతిసారీ మీ బిడ్డ మీద బురద జల్లుతారు. దుష్ప్రచారం చేస్తారు. కానీ నిజ జీవితంలో వీళ్లేం చేస్తున్నారో గమనిస్తే.. వీరే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. వీరే కాంగ్రెస్‌తో కూడా అంటకాగారు. బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బీఎస్పీ ఇలా అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుంది వీరే. మళ్లీ వదిలేసిందీ వీళ్లే. వివాహం చేసుకునేది వీళ్లే.. విడాకులు ఇచ్చేది వీళ్లే. ఇలా ఎన్నిసార్లయినా సరే పెళ్లి, విడాకులు, మళ్లీ పెళ్లి.. ఇదీ వీరి తత్వం. వీరి రాజకీయాల్లో ఎటువంటి విలువలు, విశ్వసనీయత లేదు." - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

### కడలి పుత్రులకు అండగా నిలిచాం

- వైఎస్సార్ మత్స్యకార భరోసా సొమ్ము జమ చేస్తూ సీఎం వైఎస్ జగన్
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.123.52 కోట్ల సాయం
- ఓఎన్‌జీసీ పైప్‌లైన్ బాధితుల కుటుంబాలకు రూ.107.91 కోట్లు

2లో



# సుప్రీం జడ్జిగా సీజే జస్టిస్ మిశ్రా

### ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరును సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం

### సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ పేరూ సిఫార్సు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా లు ఇటీవల పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 34 నుంచి 32కు తగ్గింది. జూలై రెండో వారం కల్లా మరో నలుగురు న్యాయమూర్తులు రిటైర్ కానున్నారు. దీంతో న్యాయమూర్తుల

మిగతా 3వ పేజీలో ▸

# రుణ లక్ష్యం రూ.4.43 లక్షల కోట్లు

- గత ఆర్థిక సంవత్సరం కంటే 39 శాతం అధికం.. అత్యధికంగా వ్యవసాయానికి రూ.2.31 లక్షల కోట్లు
- ఎంఎస్‌ఎంఈలకు రూ.69 వేల కోట్లు
- ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో వార్షిక రుణ లక్ష్యం ఖరారు

3లో



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రావు కారద్

### రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఏపీలో ఉచిత విద్యుత్, డీబీటీ బాగున్నాయి

కేంద్ర మంత్రి కిషన్‌రావు కారద్ ప్రశంసలు

3లో

# ఉదయం నుంచే భగభగ



ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారిన కర్నూలులోని రాజ్‌విహార్ సర్కిల్ రహదారి

- తీవ్రమైన ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి
- 9 జిల్లాల్లో 46 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత
- మరో 10 జిల్లాల్లో 45 డిగ్రీలు.. ధవళేశ్వరంలో అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఎండబారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

- వివరాలు 10లో



# అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

### సింగపూర్ ప్రభుత్వమంటూ.. చివరకు ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం

- కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదు... టెండర్ల ప్రక్రియ మాటే లేదు
- సింగపూర్ కంపెనీకి ముందుగానే అమరావతి మ్యాపులు
- అనంతరం బినామీల పేరుతో భూముల కొనుగోలు
- బాబు–నారాయణ భూదందాకు కేంద్రస్థానంగా సీడ్ క్యాపిటల్
- స్విస్ చాలెంజ్ పేరుతో భూదోపిడీ
- హెరిటేజ్, లింగమనేనికి లబ్ధి చేకూరేలా 'ఇన్నర్' మెలికలు
- గత సర్కారు పెద్దల ఆదేశంతో రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు.. తమ భూముల విలువ పెంచుకునేలా పథకం
- సీఐడీ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు



సాక్షి, అమరావతి: సింగపూర్ కంపెనీల ముసుగు తొలగిపోవడంతో అమరావతి కేంద్రంగా సాగిన భూదందా విస్మయపరుస్తోంది. చంద్రబాబు సింగపూర్ పర్యటనలు.. ప్రైవేట్ కంపెనీలతో ఎంవోయూలు.. స్విస్ ఛాలెంజ్ ఒప్పందాల వెనుక తీగను లాగుతుంటే కరకట్ట ఇంట్లో అవినీతి డొంక కదులుతోంది. అమరావతి మాస్టర్‌ప్లాన్, సీడ్ క్యాపిటల్ ప్లాన్ ఫైళ్లను తిరగేస్తుంటే బినామీల పేరుతో చంద్రబాబు, నారాయణ కొల్లగొట్టిన భూముల దస్త్రాలు

మిగతా 10వ పేజీలో ▸

# నేడే విడుదల!

### కర్ణాటక సీఎంపై కొనసాగుతున్న సస్పెన్స్



కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేసులో ఉన్న కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఢిల్లీ చేరుకున్నారు. వారిలో ఎవరిని ఎంచుకోవాలనే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం రోజంతా మల్లగుల్లాలు పడింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ పట్టు వీడకపోవడంతో నిర్ణయం బుధవారానికి వాయిదా పడింది.

6లో

# జనంతోనే వారి యుద్ధం



బహిరంగ సభకు హాజరైన అశేష జనంలో ఓ భాగం

## స్వార్థ రాజకీయాల కోసమే జనసేన-టీడీపీ నీచపు పొత్తులు

## నిజాంపట్నం సభలో సీఎం వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతిపక్షాలు జగన్‌తో కాకుండా, జనంతో యుద్ధం చేస్తున్నాయి. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర పేదలందరికీ మంచి చేస్తుంటే గతంలో పాలన సాగించిన వారు, ఆ పాలనకు మద్దతిచ్చిన వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే తట్టుకోలేకపోతున్నారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబుకు మత్స్యకారులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతరులు గుర్తుకొస్తారని చెప్పారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత మత్స్యకార భరోసా కింద నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చేసిన మంచిని, మిమ్మల్ని (ప్రజలు), దేవుడిని నమ్ముకున్నాను. ప్రజలకు ఏ మంచీ చేయని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పొత్తులని, ఎత్తులని, చిత్తులని, కుయుక్తులనీ నమ్ముకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. అందరికీ గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసం, కుతంత్రాలు మాత్రమే' అని అన్నారు. పేదలకు ఏ మంచీ చేయని ఈ పెద్దమనిషికి ఎవరైనా ఎందుకు మద్దతిస్తారని ప్రశ్నించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

### బాబు స్క్రిప్టు మేరకే దత్తపుత్రుడి మాటలు

- దత్తపుత్రుడు రెండు సినిమాలకు మధ్య షూటింగ్ విరామంలో అప్పుడప్పుడు పొలిటికల్ మీటింగ్‌లు పెట్టడానికి వస్తుంటాడు. అది కూడా బాబు కాల్‌షీట్స్ ప్రకారం, బాబు ఏదైతే చెప్తాడో ఆ స్క్రిప్ట్ ప్రకారం ఈ ప్యాకేజీ స్టార్ మాట్లాడి పోతుంటాడు. మీ బిడ్డపై నాలుగు రాళ్లు వేసి పోతుంటాడు. ఇటువంటి వాళ్లకు ప్రజాజీవితం అంటే తెలుసా? ఇలాంటి వాళ్లు ప్రజలకు మంచి చేయగలరా?
- వీళ్లిద్దరూ ఎలాంటి వాళ్లంటే.. అధికారంలో ఉంటే అమరావతి, అధికారం పోతే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్. ఇదే వీళ్ల శాశ్వత నివాసం. మన రాష్ట్రంపై, మన పేదలపై, మన ప్రజలపై వీళ్లకు ప్రేమ లేదు. కనీసం ఇక్కడ ఉండాలన్న ఆలోచన కూడా వీరికి తట్టదు. నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచి తాడేపల్లిలో ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటున్నాను. కానీ చంద్రబాబు నాయుడు 2014 నుంచి 2019 వరకు సీఎంగా ఉండీ కూడా జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ కట్టుకున్నాడు.

### దోచుకోవడమే వారి సిద్ధాంతం

- ఒక దత్తపుత్రుడు, ఒక దత్త తండ్రి.. వీరి పార్టీలు, సిద్ధాంతం ఒక్కటే. మన రాష్ట్రంలో దోచుకోవడం, దోచుకున్నది పంచుకుని హైదరాబాద్‌లో ఉండటం. ఎంతో మందిని ప్రధాన మంత్రులుగా, రాష్ట్రపతులుగా చేశానని చంద్రబాబు చెబుతుంటాడు. ఆయనకు మాత్రం మన రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో ఒంటరిగా బరిలో దిగే సత్తా మాత్రం లేదు.
- కనీసం రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో తాను పోటీ చేస్తే ఆయన పార్టీకి రెండో స్థానం వస్తుందా? పరువు దక్కించుకోగలుగుతాడా? అన్న నమ్మకం కూడా లేదు. మైదానాలలో బహిరంగ సభలు పెడితే ఖాళీ కుర్చీలు కనిపిస్తాయని.. సందులు, గొందుల్లో మీటింగ్‌లు పెడుతున్నారు. అక్కడ మనుషులు చనిపోతున్నా కనీసం వాళ్ల పట్ల సానుభూతి కూడా చూపని వ్యక్తి చంద్రబాబు. అలాంటి ఆయన పార్టీ వెంటిలేటర్‌పై ఉంది. నలుగురు కలిపి లేపితే తప్ప లేవలేని స్థితిలో ఉంది.

### ప్రజలు ఎమ్మెల్యేగా మాకొద్దన్న వ్యక్తి దత్తపుత్రుడు

- దత్తపుత్రుడు ఎమ్మెల్యేగా రెండు చోట్ల పోటీ చేస్తే.. అయ్యా మీరు మాకు ఎమ్మెల్యేగా కూడా వద్దు అని ప్రజలు నమస్కారం పెట్టి ఓడించారు. ఇదే దత్తపుత్రుడు రాజకీయ పార్టీ పెట్టి పదేళ్లు అయింది. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉంది.
- ఒక్కో ఎన్నికకు ఒక్కో రేటు. పార్టీని హోల్‌సేల్‌గా అమ్ముకునే ఈ ప్యాకేజీ స్టార్ ఈ మధ్యకాలంలో అన్న మాటలు వింటే ఆశ్చర్యం కలుగుతోంది. ఆయన ముఖ్యమంత్రి అయినా, కాకపోయినా పర్వాలేదట. దోపిడీలో రావాల్సిన వాటా వస్తే చాలు అంటున్నాడు. వీళ్లంతా ఇలా ఎందుకు అంటున్నారో.. ఎందుకు కలుస్తున్నారో ఆలోచించండి.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారు? రాష్ట్రాన్ని ఒక గజ దొంగల ముఠాగా దోచుకోవడానికే కలుస్తున్నారు. మరోపక్క మీ బిడ్డ ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని వ్యవస్థలు కత్తికట్టినా, ఎన్ని వ్యవస్థలను ప్రయోగించినా 15 ఏళ్లుగా మీ తరఫునే నిలబడ్డాడు. ఎక్కడా రాజీ పడలేదు. మనందరి ప్రభుత్వం చేసిన మంచిని చెబుతూ, మీ ఇంట్లో మీకు మంచి జరిగితేనే మీ బిడ్డకు తోడుగా మీరు సైనికుల్లా నిలబడాలని కోరుతున్నాను.

### పెత్తందార్లంతా ఓ వైపు..

- ఈ రోజు రాష్ట్రంలో పెత్తందార్లు ఒకవైపు ఉంటే.. మరోవైపు పేదవాడు ఉన్నాడు. వీరిది రాజకీయ పోరాటం కాదు. అధికారం కోసం ఆరాటం. లంచాలకు, వివక్షకు తావులేకుండా.. ఎన్నికలప్పుడు ఓటు వేయకపోయినా అర్హత ఉంటే చాలు కచ్చితంగా వాళ్లకు మంచి జరగాలనే తపనతో ఈ నాలుగేళ్లలో ఏకంగా రూ.2.10 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా జమ చేశాం.
- ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో చెప్పిన వాగ్దానాలను 98 శాతానికి పైగా అమలు చేసి మాట నిలబెట్టుకున్నాం. గతంలో ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. కోవిడ్ లేనందున అప్పుడు ఆదాయం కూడా ఎక్కువ. అప్పటికన్నా ఇప్పుడు తక్కువ అప్పులు చేశాం. అయినా రూ.2.10 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేశాం. బాబు హయాంలో ఈ డబ్బులన్నీ ఎక్కడికి వెళ్లాయో ఆలోచించండి. వీళ్ల ఆలోచనంతా దోచుకుని పంచుకోవడంపైనే ఉంది.

### దత్త తండ్రి - దత్త పుత్రుడి మ్యాచ్ ఫిక్సింగ్

- దత్త తండ్రికి, దత్త పుత్రుడికి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఏ లెవెల్లో ఉందంటే.. ఇదే పెద్దమనిషి చంద్రబాబు దత్తపుత్రుడిని చూసి మనిద్దరం కలిసి వెళ్దామన్నారు. దత్తపుత్రుడు.. చిత్తం ప్రభూ అని దాసోహం అంటాడు. ఇదే చంద్రబాబు మనిద్దరం విడివిడిగా వెళ్దాం .. అలా వేర్వేరుగా వెళ్తే మంచి జరుగుతుందని చెబితే.. దత్తపుత్రుడు అలాగే సార్.. మీకు ఏది మంచి జరుగుతుందంటే అలానే చేస్తానంటాడు.
- ఇదే చంద్రబాబు.. దత్తపుత్రుడితో నువ్వు పోటీ చేయకు అంటే.. జీ హుజూర్ అంటూ పోటీలో నిలబడడు. ప్రస్తుతానికి కమ్యూనిస్టులతో కలువు అంటే.. తప్పకుండా కలుస్తా సార్ అంటాడు. 'ఇదే చంద్రబాబు.. మనం విడివిడిగా పోటీ చేస్తున్నట్టు కనిపిస్తాం .. దానివల్ల నాకు మంచి జరుగుతుంది.. కానీ లోపాయికారిగా సంబంధాలు పెట్టుకుందాం. నేను గాజువాకకు రాను, భీమవరానికి రాను, నిన్ను ఇబ్బంది పెట్టను. నువ్వు కూడా మంగళగిరిలో పోటీ పెట్టొద్దు' అని చెబితే.. దత్తపుత్రుడు తప్పకుండా అలాగే చేస్తానంటాడు.
- ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఇదే చంద్రబాబు.. వాళ్లేం చేస్తారోనని బీజేపీకి భయపడి, వారికి దగ్గర కావడం కోసం.. ఇప్పుడు బీజేపీ పక్కన నువ్వు ఉండు దత్తపుత్రా అని చెబితే.. చిత్తం ప్రభూ అంటూ బీజేపీ పక్కకు చేరుతాడు. మీ అందరికీ చెబుతున్నా.. ఇక మీరే చూస్తుండండి. రేపు చంద్రబాబు విడాకులు ఇచ్చెయ్ అంటే దత్తపుత్రుడు ఇదే బీజేపీకి విడాకులు ఇచ్చేసి, మీరు ఎలా చెప్తే అలా చేస్తాను సార్ అంటాడు.

### ఎలాంటి వేషాలకైనా సిద్ధం

- రాష్ట్రంలో ఇవాళ ఇలాంటి రాజకీయాలు జరుగుతున్నాయి. దత్త బాబు ఇచ్చే ప్యాకేజీల కోసం ఎలాంటి వేషాలైనా వేయడానికి దత్తపుత్రుడు సిద్ధంగా ఉండటం అడుగడుగునా కనిపిస్తోంది. ఇలాంటి అన్యాయమైన రాజకీయాలకు తానా, తందాన అంటారు గజదొంగల ముఠాలోని మిగిలిన సభ్యులు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వీళ్లంతా గజదొంగల ముఠాలోని సభ్యులు. దత్తతండ్రి, దత్తపుత్రుడు బ్రహ్మాండంగా వ్యూహాలు వేస్తున్నారు అని వీళ్లంతా పెద్ద పెద్ద అక్షరాలతో వాళ్ల పేపర్లలో రాస్తారు. చక్రం తిప్పుతున్నారని టీవీ కార్యక్రమాల్లో చర్చలు పెడతారు.
- అక్కడెక్కడో కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే.. బీజేపీ ఓడితే, ఇది చంద్రబాబు విజయం అన్నట్టుగా వీళ్లంతా ఇక్కడ పండగ చేసుకుంటారు. మరోవంక అక్కడ ఓడిన బీజేపీని ఇక్కడ తమతో కలిసి రావాలని అడుగుతారు. నిజంగా ఇంత సిగ్గులేని అన్యాయమైన రాజకీయాలు మనం చూస్తున్నాం.

# 19 నుంచి 'వలంటీర్లకు వందనం'

- వరుసగా మూడో ఏడాదీ వారిని సన్మానించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆ రోజు విజయవాడలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకు రెండు సచివాలయాల చొప్పున నెలరోజులపాటు నిర్వహణ
- సత్కారంతో పాటు పనితీరు ఆధారంగా మూడు కేటగిరీల్లో అవార్డులు.. నగదు బహుమతులు
- ఫిర్యాదుల్లేని వారే అవార్డులకు ఎంపిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి పైరవీలు, అవినీతికి తావులేకుండా.. కుల, మత, ప్రాంత, వర్గ తారతమ్యాలకు అతీతంగా ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం వరుసగా మూడో ఏడాదీ సత్కరించనుంది. కనీసం ఒక ఏడాది పాటు వలంటీరుగా పనిచేస్తూ ఎలాంటి ఫిర్యాదుల్లేని వలంటీర్లను ప్రభుత్వం సత్కరించి నగదు బహుమతి అందజేయనుంది. ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ రోజు నుంచి దాదాపు నెలరోజుల పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల వారీగా స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో రోజుకు రెండు సచివాలయాల పరిధిలో వలంటీర్ల సత్కారాల కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ మేరకు సచివాలయాల వారీగా షెడ్యూల్‌లను సిద్ధంచేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకుని ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములను చేయాలని కోరారు.

**ఏటా సత్కారాలు..**

సీఎం వైఎస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అంటే 2019 ఆగస్టు 15న వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. విమర్శకులు సైతం మెచ్చుకునేలా గత మూడున్నరేళ్లుగా వీరు ప్రజలతో మమేకమయ్యారు. దీంతో ఈ వ్యవస్థ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. కేవలం గౌరవ వేతనంతోనే నిస్వార్థంగా పనిచేస్తున్న వీరి సేవలను గుర్తిస్తూ ఏటా 'వలంటీర్లకు వందనం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వారికి సత్కారాలు చేస్తోంది. తొలిసారి 2020-21కి గాను 2021 ఏప్రిల్ 14న.. ఆ తర్వాత 2022 ఏప్రిల్ 7 నుంచి నెల రోజులపాటు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

**మూడు రకాల అవార్డులతో పాటు నగదు పురస్కారాలు..**

- ప్రతి నియోజకవర్గంలో ఐదుగురు చొప్పున వలంటీర్లకు 'సేవావజ్ర' అవార్డును అందజేస్తారు. ఇది అందుకునే వారిని రూ.30వేల నగదు బహుమతి, మెడల్, బ్యాడ్జి, శాలువా, సర్టిఫికెట్‌తో సత్కరిస్తారు.
- అలాగే, ప్రతి మండలం, మున్సిపాలిటీకి ఐదుగురు చొప్పున, నగర కార్పొరేషన్‌కు 10 మంది చొప్పున వలంటీర్లకు 'సేవారత్న' అవార్డును అందజేస్తారు. ఈ అవార్డు పొందే వారికి రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, బ్యాడ్జి, శాలువా, సర్టిఫికెట్లను ఇస్తారు.
- కనీసం ఏడాది పాటు సర్వీసు కాలం పూర్తిచేసుకుని ఎలాంటి ఫిర్యాదుల్లేకుండా పనిచేసే మిగిలిన గ్రామ, వార్డు వలంటీర్లకు 'సేవామిత్ర' అవార్డు అందజేస్తారు. ఈ అవార్డుతో పాటు రూ.10 వేల బహుమతిని అందజేస్తారు.
- ఇలా 2021లో రాష్ట్రవ్యాప్తంగా 2,20,993 మంది వలంటీర్లను ప్రభుత్వం సత్కరించగా, 2022లో 2,33,333 మందిని సత్కరించింది. ఈ ఏడాది కూడా ప్రస్తుతం పనిచేసే మొత్తం వలంటీర్లలో దాదాపు 90 శాతం మందికి పైగా ఏదో ఒక అవార్డు పొందుతారని గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు వెల్లడించారు.
- వలంటీర్ల పనితీరుపై ఆ ప్రాంత కుటుంబాలు వ్యక్తంచేస్తున్న సంతృప్తి.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వలంటీర్ల హాజరు.. ప్రతినెలా మొదటి రోజునే వంద శాతం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ.. వివిధ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల క్లస్టర్ల పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు, వివరాల నమోదు తదితర అంశాల ఆధారంగా పనితీరు అంచనావేసి సేవావజ్ర, సేవారత్న అవార్డులకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

### ఏ సీఎం ఇంత మేలు చేయలేదు



జాతీయ స్థాయిలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా వైఎస్ జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారు. కుల వృత్తులను నమ్ముకుని ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలకు మానవతా దృక్పథంతో సాయం చేస్తున్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునేందుకు గతం కంటే పదిరెట్లు అదనంగా సాయం చేస్తున్నారు. గత పాలన వల్ల ప్రజలంతా నష్టపోయారు. నిజాంపట్నం హార్బర్ 70 శాతం పూర్తయితే ఈనాడులో దుర్మార్గంగా వార్తలు రాస్తున్నారు. మెరైన్ సెక్టార్‌ను, ఆక్వా రంగాన్ని ఆదుకుంటూ ముందుచూపుతో సీఎం ముందుకెళుతున్నారు.

– మోపిదేవి వెంకటరమణారావు, రాజ్యసభ సభ్యుడు

### జగనన్నకు గంగమ్మ ఆశీస్సులు



గతంలో మత్స్యకారులకు భరోసా లేదు. ఏప్రిల్, మే నెలలో దరఖాస్తు చేస్తే నవంబర్, డిసెంబర్ నెలల్లో కొందరికే ఇచ్చేవారు. జగనన్న వచ్చాక మా కష్టాలు తీరాయి. సకాలంలో మాకు సాయం అందుతోంది. మత్స్యకారుడెవరైనా సముద్రంలోకి వెళ్లి తిరిగి రాకపోతే గతంలో సాయం దైవాధీనం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. డీజిల్ సబ్సిడీ కూడా అందరికీ అందుతోంది. హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లతో మత్స్యకారులకు మరింతగా మంచి జరగనుంది. జగనన్నా నువ్వే మా ధైర్యం, మా నమ్మకం. ఆ గంగమ్మ తల్లి ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉంటాయి.

– బొమ్మిడి జాలరాజు, మత్స్యకారుడు, నిజాంపట్నం

### రేపల్లెకు వరాలు




రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నంలో సింగిల్ లైన్ రోడ్డు వంతెనకు రూ.2.50 కోట్లు, కొత్తూరులో బాలికల గురుకుల పాఠశాలకు రూ.10 కోట్లు, సీసీరోడ్డు, వాల్, డ్రెయిన్‌ల కోసం రూ.25 కోట్లు కావాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అడిగారు. నిజాంపట్నం రేవు లంకవారిరేవు దగ్గర కావాలన్నారు. ఇలా దాదాపు 13 పనులు అడిగారు. వాటన్నింటినీ మంజూరు చేస్తున్నా.

# కడలి పుత్రులకు అండగా నిలిచాం

## వైఎస్సార్ మత్స్యకార భరోసా సొమ్ము జమ చేస్తూ సీఎం వైఎస్ జగన్

- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.123.52 కోట్ల సాయం
- ఓఎన్‌జీసీ పైప్‌లైన్ బాధితుల కుటుంబాలకు రూ.107.91 కోట్లు
- 1,23,519 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి
- మొత్తంగా నాలుగేళ్లలో రూ.538 కోట్ల సాయం
- ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఆక్వా పార్కు
- పశ్చిమలో ఫిషరీస్ యూనివర్సిటీ నిర్మాణం
- మత్స్య, ఆక్వా రంగాలకు మంచి జరిగేలా కార్యక్రమాలు



వైఎస్సార్ మత్స్యకార భరోసా చెక్కును అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులకు నాలుగేళ్లలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అన్ని విధాలా అండగా నిలిచామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వేట నిషేధ సమయంలో అంటే.. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 మధ్యకాలంలో ఏటా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఐదు విడతల్లో రూ.50 వేలు అందించామని చెప్పారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. 1,23,519 మత్స్యకార కుటుంబాలకు రూ.123.52 కోట్ల లబ్ధి కలిగించారు. దీంతో పాటు ఓఎన్‌జీసీ సంస్థ పైప్‌లైన్ పనుల కారణంగా జీవనోపాధి కోల్పోయిన కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని 23,458 మత్స్యకార కుటుంబాలకు దాదాపు రూ.107.91 కోట్లతో కలిపి మొత్తం రూ.231 కోట్లు జమ చేశారు. మొత్తంగా నాలుగేళ్లలో రూ.538 కోట్లు సాయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేపల వేట నిషేధ సమయంలో సముద్రాన్నే నమ్ముకున్న మత్స్యకార అన్నదమ్ముల కుటుంబాలన్నింటికీ అండగా ఉండేందుకే వైఎస్సార్ మత్స్యకార భరోసా ప్రారంభించామన్నారు. 'గత ప్రభుత్వంలో అరకొరగా ముష్టి వేస్తున్నట్లు రూ.4 వేలు సాయం చేసేవారు. అది కూడా కొద్ది మందికి మాత్రమే ఎప్పుడో ఇచ్చే పరిస్థితి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చేసిన సాయం కేవలం రూ.104 కోట్లు. సగటున 60 వేల మంది మత్స్యకారులకు ఇస్తే, ఈ ఏడాది మనం 1.23 లక్షల మందికి రూ.123 కోట్లు ఇస్తున్నాం. అప్పుడు రూ.4 వేలు ఇస్తే, ఇప్పుడు మనం రూ.10 వేలు ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ లీటరుకు రూ.6 అని చెప్పేవారు. అది కూడా కేవలం 1,100 బోట్లకు మాత్రమే ప్రకటించి ఎప్పుడిస్తారో తెలియని స్థితిలో పరిపాలన సాగించారు. ఈ రోజు మీ బిడ్డ ప్రభుత్వంలో 20 వేల బోట్లకు సబ్సిడీ అందిస్తున్నాం. సబ్సిడీ రూ.9కి పెంచి, వెంటనే అందిస్తున్నాం' అని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

### బాబు పరిహారంలో పరిహాసం

- గతంలో చంద్రబాబు హయాంలో సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే వాళ్లకు పేరుకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పినా, గల్లంతైన మత్స్యకారుడి శవం కనపడితే.. ఇస్తామనే వారు. అది ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు.
- మన ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఎక్కడ ప్రమాదం వచ్చినా, ఆ కుటుంబాన్ని ఆదుకోవడం కోసం పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. దుర్ఘటన జరిగిన వారంలోపు రూ.5 లక్షలు ఇచ్చేటట్టుగా, ఆరు నెలలు తిరక్క మునుపే మరో రూ.5 లక్షలతో మొత్తంగా రూ.10 లక్షలు ఇస్తున్నాం. ఇప్పటి వరకు దీని కోసం రూ.13.50 కోట్లు ఖర్చు పెట్టాం.
- ముమ్మిడివరం నియోజకవర్గంలో ఓఎన్‌జీసీ వారు 2012లో డ్రిల్లింగ్ చేయడం వల్ల జీవనోపాధి కోల్పోయిన 16,500 మత్స్యకార కుటుంబాలకు 7 నెలల కాలానికి రూ.47,250 చొప్పున మొత్తంగా రూ.78 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 2012లో మత్స్యకారులకు ఈ డబ్బులు ఇవ్వాల్సి ఉంటే, 2014లో సీఎం అయిన చంద్రబాబు తన ఐదేళ్లలోనూ దాన్ని ఇప్పించలేదు.
- మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మత్స్యకార కుటుంబాలకు ముందుగా డబ్బులు ఇచ్చి, ఆ తర్వాత కేంద్రం నుంచి తెచ్చుకున్నాం. ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ కోసం పైప్‌లైన్ నిర్మాణం వల్ల ఉపాధి కోల్పోయిన మరో 23,458 మంది మత్స్యకార కుటుంబాలకు ఇదే మాదిరిగా రూ.216 కోట్ల పరిహారం మన ప్రభుత్వంలోనే ఇప్పించాం. వాళ్లకు మలి విడత పరిహారంగా కాకినాడ, కోనసీమ జిల్లాల్లో రూ.46 వేల చొప్పున రూ.108 కోట్లు జమ చేస్తున్నాం.



ఆక్వా పార్కుకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు

### తీర ప్రాంతం అభివృద్ధికి కృషి

- ఏపీ.. అతిపెద్ద సముద్ర తీరం కలిగిన రెండవ రాష్ట్రం. అయినా మన మత్స్యకారుల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలి? వారు ఉపాధి వెతుక్కుంటూ గుజరాత్, తమిళనాడు, ఒడిశాకో ఎందుకు పోవాల్సి వస్తోంది? వాళ్ల పరిస్థితులు ఎలా మార్చాలి? మన దగ్గర ఏమి తక్కువైంది? అన్న ఆలోచనలు గతంలో ఎప్పుడూ జరగలేదు.
- మన ప్రభుత్వం వచ్చాకే రూ.400 కోట్లతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ పనులు వాయు వేగంతో జరుగుతున్నాయి. ఇవాళ ప్రపంచ స్థాయిలో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నాం. వీటి కోసం రూ.16 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఇందులో కేవలం 10 ఫిషింగ్ హార్బర్లకు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు మాత్రమే రూ.3800 కోట్లు ఖర్చు చేస్తున్నాం.
- ఆక్వా రైతులకు సైతం మంచి జరగాలని యూనిట్ విద్యుత్ రూ.1.50కే సరఫరా చేస్తూ రూ.2,792 కోట్లు సబ్సిడీగా ఇచ్చాం. చంద్రబాబు.. ఎన్నికలకు మూడు నెలల ముందు సబ్సిడీ రూ.2 అని ప్రకటించాడు. కానీ ఇవ్వలేదు. ఆయన బకాయిలు పెట్టిన రూ.300 కోట్లు కూడా మన ప్రభుత్వమే చెల్లించింది.

### ఫిషరీస్ యూనివర్సిటీ

ఇక్కడే ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు వస్తున్నాయి. ఉన్న 6 పోర్టులకు అదనంగా మరో 4 పోర్టులు కొత్తగా వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మన మత్స్యకారుల నైపుణ్యాలు పెరగాలి. అప్పుడే వారికి మెరుగైన జీతాలతో వీటిలో ఉపాధి లభించడమే కాకుండా, స్వయం ఉపాధితో బోట్లు కొనుగోలు చేసి, అడుగులు ముందుకు వేయగలుగుతారు. దీని కోసం పశ్చిమ గోదావరి జిల్లాలో ఫిషరీస్ యూనివర్సిటీని నెలకొల్పుతున్నాం.


### ఆక్వా పార్కుకూ శంకుస్థాపన

- ఆక్వా కల్చర్ అభివృద్ధిలో భాగంగా దిండి గ్రామం వలసవారి పాలెంలో 280 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి రూ.185 కోట్లు ఖర్చు చేస్తూ.. ఆక్వా పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం. దీనివల్ల ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించవచ్చు. ఆక్వా రైతుల సామర్థ్యం పెంచడం ద్వారా రొయ్యలు, సముద్ర చేపలు, పీతల సీడ్ ఇక్కడే తయారు చేస్తారు.
- మడ్ క్రాబ్, సీ బాస్‌కి సంబంధించిన సీడ్ ప్రొడక్షన్ కావాలంటే ఏకంగా పాండిచ్చేరికి వెళ్లాల్సిన పరిస్థితి నుంచి నిజాంపట్నంలోనే అందుబాటులో ఉండే పరిస్థితి వస్తుంది. దీనివల్ల 11,388 మంది ఆక్వా రైతులకు ప్రత్యక్షంగా మంచి జరుగుతుంది. మరో 21 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుంది. ఈ ఆక్వా పార్కు అభివృద్ధి చెందడం వల్ల మొత్తంగా 10 వేల ఎకరాలు ఆక్వా సాగులోకి వస్తుంది.
- ఇక్కడ నుంచి 30-40 కిలోమీటర్ల దూరంలో ఓడరేవు ఉంది. రూ.417 కోట్లతో ఓడరేవులో ఫిషింగ్ హార్బర్‌కు కూడా శంకుస్థాపన చేశాం. మత్స్యకార సోదరుల మేలు కోసం వారికి మంచి జరగాలని మనసా, వాచా, కర్మణా ఆలోచన చేసి అడుగులు ముందుకు వేస్తున్నాం.

# జూన్ 1 వరకు నిలకడగా రొయ్య ధరలు

## ఇక రోజువారీ ధరల నిర్ణయం ఉండదు

## సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ముందుకొచ్చిన ప్రాసెసింగ్ కంపెనీలు



సాక్షి, అమరావతి: రొయ్యల కౌంట్ ధరలను ఇకనుంచి ప్రతీ 15 రోజులకు ఒకసారి సమీక్షించనున్నట్టు ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం తెలిపారు. 100 కౌంట్ నుంచి 30 కౌంట్ వరకు మధ్యలో ప్రతి కౌంట్ ధరలోనూ ప్రతిరోజూ రూ.15 వ్యత్యాసం ఉంటోందనే విషయాన్ని రైతులు అప్సడా దృష్టికి తీసుకురావడంతో కౌంట్‌ధరల విషయంలో స్పష్టత ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. ఆ మేరకు ఆక్వా సాధికారత కమిటీ సమావేశంలో రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలకు ఆదేశాలు ఇవ్వగా.. మంగళవారం భీమవరంలో 36 ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు సమావేశమై ధరల నిర్ణయంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ వరకు కొనసాగించేలా ధరలను నిర్ణయించారని రఘురాం చెప్పారు. కౌంట్ ధరలపై ఆర్బీకే స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు. ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంగళవారం ఓ ప్రకటనలో రఘురాం రైతులకు విజ్ఞప్తి చేశారు.

**జూన్ 1వ తేదీ వరకు కొనసాగనున్న ధరలు ఇలా**

| కౌంట్ | కేజీ ధర (రూపాయల్లో) |
|---|---|
| 30 | 440 |
| 40 | 340 |
| 50 | 310 |
| 60 | 290 |
| 70 | 280 |
| 80 | 270 |
| 90 | 250 |
| 100 | 240 |



## క్లుప్తంగా...

### నకిలీ వ్యాపారసంస్థల ఏరివేతకు తనిఖీలు

- కేంద్రం ఆదేశాల మేరకు జూన్ 15 వరకు ప్రత్యేక తనిఖీలు
- రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్

**సాక్షి, అమరావతి:** కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నకిలీ వ్యాపారసంస్థలను గుర్తించి వాటిని ఏరివేయడానికి కేంద్ర, రాష్ట్ర పన్నుల అధికారులు మంగళవారం నుంచి జూన్ 15వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ చేయాల్సిన నకిలీ వ్యాపారసంస్థల వివరాలను కేంద్రప్రభుత్వం జారీచేసినట్లు పేర్కొన్నారు. నకిలీ వ్యాపారసంస్థలను ఏరివేయడానికి కేంద్రప్రభుత్వం ఈ ప్రత్యేక తనిఖీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో జరిగే ఈ తనిఖీల్లో ఆయా సంస్థల రిజిస్ట్రేషన్ల వివరాలు, వ్యాపార కార్యాలయాలు, గోడౌన్లు తదితరాలను పరిశీలిస్తారని వివరించారు. ఈ తనిఖీలు ఆడిట్, ఇన్‌స్పెక్షన్ నిమిత్తం కాదని పేర్కొన్నారు. తనిఖీ అధికారులకు వ్యాపారసంస్థలు, ఆడిటర్లు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పన్నులు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీ సమయంలో ఇబ్బందులు తలెత్తితే సంబంధిత డివిజన్ సంయుక్త కమిషనర్‌గానీ, డిప్యూటీ కమిషనర్ ఆర్.త్రినాథరావు (ఫోన్ నంబరు 8978500226)కుగానీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి.ముత్యాలరావు (ఫోన్ నంబరు 7993881356)కుగానీ తెలియజేయాలని ఆయన సూచించారు.

### విశాఖ హెచ్‌పీసీఎల్ రిఫైనరీ పనితీరుపై ప్రధాని హర్షం

**సాక్షి, న్యూఢిల్లీ:** విశాఖపట్నం, ముంబై నగరాల్లోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీల అద్భుత పనితీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. హెచ్‌పీసీఎల్ రిఫైనరీల పనితీరు గురించి మంగళవారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌పూరి ట్విట్టర్ ద్వారా తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. దేశంలోని పౌరులకు సరసమైన ధరలకు ఇంధన సౌలభ్యం కల్పించడంలో హెచ్‌పీసీఎల్ తన కర్తవ్యాన్ని మించి బాధ్యతలు నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రెండు నగరాల్లోని రిఫైనరీలు 2023 జనవరి–మార్చి త్రైమాసికంలో 4.96 ఎంఎంటీ మేర ముడిచమురు శుద్ధి చేయడం ద్వారా 113 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి ట్వీట్‌కు ప్రధాని స్పందిస్తూ 'ఇంధన రంగానికి ఇదెంతో సంతోషం కలిగించే సమాచారం' అని పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే కందులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న నారాయణరెడ్డి

**యర్రగొండపాలెం:** రోడ్డు ప్రమాదంలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత కందుల నారాయణరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జి.కోటయ్య కథనం ప్రకారం .. నారాయణరెడ్డి సొంత పనుల నిమిత్తం మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న సమయంలో సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటకు గురిజేపల్లి మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి సమీపంలోని పొలాల్లోకి బోల్తా కొట్టింది. ప్రమాదంలో ఆయనతో పాటు కారు డ్రైవర్ డి.బుద్ధయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సెల్‌ఫోన్ ద్వారా అనుచరులకు ఆయన సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరినీ యర్రగొండపాలెంలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. కుడి కాలుకు, తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

# రుణ లక్ష్యం రూ. 4.43 లక్షల కోట్లు



## ఎస్ఎల్‌బీసీ సమావేశంలో వార్షిక రుణ లక్ష్యం ఖరారు

**సాక్షి, విశాఖపట్నం:** వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ 2023–24 వార్షిక రుణ లక్ష్యాన్ని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఖరారు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4.43 లక్షల కోట్ల రుణ ప్రణాళికను నిర్దేశించుకోగా వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.2.31 లక్షల కోట్లను కేటాయించింది. మంగళవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఎస్ఎల్‌బీసీ సమావేశం జరిగింది. గత ఏడాది వార్షిక రుణ లక్ష్యం రూ.3,19,481 కోట్లు కాగా ఈ ఏడాది 39 శాతం అధికంగా కేటాయించారు. గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి రూ.3,99,289 కోట్ల రుణాలను (125 శాతం) మంజూరు చేయడం గమనార్హం.

**2023-24 రుణ ప్రణాళిక - ఏ రంగానికి ఎంత? రూ.కోట్లలో**

| రంగం | 2022-23 లక్ష్యం | సాధించినది | శాతం | 2023-24 లక్ష్యం | పెరిగిన శాతం |
|---|---|---|---|---|---|
| స్వల్పకాలిక రుణాలు | 1,21,581 | 92,661 | 76 | 1,48,000 | 22 |
| దీర్ఘకాలిక, వ్యవసాయ అనుబంధ రుణాలు | 43,160 | 79,564 | 184 | 83,000 | 92 |
| ఎంఎస్ఎంఈలు | 50,100 | 53,149 | 106 | 69,000 | 38 |
| ఇతర ప్రాధాన్యత రంగం | 20,840 | 9,068 | 44 | 23,000 | 10 |
| ప్రాధాన్యేతర రంగం | 83,800 | 1,64,847 | 196 | 1,20,000 | 43 |
| మొత్తం రుణ ప్రణాళిక | 3,19,481 | 3,99,289 | 125 | 4,43,000 | 39 |

### ఎన్టీఆర్ జిల్లాకు అత్యధికం..

ఈ ఏడాది వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ.2.31 లక్షల కోట్లలో స్వల్పకాలిక రుణాలకు రూ.1.48 లక్షల కోట్లు, టర్మ్ లోన్లు, వ్యవసాయ అనుబంధ రుణాలకు రూ.83 వేల కోట్లు (పాడి పరిశ్రమ అభివృద్ధికి రూ.9 వేల కోట్లు) నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.69 వేల కోట్లు (సూక్ష్మ పరిశ్రమలకు రూ.36 వేల కోట్లు), ఇతర ప్రాధాన్యత రంగానికి రూ.23 వేల కోట్లు కేటాయించారు. ప్రాధాన్యేతర రంగానికి మరో రూ.1.20 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని ఎస్ఎల్‌బీసీ నిర్దేశించుకుంది. రంగాల వారీగా చూస్తే గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే వ్యవసాయ స్వల్పకాలిక రుణాల్లో 22 శాతం, టర్మ్ లోన్లు, వ్యవసాయ అనుబంధ రుణాల్లో 92 శాతం (వెరసి వ్యవసాయ రంగానికి 40 శాతం ), ఎంఎస్ఎంఈలకు 38 శాతం, ఇతర దిగువ ప్రాధాన్యత రంగానికి 37 శాతం, ప్రాధాన్యేతర రంగానికి 43 శాతం చొప్పున రుణ కేటాయింపులు పెరిగాయి. జిల్లాలవారీగా చూస్తే అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాకు 12.93 శాతం రుణాలను కేటాయించారు.

**జిల్లాల వారీగా రుణ కేటాయింపుల లక్ష్యం ఇలా..**

| జిల్లా | కేటాయింపు శాతం |
|---|---|
| అల్లూరి సీతారామరాజు | 0.56 |
| అనకాపల్లి | 2.28 |
| అనంతపురం | 3.58 |
| అన్నమయ్య | 2.60 |
| బాపట్ల | 2.68 |
| చిత్తూరు | 3.24 |
| బీఆర్ అంబేడ్కర్ కోనసీమ | 2.76 |
| తూర్పు గోదావరి | 3.71 |
| ఏలూరు | 3.67 |
| గుంటూరు | 5.94 |
| కాకినాడ | 3.85 |
| కృష్ణా | 4.53 |
| కర్నూలు | 2.78 |
| నంద్యాల | 2.48 |
| ఎన్టీఆర్ | 12.93 |
| పల్నాడు | 3.72 |
| పార్వతీపురం మన్యం | 0.67 |
| ప్రకాశం | 4.06 |
| ఎస్పీఎస్సార్ నెల్లూరు | 4.64 |
| శ్రీసత్యసాయి | 2.44 |
| శ్రీకాకుళం | 2.33 |
| తిరుపతి | 4.35 |
| విశాఖపట్నం | 10.22 |
| విజయనగరం | 2.05 |
| పశ్చిమ గోదావరి | 4.56 |
| వైఎస్సార్ | 3.37 |

### బ్యాంకుల వారీగా కేటాయింపులు..

వార్షిక రుణ ప్రణాళికలో బ్యాంకుల వారీగా పరిశీలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు 65 శాతం (రూ.2,88,000 కోట్లు), ప్రైవేట్ రంగ బ్యాంకులు 18 శాతం (రూ.78,250 కోట్లు), ఆర్ఆర్‌బీలు 10 శాతం (రూ.45,000 కోట్లు), సహకార రంగ బ్యాంకులకు 7 శాతం (రూ,31,750 కోట్లు) చొప్పున నిర్దేశించారు.

# సుప్రీం జడ్జిగా సీజే జస్టిస్ మిశ్రా

▶ మొదటి పేజీ తరువాయి

సంఖ్య 28కి పడిపోనుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇద్దరి పేర్లను సిఫారసు చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో మంగళవారం సమావేశమైన కొలీజియం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ సంజీవ్ ఖన్నా సభ్యులు. జస్టిస్ మిశ్రా ఎంపికపై కొలీజియం తీర్మానం వివరణ ఇచ్చింది. 'జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా 13 సంవత్సరాలకు పైగా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. హైకోర్టు న్యాయమూర్తుల ఆల్ ఇండియా సీనియారిటీ జాబితాలో 21వ స్థానంలో ఉన్నారు. సుమారు 12 ఏళ్ల పాటు ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ మిశ్రా పలు న్యాయ రంగాల్లో గణనీయమైన అనుభవాన్ని సంపాదించారు. జస్టిస్ మిశ్రా ఇచ్చిన తీర్పులు చట్టం, న్యాయానికి సంబంధించిన అనేక సమస్యలను స్పృశించాయి. ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారెవరూ లేరు. 2009 మార్చి 31న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ప్రస్తుత అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి... జస్టిస్ పీకే మిశ్రా కన్నా సీనియర్ ర్యాంకులో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ అన్ని విధాలా పరిగణించి జస్టిస్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తగిన వారిగా నిర్ణయించాం ' అని కొలీజియం తీర్మానంలో పేర్కొంది.

**కేవీ విశ్వనాథన్ పేరునూ...**



కేవీ విశ్వనాథన్

జస్టిస్ పీఎస్ నరసింహ ఒక్కరే ప్రస్తుతం బార్ అసోసియేషన్ నుంచి నేరుగా సుప్రీం జడ్జిగా ఎంపికై కొనసాగుతున్నారు. అందుకే సీనియర్ న్యాయవాది అయిన కేవీ విశ్వనాథన్ పేరును బార్ ప్రాతినిధ్యంగా పరిగణిస్తూ సిఫారసు చేస్తున్నట్లు కొలీజియం వివరించింది. తమిళనాడుకు చెందిన విశ్వనాథన్ సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. జస్టిస్ జేబీ పార్దివాలా 2030 ఆగస్టు 11న రిటైరవుతారు. ఆయన తర్వాత సుప్రీంకోర్టులో కేవీ విశ్వనాథనే అత్యంత సీనియర్. కొలీజియం సిఫార్సును కేంద్రం ఆమోదించి ఆయన సుప్రీంకోర్టులో జడ్జి అయితే తర్వాతి కాలంలో ఈయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉంది. సీజేఐగా ఈయన 2031 మే 25వ తేదీ వరకు 9 నెలలపాటు కొనసాగే అవకాశాలున్నాయని కొలీజియం తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆగస్టు 29, 1964లో జన్మించారు. డిసెంబర్ 10, 2009న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం అక్టోబర్ 13, 2021న ఏపీ హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు.



సీజే మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈవో

### దుర్గమ్మ సేవలో హైకోర్టు సీజే

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు అందజేశారు.

# రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**కేంద్ర మంత్రి కిషన్‌రావు కారద్ ప్రశంసలు**



మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

**సాక్షి, విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతన్నలకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, డీబీటీ పథకాలు ఎంతో బాగున్నాయని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి భగవత్ కిషన్‌రావు కారద్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుందని, డీబీటీతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. మంగళవారం విశాఖలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుకు బ్యాంకర్లు విధిగా సహకరించాలని సూచించారు. ఏపీలో ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బ్యాంకర్ల సేవలు మెరుగ్గా ఉన్నాయని, ఎస్ఎల్‌బీసీ లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు సేవలను విస్తృతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు మరింత విస్తరించాలని సూచించారు. ప్రైవేట్ బ్యాంకులు తీరు మార్చుకుని సేవలను మెరుగు పరచుకోవాలన్నారు. 'ముద్ర' రుణాల మంజూరులో కరూర్ వైశ్యా బ్యాంకు బాగా వెనకబడిందని, మూడు నెలల్లో తీరు మార్చుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ఎక్కువ మంది మహిళలకు రుణాలివ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న తోడు' పథకం గురించి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఆరా తీశారు.

**కౌలు రైతులకు బ్యాంకులు సహకారం అందించాలి..**

ప్రైవేట్ బ్యాంకులు ఆశించిన స్థాయిలో రుణాలివ్వడం లేదని, కౌలు రైతులకు కొన్ని బ్యాంకుల నుంచి తగిన సహకారం అందడం లేదని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకిస్తున్న రుణాలు, టిడ్కో ఇళ్ల రుణ పరిమితిని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవసాయం, అనుబంధ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకర్లు మరింత సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో సక్రమంగా అమలవుతున్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రావత్ తెలిపారు. సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ నవనీత్ కుమార్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ (ఏపీ) ఓఏ బషీర్, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, యూనియన్ బ్యాంక్ సీజీఎం మహాపాత్ర, ఎస్ఎల్‌బీసీ కోఆర్డినేటర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణకు శ్రీకారం

- ఏపీఐఎల్ఐపీ రెండో దశలో రూ.44.70 కోట్లతో ఆధునీకరణ పనులు
- రాతి ఆనకట్ట స్థానంలో కాంక్రీట్ ఆనకట్ట నిర్మాణం
- ఆనకట్ట నిల్వ సామర్థ్యం 28.55 ఎంసీఎఫ్‌టీలకు పెంపు
- హెడ్ రెగ్యులేటర్, కాలువల ఆధునీకరణ కూడా..
- 10,500 ఎకరాలకు సమృద్ధిగా నీటిని అందించేలా మార్గం సుగమం

**సాక్షి, అమరావతి :** శిథిలావస్థకు చేరిన స్వర్ణముఖి ఆనకట్టను ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నిధులతో చేపట్టిన ఏపీఐఎల్ఐపీ (ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధుల అభివృద్ధి పథకం) రెండో దశలో రూ.44.70 కోట్ల వ్యయంతో స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణ పనులకు టెండర్లను పూర్తిచేసింది. రాతి ఆనకట్ట స్థానంలో నిల్వ సామర్థ్యం పెంచుతూ కాంక్రీట్ ఆనకట్టను నిర్మించడం, హెడ్ రెగ్యులేటర్‌ను పునర్నిర్మించడం, చెంబేడు కాలువ వ్యవస్థను ఆధునీకరించే పనులను త్వరితగతిన పూర్తిచేయడం ద్వారా 10,500 ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు నడుం బిగించింది. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తికి సమీపంలో స్వర్ణముఖి నదిపై 1954లో రాతి ఆనకట్టను నిర్మించి.. చెంబేడు కాలువ ద్వారా నీటిని మళ్లించి 4,127.80 హెక్టార్ల (10,200 ఎకరాలు)కు ప్రభుత్వం నీళ్లందించేది. రాతి ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడం, నదీ గర్భంలో ఇసుక మేటలు పేరుకుపోవడంవల్ల ఆనకట్ట నిల్వ సామర్థ్యం తగ్గింది. అలాగే, హెడ్ రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడం, చెంబేడు కాలువ అస్తవ్యస్తంగా మారడంతో ప్రస్తుతం 2,514 హెక్టార్లు (6,210 ఎకరాలు)కు మాత్రమే నీళ్లందుతున్నాయి. ఈ నేపథ్యంలో.. స్వర్ణముఖి ఆనకట్టను ఆధునీకరించడం ద్వారా పూర్తి ఆయకట్టుకు నీళ్లందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేవలం 8.049 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్)ల నిల్వ సామర్థ్యం ఉన్న రాతి ఆనకట్ట స్థానంలో.. 28.55 ఎంసీఎఫ్‌టీల నిల్వ సామర్థ్యం ఉండేలా కాంక్రీట్ ఆనకట్ట నిర్మించడానికి సిద్ధమైంది. హెడ్ రెగ్యులేటర్‌ను పునర్నిర్మించి.. చెంబేడు కాలువ వ్యవస్థను ఆధునీకరించే పనులను చేపట్టింది. తద్వారా 4,211 హెక్టార్ల (10,500 ఎకరాలు) ఆయకట్టుకు నీళ్లందించడానికి మార్గం సుగమం చేస్తోంది. దీనివల్ల తిరుపతి జిల్లాలోని తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, పెళ్లకూరు మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

# లేఖను ఎందుకు దాచారు?

- హత్య జరిగాక ఎవరెవరికి ఫోన్ చేశారు?
- వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిని ప్రశ్నించిన సీబీఐ
- వైఎస్ అవినాష్ రెడ్డికి మరోసారి నోటీసులు
- 19న విచారణకు రావాలని సూచన

**సాక్షి, హైదరాబాద్/పులివెందుల:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయన కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డిలను మంగళవారం ప్రశ్నించారు. వివేకా మరణించే ముందు రాసినట్టుగా చెబుతున్న లేఖ గురించే వారిద్దరి నుంచి ఎక్కువగా వివరాలు రాబట్టినట్టు సమాచారం. సీబీఐ నోటీసుల మేరకు సునీత, రాజశేఖరరెడ్డి హైదరాబాద్ కోఠిలోని సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. వివేకా హత్య తర్వాత జరిగిన పరిణామాలతోపాటు లేఖను ఎందుకు దాచిపెట్టాల్సి వచ్చింది?, తర్వాత పోలీసులకు అందించడం, వివేకా పీఏ కృష్ణారెడ్డికి హత్య జరిగిన రోజు ఎన్నిసార్లు ఫోన్లు చేశారు? ఆయన నుంచి ఎన్ని ఫోన్ కాల్స్ అందుకున్నారు? హత్య జరిగిన సమాచారం అందిన తర్వాత ఎవరెవరితో మాట్లాడారు? ఇలా పలు అంశాలపై సునీత, రాజశేఖరరెడ్డిలను సీబీఐ అధికారులు మరోమారు సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇద్దరి స్టేట్‌మెంట్లను సీబీఐ అధికారులు నమోదు చేశారు.

**విచారణకు హాజరుకాని అవినాష్**

కాగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 16న మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో హాజరు కావాలని 15వ తేదీన ఆయనకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం తాను ముందుగా నిర్ణయించుకున్న పలు కార్యక్రమాల కారణంగా విచారణకు హాజరు కాలేనని.. నాలుగు రోజుల గడువు కావాలని లేఖ ద్వారా అవినాష్ రెడ్డి సీబీఐ అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఆయన ఇంటికి సీబీఐ అధికారులు చేరుకున్నారు. అక్కడ ఎంపీ కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో వారి డ్రైవర్‌కు నోటీసులు అందజేసి అతడి సంతకం తీసుకున్నారు. అవినాష్‌రెడ్డి ఈ నెల 19న ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లో సీబీఐ విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

**ప్రత్యేక కేటగిరీగా పరిగణించి వసతులు కల్పించండి: భాస్కరరెడ్డి పిటిషన్**

జైలులో తనకు ప్రత్యేక కేటగిరీ కింద సదుపాయాలు కల్పించాలని కోరుతూ వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు (ఏ–7) వైఎస్ భాస్కరరెడ్డి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆయనను గత నెలలో సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో తన అనారోగ్యాన్ని, వయసును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కేటగిరీగా పరిగణించి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ భాస్కరరెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న కోర్టు తన ఉత్తర్వులను జూన్ 2కు వాయిదా వేసింది.

# విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు

- ఆధునిక పద్ధతుల్లో బోధనపై 11వేల మంది టీచర్లకు శిక్షణ
- జూన్ 9వ తేదీ వరకు నిర్వహణ

**సాక్షి, అమరావతి:** బోధనలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 2008, 2018 డీఎస్సీల్లో ఎంపికైన వారితోపాటు, ఇటీవల ప్రత్యేకంగా బోధనా సిబ్బందిగా నియమించిన 1998–డీఎస్సీ అభ్యర్థులతో కలిపి దాదాపు 11 వేల మంది బోధనా సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందుకోసం ఆయా జిల్లాల్లోని డైట్ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో శిక్షణ అవసరమైన ఉపాధ్యాయులను బృందాలుగా ఎంపిక చేసి ఐదు రోజులపాటు వివిధ అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం, బోధనలో అనుసరించాల్సిన పద్ధతులు, విద్యార్థులకు ఎలా బోధిస్తే అర్థమవుతుంది... వంటి అంశాలను వివరిస్తారు. గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను సైతం అమలు చేస్తోంది. ఆయా పథకాల అమలు తీరుపై కూడా ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తారు. స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, మల్టీ టీచింగ్ విధానంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇస్తారు. పాఠశాల విద్యాశాఖ ఏడాదిలో నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తుంది. వాటిని ఎలా కొనసాగించాలనేది కూడా వివరిస్తారు. ఈ నెల ప్రారంభంలోనే శిక్షణ కోసం మాస్టర్ ట్రైనర్స్‌ను ఎంపిక చేసి తర్ఫీదు నిచ్చారు. వారు ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్ విధానంలో బోధనపై అవగాహన కల్పిస్తున్నారు. కాగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల శిక్షణను సైతం అకడమిక్ క్యాలెండర్‌లో భాగం చేసి, విద్యార్థుల పరీక్షలు, సెలవులతోపాటే ఈ శిక్షణ తేదీలను సైతం ముందుగానే ప్రకటించాలని పాఠశాల విద్యాశాఖ యోచిస్తోంది.

# పేదలకు ఇళ్లివ్వడంలో ఏపీ నంబర్-1

**దేశంలోనే అత్యధికంగా ఏపీలో ఇళ్ల నిర్మాణం**

- వైఎస్ జగన్ ప్రభుత్వమే ఇళ్ల స్థలాలు ఇస్తోంది
- ఇది పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది
- కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తాం
- అత్యధికంగా ఇళ్ల అనుమతులు పొందింది ఏపీనే
- మరిన్ని అనుమతులు కోరుతోంది.. అవీ ఇస్తాం

**'సాక్షి'తో కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌశల్ కిశోర్**



ఇబ్రహీంపట్నంలో జగనన్న కాలనీ సందర్శించిన కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్, అధికారులు

**సాక్షి, అమరావతి:** పేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే నంబర్–1 స్థానంలో ఉందని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ చెప్పారు. అర్హులైన వారందరికీ గృహ నిర్మాణం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అద్భుతమని ప్రశంసించారు. అధికారిక పర్యటనలో భాగంగా విజయవాడకు వచ్చిన మంత్రి కిశోర్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..

**అత్యధికంగా ఏపీలోనే**

పేదల ఇళ్ల నిర్మాణం దేశంలోనే అత్యధికంగా ఏపీలో జరుగుతోంది. కేంద్రం నుంచి ఈ రాష్ట్రానికే అత్యధికంగా ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇచ్చాం. ఇంకా అదనంగా అనుమతులు కావాలని కోరారు. వాటినీ అనుమతిస్తాం. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సకాలంలో మంజూరయ్యేలా చూస్తాం. హౌసింగ్ మిషన్ కింద దేశంలోని ప్రతి పేదవాడికి ఇల్లు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి.

**ఇళ్ల పట్టాల పంపిణీ అభినందనీయం**

ఇళ్ల పథకం అమలులో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వమే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఇది ఎంతో అభినందనీయమైన అంశం. ప్రభుత్వాలు కేవలం ఇళ్లు కట్టుకోవడానికి సాయం చేస్తే స్థలం లేని, కొనలేని దుస్థితిలో ఉన్న నిరుపేదలు ఇంటిని నిర్మించుకోలేరు. అయితే, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్ల స్థలాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. పేదలందరికీ పక్కా గృహాల కల్పనకు ఇది ఎంతో దోహదపడుతోంది.

**లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయం**

రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిగా స్థానిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల ఆలోచనా విధానం మారుతుంది. 2018 ఎన్నికల్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇదే రాష్ట్రాల్లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సీట్లు గెల్చుకుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలు ఆత్మనిర్భర్ భారత్‌కే పట్టం కడతారు. బీజేపీ సొంతంగా 300 సీట్లతో కేంద్రంలో తిరిగి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది.

**గృహ నిర్మాణంపై అధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష**

దేశంలోని పేదలందరికీ 2024 సంవత్సరానికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయమని కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్ చెప్పారు. ఆయన మంగళవారం విజయవాడలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గృహ నిర్మాణం తీరును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అధికార కార్యక్రమాల్లో భాగంగా సమీక్షకు హాజరుకాలేకపోయిన మంత్రి జోగి రమేశ్ తన సందేశాన్ని కేంద్ర మంత్రికి పంపారు. ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తిచేయటానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ కేంద్ర మంత్రికి వివరించారు. లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇస్తున్నామని, సిమెంటు, ఐరన్ ఇతర నిర్మాణ సామగ్రిని మార్కెట్ ధరకంటే తక్కువకు అందిస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎండీ లక్ష్మీ షా, నవరత్నాలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

**జగనన్న కాలనీని పరిశీలించిన కేంద్ర మంత్రి**

**ఇబ్రహీంపట్నం:** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గాజులపేట వద్ద ఉన్న జగనన్న కాలనీని కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్ మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సహకారంతో సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆయనకు వివరించారు.

## వచ్చే పది నెలల్లో పది లక్షల కేంద్ర ఉద్యోగాలు

**వేగంగా భర్తీ చేసే లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్):** రాబోయే పది నెలల్లో పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే 3.6 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినట్టు తెలిపారు. అదే తెలంగాణలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే.. కేసుల పేరుతో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌తో ఉద్యోగాల భర్తీ ఎలా ఆగిపోయిందో చూశామన్నారు. కానీ కేంద్రం చేపట్టిన రిక్రూట్‌మెంట్లలో ఎలాంటి చిన్న లోపం, అవినీతికి తావు లేకుండా భర్తీ చేశారని చెప్పారు.దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మంగళవారం వర్చువల్‌గా నియామక పత్రాలు అందించారు. దీనికి సంబంధించి సికింద్రాబాద్ ఎస్వీఐటీ ఆడిటోరియంలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. పోస్టల్, రైల్వే, ఆడిట్, సీఆర్‌పీఎఫ్ తదితర శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన పలువురికి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు.

**దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి కిషన్‌రెడ్డి సూచించారు. పగలు, రాత్రి కష్టపడి ఉద్యోగాలు సంపాదించేందుకు సహకరించిన తల్లిదండ్రులను మరచిపోవద్దన్నారు. పొందిన ఉద్యోగం ద్వారా వీలైనంత మేరకు పేదలకు సాయం చేయాలన్నారు.



భూమ్మీది అన్ని జీవులూ అశాశ్వతమైనవే – ఎవరైనా దీన్ని వివేకంతో గమనించగలిగితే, అప్పుడు బాధల నుంచి దూరం కాగలుగుతాడు.

– బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, 17 మే 2023

# సంక్షోభం నుంచి సంక్షోభానికి!

రాజకీయాల్లో సంక్షోభాలు సహజమే కానీ, నిరంతరం సంక్షోభం నుంచి సంక్షోభానికి ప్రయాణించడం కష్టమే. జాతీయ వేదికపై మోదీ ఆవిర్భావం, బీజేపీ దూకుడు ఆరంభమైనప్పటి నుంచి వరుస ఎదురుదెబ్బలతో ఇబ్బంది పడుతున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అలానే ఉంది. కర్ణాటకలో శనివారం దక్కిన ఘన విజయాన్ని ఆస్వాదించక ముందే అక్కడ సీఎం సీటుకై ప్రత్యర్థుల పోటీ మూడు రోజులుగా సాగుతూ పార్టీకి తలనొప్పిగా తయారైంది. మరోపక్క కన్నడనాట పోలింగ్‌కు సరిగ్గా ముందురోజు రాజస్థాన్‌లో సొంత ప్రభుత్వంపైనే మళ్ళీ ధ్వజమెత్తి, పాత కుంపటి కొత్తగా రాజేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ వ్యవహారంతో అధిష్ఠానానికి తలబొప్పి కడుతోంది. మరో ఆరేడు నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలున్న వేళ రాజస్థాన్‌లో పొంచివున్న అంతర్గత తిరుగుబాటుతో పార్టీ సతమతమవుతోంది. అజ్మీర్ నుంచి జైపూర్ దాకా 5 రోజులు 125 కిలోమీటర్ల 'జన్ సంఘర్ష్ పాదయాత్ర' చేసిన సచిన్, సోమవారం ముగింపు ర్యాలీలో అశోక్ గెహ్లోత్ సారథ్యంలోని సొంత పార్టీ సర్కారుకే ఇచ్చిన అల్టిమేటమ్ అలాంటిది మరి. మరో 15 రోజుల్లో, మే నెలాఖరుకల్లా తన డిమాండ్లను నెరవేర్చకపోతే, రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతానన్న సచిన్ గర్జన ఆందోళన రేపుతోంది.

తాజా హెచ్చరికతో రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్‌కూ, ఆయన జూనియర్ సహచరుడు సచిన్ పైలట్‌కూ మధ్య కొన్నేళ్ళుగా సాగుతున్న పోరాటం కీలక దశకు చేరుకున్నట్టు కనిపిస్తోంది. సచిన్ డిమాండ్లు మూడు: 'అవినీతిమయ' రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేసి, నిపుణులతో పునర్వ్యవస్థీకరించాలి. పేపర్ లీకులతో ఉద్యోగ భర్తీ పరీక్షలు రద్దు చేసినందున యువతరానికి తగిన పరిహారం చెల్లించాలి. 2013 నుంచి 2018 వరకు పాలన సాగించిన మునుపటి వసుంధరా రాజె సర్కార్ అవినీతిపై నిష్పాక్షిక విచారణకు ఆదేశించాలి. నిజానికి, అధిష్ఠానం హెచ్చరించి ఏప్రిల్ 10న జైపూర్‌లో ఒక రోజు నిరసన నిరాహార దీక్ష, ఇప్పుడీ యాత్ర చేసి, తాజాగా డిమాండ్లు నెరవేరకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన తప్పదంటూ సచిన్ పూర్తిస్థాయి ధిక్కార స్వరంలోకి దిగిపోవడం గమనార్హం. తాను చేస్తున్న ఈ పోరాటం పార్టీ మీద, వ్యక్తుల మీద కాదు... అవినీతిపైన, యువతరం కోసమని ఈ యువ నేత పైకి చెబుతున్నారు. కానీ, ఆయన గురిపెట్టింది తనను సీఎం కానివ్వకుండా చేసిన అశోక్ గెహ్లోత్‌ను అనీ, అసలు లక్ష్యం సీఎం పీఠమనీ బహిరంగ రహస్యం.

అశోక్‌కి చెప్పులో రాయి చెవిలో జోరీగలా తయారైన సచిన్‌ను అంత తొందరగా పక్కన పెట్టడం పార్టీకి కష్టమే. ఎందుకంటే, ఆయన కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో గణనీయంగా ఉన్న గుజ్జర్ల వర్గానికి చెందిన నేత. పైగా యువతరంలో పాపులర్. పైగా, వయసు మీరిన అశోక్ పార్టీకి గతమైతే, 45 ఏళ్ల యువ సచిన్ పార్టీకి అవసరమైన భవిష్యత్తు. సచిన్ పార్టీని వీడినా, సొంత కుంపటి పెట్టుకున్నా కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బే. గడచిన 2018 ఎన్నికల్లో పీసీసీ రథసారథిగా రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రంగా శ్రమించిన చరిత్ర సచిన్‌ది. అప్పుడే సీఎంను చేస్తామని సచిన్‌కు మాటిచ్చి, అశోక్‌తో రాజీ ఫార్ములాలో డిప్యూటీ సీఎంగా సరిపుచ్చి, అనివార్యతలు ఏమైనా గడువు తీరినా సీఎంను మార్చక ఏమార్చడం అధిష్ఠానం స్వయంకృతాపరాధం. అందుకే, సచిన్ పదే పదే లక్ష్మణరేఖ దాటుతున్నా ఉపేక్షించక తప్పని పరిస్థితి. మూడేళ్ళ క్రితం 2020లోనే సచిన్ తిరుగుబాటు చేశారు. అప్పుడే అశోక్, సచిన్‌ల మధ్య విభేదాలు సర్కార్‌ను సంక్షోభంలోకి నెట్టాయి. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఎప్పటికప్పుడు సర్దుబాట్లు, బుజ్జగింపులతో ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నం అధిష్ఠానం చేస్తున్నా అవేవీ ఆచరణలో ఫలించడం లేదన్నది తాజా పరిణామాల తాత్పర్యం.

అశోక్ తప్పులూ అనేకం. రాజస్థాన్‌ను వదిలి, పార్టీ జాతీయ అధ్యక్ష పీఠం తీసుకొమ్మని అధిష్ఠానం కోరినా, మనస్కరించని ఆయన గత సెప్టెంబర్‌లో తన ఎమ్మెల్యేలతో నడిపిన నాటకం తెలిసిందే. అధిష్ఠానం అభీష్టాన్ని సైతం తెలివిగా పక్కకు తప్పించి అశోక్ సీఎంగానే కొనసాగడం, దూతగా వెళ్ళిన ఖర్గే విఫలమై చివరకు అనూహ్యంగా పార్టీ అధ్యక్షుడు కావడం, సీఎం సీటుపై సచిన్ ఆశలు మళ్ళీ నీరుగారడం ఒకప్పటి బలసంపన్న కాంగ్రెస్‌లోనైతే కలలో కూడా ఊహించలేం. అశోక్‌కు వసుంధరా రాజెతో అవగాహన, ఆత్మీయత ఉన్నాయనేది సచిన్ ఆరోపణ. అప్పట్లో అశోక్ వర్గ ఎమ్మెల్యేల పైన, ఇప్పుడు సచిన్ పైన చర్యలు తప్పవని పార్టీ నాయకత్వం బీరాలు పలికినా, చెబుతున్న 'పెద్ద శస్త్రచికిత్స' మాటలకే పరిమితమైంది. కాంగ్రెస్ అనివార్యత అర్థం చేసుకోదగినదే. ఎన్నికలకు అశోక్ సారథ్యాన్ని సహించే పరిస్థితిలో సచిన్ లేరు. అలాగని ఎన్నికలకు ముందు 2021 సెప్టెంబర్‌లో పంజాబ్‌లో సీఎంను మార్చి, చేజేతులా ఓటమి తెచ్చుకున్న హస్తం పార్టీకి మరో దుస్సాహసం చేసే ధైర్యం లేదు. ఇక, అశోక్ సారథ్యంలోనే రాజస్థాన్‌లో పార్టీ మళ్ళీ గెలిచినా, మరో అయిదున్నరేళ్ళు నిరీక్షించే ఓపిక ఇప్పటికే ఒకసారి మోసపోయాననుకుంటున్న సచిన్‌కు లేదు.

రాజకీయ ధురంధరుడైన అశోక్ సంక్షేమం, సామాజిక న్యాయమే మంత్రాలుగా పేదల ప్రభుత్వమనే పేరుకై పరిశ్రమిస్తున్నారు. ఇదే తననూ, తమ పార్టీనీ ఎన్నికల్లో గట్టెక్కిస్తుందని బలంగా నమ్ముతున్నారు. ఆ మాటేమో కానీ, అంతర్గత పోరుతో పార్టీ పలచనైపోతోంది. అశోక్ వివేకాన్ని ప్రదర్శిస్తూ సచిన్‌ను కలుపుకొనిపోవడం, పిన్న వయస్కుడైన సచిన్ సహనంతో నిరీక్షించడం, అధిష్ఠానం తన పెద్దరికాన్నీ, నాయకత్వాన్నీ చూపడం అత్యవసరం. పార్టీ పెద్దలు తక్షణమే పరిస్థితిని చక్కదిద్దకపోతే కష్టం. జాప్యమయ్యేకొద్దీ బీజేపీకి కలిసొస్తుంది. పిట్ట పోరు, పిట్ట పోరు పిల్లి తీరుస్తుంది.

# కాలం చెల్లిన వృద్ధి నమూనా

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**ఆర్థిక వృద్ధి రేటుపై ప్రపంచానికి మితిమీరిన వ్యామోహం ఉంది. దీనివల్ల పర్యావరణానికి సంబంధించిన క్రమశిక్షణ కనుమరుగైపోయింది. ఆర్థిక వృద్ధి రేటు ఒక్కటి మెరుగ్గా ఉంటే చాలు, 'అంతా బాగానే ఉంది' అనే స్థితి అదే వస్తుందనే నమ్మకానికి అనుగుణంగా మనల్ని మలిచారు. కానీ ఈ పేరుతో సహజ వనరుల దోపిడీ ఎంత జరుగుతున్నదో మనం విస్మరిస్తున్నాం. నిజానికి 'సహజ వనరులు, పర్యావరణ సేవలు' అనేవి పరిశ్రమలకు ఉచితంగా అందిస్తూ చాలా వస్తువుల ఖర్చును సమాజమే పరోక్షంగా భరిస్తున్నది. పైగా ఇప్పటి ఆర్థిక విధానాలన్నీ సంపద ఒక్కచోట పోగయ్యేలా మాత్రమే పనిచేస్తున్నాయి. అందుకే వాతావరణ ఉపద్రవానికి దారితీస్తున్న ఆర్థిక రూపకల్పనకు మరమ్మతు చేయగలిగిన నాయకత్వం ప్రపంచానికి అవసరం.**

ఐర్లండ్ అధ్యక్షుడు మైఖేల్ డేనియల్ హిగ్గిన్స్, ఆర్థిక పురోగతిపై మితిమీరిన వ్యామోహాన్ని తీవ్రంగా విమర్శించారు. చాలామంది ఆర్థికవేత్తలు ఎడతెగని వృద్ధి కథనంలో చిక్కుకుపోయి ఉన్నారనీ, సంకుచితంగా నిర్వచించిన సామర్థ్యం, ఉత్పాదకత, శాశ్వతమైన వృద్ధి ఫలితంగా పర్యావరణానికి సంబంధించిన క్రమశిక్షణ కనుమరుగైందనీ, మనం ఇప్పుడు ఎదుర్కొంటున్న జీవావరణ విపత్తుకు అదే కారణమనీ ఆయన పేర్కొన్నారు.

ఇది, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ముందు ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శి బాన్ కి మూన్ దశాబ్దం క్రితం చేసిన ప్రసంగంలో చెప్పిన విషయాన్ని నాకు మళ్లీ గుర్తుకు తెస్తోంది. 'వాతావరణ ఉపద్రవానికి దారితీస్తున్న ఆర్థిక రూపకల్పనను మరమ్మతు చేయగలిగిన నాయకత్వం ప్రపంచానికి అవసరం' అని ఆయన అన్నారు. మరో మాటల్లో చెప్పాలంటే, ఆయన కూడా, ప్రపంచాన్ని ఆకస్మికమైన, కోరుకోలేని మార్పులకు సన్నిహితంగా ప్రమాదకరంగా తీసుకెళుతున్న ఆర్థిక వృద్ధి నమూనాను మరమ్మతు చేయాల్సిన అవసరముందని మాట్లాడుతూ వచ్చారు.

అయితే ఈ హెచ్చరికను ఎవరూ వినిపించుకోలేదు. వాతావరణాన్ని తట్టుకోగల విధానాలను చేపట్టవలసిన ఆవశ్యకతపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసినప్పటికీ, మార్పు తేగలిగేలా చేపట్టాల్సిన విధానాలు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి. చివరకు వాతావరణ మార్పుపై అంతర్ ప్రభుత్వ ప్యానెల్ (ఐపీసీసీ) తాజా సంశ్లేషణాత్మక నివేదిక కూడా అందరూ జీవించదగిన, స్థిరమైన భవిష్యత్తును పదిలపర్చే అవకాశాల గవాక్షం వేగంగా మూసుకుపోతోందని స్పష్టంగా చెబుతోంది. అయినా జంట బ్రెట్టన్ వుడ్స్ సంస్థలు లేదా విదేశీ సంస్థాగత మదుపుదారులు, వేళ్లమీద లెక్కించదగిన క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఇంకా మేల్కొనలేదు. మార్పు ఎంత ఎక్కువగా అవసరమో, మరింత ఎక్కువగా పరిణామాలు అలాగే ఉన్నాయి.

ప్రధాన స్రవంతి ఆలోచనను సవాలు చేసేలా సముచిత ప్రశ్నలను ఎప్పుడు లేవనెత్తినా, ఆర్థిక సమాజం నుంచి వచ్చే సామూహిక స్పందన ఏమిటంటే, ఆర్థికాన్ని అర్థం చేసుకోని వ్యక్తుల ఊహగా వాటిని పేర్కొంటూ ఆ బలమైన స్వరాలను కొట్టి వేస్తుంటారు. కార్పొరేట్ మీడియా స్పష్టంగానే ఈ అభిప్రాయాన్ని చాటిచెప్పడాన్ని ఇష్టపడుతుంటుంది. నిజానికి ముఖ్యమైన వార్తాపత్రికలలో ప్రచురితమైన కథనాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, ఇంకా అత్యధిక వృద్ధి వైపు తరలివెళ్లడం వైపు వాదనను బహిరంగంగా మళ్లించే విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, బ్యాంకులకు చెందిన ప్రధాన ఆర్థిక వేత్తలు పత్రికల స్థలాన్ని ఆక్రమించడం పెరుగుతున్నట్లు కనబడుతుంది. ఇవి సాధారణ సమర్థనలను కలిగి ఉంటాయి. కానీ



ప్రపంచం ఎదుర్కొంటున్న మనుగడకి సంబంధించిన ప్రమాదం రీత్యా వారి స్వరంలో కొంతైనా మార్పు ఉండాలని నేను ఆశించాను.

మీడియాలో ఒక వర్గానికీ, వీధుల్లోని విద్యావంతులకూ ఇది సాధారణ వ్యవహారమే. దీనికి ప్రధానంగా మన సామూహిక ఆలోచనలో పాతుకుపోయిన 'టిఐఎస్ఏ' (దేర్ ఈజ్ నో ఆల్టర్నేటివ్–ప్రత్యామ్నాయం అనేది లేదు) భావనే కారణం. మనం దీన్ని ఇష్టపడినా లేకున్నా చెప్పాల్సింది ఏమంటే– 'అంతా బాగానే ఉంది' అనే స్థితికి ఆర్థిక వృద్ధి దారి తీస్తుందనే నమ్మకానికి అనుగుణంగా మనం మల్చబడ్డాము. దిగజారే వాతావరణ పరిస్థితులకు కూడా ఆర్థిక వృద్ధి రక్షకురాలిగా ఆవిర్భవిస్తుంది అనే సాధారణ ఆలోచన ఇప్పటికీ ఉనికిలో ఉంది. ఎందుకంటే పర్యావరణ విధ్వంసంలోనూ, సహజవనరుల క్షీణతలోనూ, వాతావరణ విపత్తులోనూ మనం చూస్తున్న ఆదాయ అసమానత్వ విస్ఫోటనంలోనూ, ప్రపంచం కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని మనకు చెప్పడాన్ని ఆర్థికవేత్తలు మానుకున్నారు. ఇవన్నీ కాలం చెల్లిపోయిన ఆర్థిక సూత్రాల ఫలితమే. కానీ అభివృద్ధి అనే సంతోషంలో మనం వాటిని విస్మరిస్తున్నాం.

తరం తర్వాత తరం గ్రహిస్తున్న ఆర్థిక వృద్ధి సిద్ధాంతాలకు కాలేజీలలో, యూనివర్సిటీలలో చెబుతూ వస్తున్న బోధనలే సంపూర్ణ బాధ్యత వహిస్తున్నాయని ఐరిష్ అధ్యక్షుడు భావిస్తున్నారు. ఆర్థిక శాస్త్రాన్ని ఎలా బోధిస్తున్నారు, ఎలా ప్రశ్నిస్తున్నారు అనే అంశం అతి ముఖ్యమైనది అంటున్న ఆయన, 'ఆర్థిక శాస్త్ర బోధనలో విధానాల బహుళత్వానికి వీలు కల్పించడం అంటే విద్యార్థుల ప్రాథమిక హక్కులను, నిజానికి పౌరుల హక్కుల్ని లేకుండా చేయడమే' అని చెప్పారు.

ఈ రచయిత కూడా, వృద్ధిని ప్రజాకేంద్రకంగా మార్చేందుకు, ఆర్థిక అధ్యయనాలకు సామాజికంగా, పర్యావరణపరంగా ప్రాసంగికతను చేకూర్చడం కోసం, పైవిధమైన ప్రశ్నలను మళ్లీ మళ్లీ అడుగుతూ వచ్చాడు. కానీ ప్రజలకు, భూమండలానికి సంబంధించినంత వరకు ఆర్థిక శాస్త్రంపై పునరాలోచన చేసే దిశగా మన ప్రధాన స్రవంతి చొరవ చేపట్టడం చివరిసారిగా ఎప్పుడు జరిగింది?

మొత్తం వ్యవస్థ ఎలా డిజైన్ చేయబడిందంటే, ఉచిత సహజ పెట్టుబడితో పాటు (అంటే సహజ వనరులు, పర్యావరణ సేవలు అని అర్థం) ప్రభుత్వం నుంచి కూడా పరిశ్రమలు భారీ స్థాయిలో లాభాలను పొందుతున్నాయి. అసలైన మూల్యాన్ని పరోక్షంగా భారీ స్థాయిలో సమాజం భరించాక ధరలు స్థిరపడు తున్నాయి. మనం కొంటున్న డాలర్ ఆహారం ధర నిజానికి మూడురెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ఆహారం ధర చౌకగా ఉండాలని కోరుకుంటున్నాము కాబట్టి మనం దాన్ని ప్రశ్నించము. ఐక్యరాజ్యసమితి తరఫున 'ది ఎకనమిక్స్ ఆఫ్ ఎకో సిస్టమ్స్ అండ్ బయోడైవర్సిటీ' (టీఈఈబీ) ఇటీవల ఓ అధ్యయనం చేసింది. దక్షిణాసియాలో వరి, గోధుమతో సహా ప్రపంచ వ్యాప్తంగా వేలాది ప్రాథమిక ఉత్పత్తి, ప్రాసెసింగ్ రంగాలు, అలాగే అమెరికాలో పశువుల పెంపకం వంటి వివరాలను ఇది పరిశీలించింది. ప్రతి యేటా వీటి కోసం 7.3 ట్రిలియన్ డాలర్ల విలువైన సహజ వనరులను మింగేస్తున్నారని తెలిపింది. ఇదంతా కూడా అధిక వృద్ధి రేటు అన్వేషణ పేరుతో జరుగుతోంది.

మనం మౌలిక వసతులపై ఉచితాలు, ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలు, గుణాత్మక సడలింపు (అదనపు డబ్బును ముద్రించడం). భారీ ఎత్తున పన్ను రాయితీలు, బ్యాంకుల బకాయిల రద్దు వంటివాటిని చూసినట్లయితే, ఆర్థిక సమతూకం సంపన్నులకు సేవ చేయడానికే ఎక్కువగా ఉపయోగపడుతోందని తెలుస్తుంది. ప్రయోజనాలు కింది దాకా ప్రయాణించాయన్న ఊహ కూడా చాలావరకు నిరాధారమైనదే. ఉదాహరణకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ జరిపిన అధ్యయనం 50 సంవత్సరాల కాలంలో (1965–2015), 18 సంపన్న దేశాల్లో పన్ను రాయితీలు ఆర్థికాభివృద్ధిపై, నిరుద్యోగంపై ఏమంత గణనీయ ప్రభావం చూపలేదని తెలిపింది. సులభంగా చెప్పాలంటే, ప్రభుత్వ ఖజానా నుంచి అత్యంత సంపన్న వర్గాల జేబుల్లోకి ఆదాయాన్ని పంపిణీ చేయడంలోనే ఈ పన్ను రాయితీలు విజయం సాధించాయి.

ప్రపంచ సంపదలో 48 శాతాన్ని 1 శాతం అగ్రశ్రేణి వర్గం సొంతం చేసుకుందని క్రెడిట్ స్విస్ సంస్థ అంచనా వేస్తుండగా, బహుళ జాతీయ సంస్థల లాభాల్లో 40 శాతం ప్రతి సంవత్సరం పన్నులు లేని దేశాలకు తరలిపోతున్నాయని అంచనా వేశారు. ఈ మొత్తం 2019లోనే 1 ట్రిలియన్ డాలర్లుగా ఉండేది. గత దశాబ్దంలో వాల్ స్ట్రీట్ బ్యాంకులు సంపాదించిన మరొక ట్రిలియన్ డాలర్ల లాభాలను కూడా దీనికి జోడించండి. అసమర్థ ఆర్థిక వ్యవస్థ ఒకేచోట సంపదను కూడగట్టడంలో సాయపడిందని తెలుస్తుంది.

ఆర్థిక వృద్ధి నమూనాకు కాలం చెల్లిపోయింది. ముంచుకొస్తున్న వాతావరణ విపత్తు గురించిన భయం, ప్రపంచాన్ని వృద్ధిపై తప్పని సరి వ్యామోహాన్ని వదులుకునేలా చేస్తుందని ఆశిద్దాము.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### వాళ్లే పొడవు




భారతీయుల్లో చాలా మంది తూర్పు ఆసియన్లు (ముఖ్యంగా చైనీయులు) పొట్టివాళ్లని అనుకుంటారు. 2020 లాన్సెట్ అధ్యయనం, అత్యధిక తూర్పు ఆసియన్ దేశాల జనం (ప్రత్యేకించి చైనా) భారతీయుల కంటే పొడవైనవాళ్లని తేల్చింది. సగటు పొడవు – చైనా: 175.7 సెం.మీ. ఇండియా: 166.5 సెం.మీ.

– ఆరన్ గ్యాంగ్, పరిశోధకుడు

### మనవి ధరించొద్దా?



వందేభారత్ రైల్లో ఢిల్లీకి కుర్తా ధోతీ ధరించి వెళ్తున్నాను. చాలామంది 'పండిట్‌జీ! మీరు ఇక్కడ ఎందుకున్నారు?' అన్నట్టుగా నా వైపు చూస్తున్నారు. అమ్మో, నిర్వలసీకరణ అనేది ఊహించినదానికంటే చాలా కష్టం.

– ఆదిత్యా రాజ్ సిన్హా, వ్యాఖ్యాత

### ఉపశమనం కోసం



హీటింగ్ ప్యాడ్ కోసం అర్ధరాత్రి రెండు గంటలకు ఫార్మసీకి పరుగెత్తాల్సి రావడమా? గర్భిణిగా అనుభవించే నొప్పుల గురించి నేను మరిచిపోయాను.

– సెరెనా విలియమ్స్ టెన్నిస్ క్రీడాకారిణి

### తప్పని బంధం



నా కజిన్ ఒకరు వైవాహిక బంధంలో చాలా బాధలు పడుతోంది. దాన్ని తెగతెంపులు చేసుకోవాలని తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లింది. కానీ వాళ్లు మద్దతివ్వలేదు. వాళ్ల పెద్దన్న బాగా డబ్బులు సంపాదిస్తున్నారు, ఆయనా నిలబడలేదు. దాంతో ఆమె మళ్లీ అదే బంధంలోకి వెళ్లిపోయింది; కానీ ఇప్పుడు మామూలు వివాహితుల్లా వాళ్లు ఎటూ ఉండలేరు. చూస్తుంటే ఇది ప్రతి మూడో మహిళ కథలా ఉంది.

– సంజుక్తా బసు, జర్నలిస్ట్

### ఆత్మ నిర్భరత?



'అరే ఇది ఇంపోర్టెడ్ భాయీ' అనే మాట ఇంతకు ముందులా ఇప్పుడు వినబడటం లేదని మీరు గమనించారా?

– అమితాబ్ బచ్చన్ నటుడు



# దేశంలో మత స్వేచ్ఛకు ఇబ్బందులా?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతదేశంలో మైనారిటీలు మతపరమైన వేధింపులను ఎదుర్కొంటున్నారనీ, భారతదేశాన్ని 'కంట్రీ ఆఫ్ పర్టికులర్ కన్సర్న్' (సీపీసీ) లిస్టులో పెట్టి, దానిపై ఆంక్షలు విధించాలనీ 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్'(యూఎస్‌సీఐఆర్ఎఫ్) తన వార్షిక నివేదికలో బైడెన్ ప్రభుత్వానికి నివేదిక అందించడం... భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే!

ప్రపంచ దేశాలపై పెద్దన్న పాత్ర పోషించడానికి 1998లో 'ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్ ఏక్ట్' ద్వారా అమెరికా ప్రభుత్వం ఏర్పరిచిన ఒక ప్రభుత్వ సంస్థ యూఎస్‌సీఐఆర్ఎఫ్. ఈ సంస్థ ప్రతినిధులను అమెరికా ప్రెసిడెంట్, అమెరికా రెండు చట్ట సభల, రెండు పార్టీల అధ్యక్షులు కలిసి నియమిస్తారు. కాగా భారత్‌కు వ్యతిరేకంగా పనిచేసే మీడియా సంస్థలు దీన్ని ఒక స్వతంత్ర సంస్థగా పేర్కొనడం ఆశ్చర్యం కలిగించే విషయం!

ఇక ఈ సంస్థ నివేదికలోని అంశాలను చూద్దాం! భారతదేశంలో హిందువులను మతం మార్చడానికి అవకాశం లేకుండా చట్టాలను మోదీ ప్రభుత్వం తయారు చేసింది. రాజ్యాంగంలోని గోవధ నిషేధ చట్టాలను అమలు చేసి, గోభక్షకులకు ఇబ్బంది కలిగిస్తోంది. హిజాబ్ ధరించడం పైన ఆంక్షలు విధించి, ముస్లింలను మానసికంగా క్షోభకు గురిచేస్తోంది. ఎఫ్‌ఆర్‌సీఏ నియమాలను కఠినంగా అమలు చేసి, అనేక ఎన్జీఓలను మూతపడేటట్లు చేసి, క్రైస్తవ మత మార్పిడి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసింది. పైన తెలిపిన పనులను కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్రాల్లోని స్థానిక ప్రభుత్వాలు తు.చ. తప్పకుండా అమలు చేయడం వలన దేశంలోని మైనారిటీలకు ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, దళితులు, ఆదివాసీ తెగల ప్రజలు తమ మత ఆచారాల ప్రకారం జీవనాన్ని సాగించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, భారత ప్రభుత్వంపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలనీ, సదరు సంస్థ బైడెన్ ప్రభుత్వాన్ని కోరింది.

ఈ సంస్థ నివేదికపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మీడియా ప్రతినిధి అరిందం బాగ్చీ ఘాటుగానే స్పందించారు. ఇది పక్షపాతంతో కూడిన నివేదిక అనీ, ఇలాంటి నివేదిక వల్ల భారత్, అమెరికా దేశ సంబంధాలు దెబ్బతింటాయనీ, ప్రత్యేక ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని ఈ రిపోర్టు తయారైందనీ అన్నారు. ఇందుకు ప్రతిస్పందన ఇంకా రాలేదు. అస్సాం రాష్ట్రంలో ఎన్ఆర్‌సీ అమలు గురించి అస్సాం హైకోర్టు ఆర్డర్ వేస్తే అది అస్సాం ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ అని నివేదికలో పేర్కొనడం, సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్ గురించి, కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 ఆర్టికల్ రద్దు గురించి నివేదికలో పేర్కొనడం సంస్థ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో మైనార్టీలు మత హక్కులను అనుభవిస్తుంటే ఇది మన దేశంపై బురద జల్లుతోంది.. భారత్ రక్షణ పరంగా ఆయుధాలను సమకూర్చుకోవడంలో స్వయం సమృద్ధిని సాధిస్తోంది. ఫార్మా లాబీలో అమెరికా ఆటలు సాగడం లేదు. అమెరికా నుండి పనిచేసే మతమార్పిడి సంస్థల ఆటలు సాగడం లేదు. అందుకే యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదిక అంతగా భారత్‌పై బురదజల్లుతోంది. దీన్ని దేశంలో ఉన్న కుహనా మేధావులు అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

# భారత ప్రతిష్ఠకు ఈ మైత్రి గొడ్డలిపెట్టు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"భారత్ – ఇజ్రాయెలీ పాలకులు చెట్టపట్టాలు కట్టుకుని సాగడం భారత్ సార్వభౌమాధికార ప్రతిపత్తికి ప్రమాదకరం."


– నోమ్ చామ్‌స్కీ

"ఇండియాలో పైకి కానరాకుండా గోప్యంగా కొందరు కాపాడుతున్నది 'హిందూస్తాన్' నినాదం. ఈ పదం ప్రభుత్వ వ్యవస్థను నర్మగర్భంగా తీర్చిదిద్దుతూ స్వేచ్ఛకు, నిర్బంధ విధానానికి మధ్య సరిహద్దుల్ని నిర్ణయిస్తూ ఉంటుంది. దేన్ని అనుమతించాలి, దేన్ని తొక్కిపట్టాలి అన్నదే ఆ నిర్ణయం. 'హిందూస్తాన్' అన్నది అసలు పర్షియన్ పదం. ఆ పదాన్ని ఏకపక్షంగా సంఘ్ పరివార్ తారుమారు చేసింద'ని పెర్రీ ఆండర్సన్ బహిర్గతం చేశాడు (ది ఇండియన్ ఐడియాలజీ, వెర్సో బుక్స్ లండన్, 2013). ఈ వాస్తవాలు తెలుసుకాబట్టే కొందరు భారతీయ హేతువాద ప్రముఖులు కూడా 'నేను హిందువును ఎందుకని కాను', 'నేను భారతీయుణ్ణి' అని బాహాటంగా ప్రకటించుకున్నారు. అలాగే పెర్రీ ఆండర్సన్ తన 'ఇండియన్ ఐడియాలజీ' గ్రంథంలో ఇజ్రాయెల్‌లో 'లికుడ్', ఇండియాలో 'భారతీయ జనతా పార్టీ', ఐర్లాండ్‌లో 'ఫియానా ఫాయిల్' మితవాద పార్టీలుగా ఎలా అవతరించాయి, వాటిమధ్య ఉన్న పోలికలేమిటి వంటి వాటిని వివరంగా పేర్కొన్నారు.

పాలస్తీనియన్లను అణగదొక్కడానికి ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం కావాలి. ఆసియా, ఆఫ్రికాలలో ప్రాబల్యం పెంచుకోవడానికి అమెరికాకు ఇజ్రాయెల్ చేదోడు వాదోడు కావాలి. ఈ మధ్యలో భారత పాలకవర్గాల ప్రయోజనాల కోసం ఇజ్రాయెల్‌తో స్నేహాలు అవసరమయ్యాయి. స్వతంత్ర భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు ఇజ్రాయెల్‌తో 'స్నేహం' మూలంగా ఎంతటి హాని కలిగిందో ప్రసిద్ధ అంతర్జాతీయ జర్నలిస్ట్ అజాద్ ఎస్సా తన తాజా గ్రంథం 'హాస్టయిల్ హోమ్‌లాండ్స్: ది న్యూ అలయెన్స్ బిట్వీన్ ఇండియా అండ్ ఇజ్రాయెల్'లో వివరించారు. ఇలా ఇజ్రాయెల్‌తో భారత స్వతంత్ర ప్రతిపత్తికి విరుద్ధంగా ప్రస్తుత భారత పాలకులు చేతులు కలిపారనేది చామ్‌స్కీ వివరణ.

బీజేపీ (ఆరెస్సెస్) అధికారంలోకి వచ్చిన తరువాత భారత్–ఇజ్రాయెల్‌ల మధ్య సాధారణ దౌత్య సంబంధాల కన్నా ఎక్కువగా సంబంధాలు పెరిగాయి. 'ఎన్ఎస్ఓ గ్రూప్ టెక్నాలజీస్' అనే ఇజ్రాయెలీ సంస్థ రూపొందించిన 'పెగసస్' నిఘా సాఫ్ట్‌వేర్‌ను పొందడం కోసం నేటి భారత్ పాలకులు ఆ దేశంతో అంటకాగుతున్నారని విమర్శ ఉంది. పెగసస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి భారత పౌరులపైన, పౌర హక్కుల ఉద్యమకారులు, శాంతియుత శ్రామికవర్గ ఆందోళనకారులపైనా నిఘాపెట్టి ఉద్యమాలను పాలకులు కర్కశంగా అణచివేస్తున్నారు. ఈ విషయం బయటపడడంతో దేశంలో తీవ్రమైన నిరసన ఉద్యమాలు చెలరేగాయి. భారత్ 'పెగసస్' సాఫ్ట్‌వేర్ కొన్న తర్వాతే ఇజ్రాయెలీ ఆయుధాల కొను గోళ్లు 42 శాతం పెరిగిపోయాయి. ఫలితంగా స్వతంత్ర భారత రిపబ్లిక్ ప్రత్యేక ప్రతిపత్తి, గౌరవం పతనం కాజొచ్చాయని పరిశీలకుల భావన.

రెండో మాట




పాలస్తీనా యూదు జాతీయులకు, అరబ్బులకు మధ్య తగాదాలు సృష్టించడంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎలా అంతర్గత కలహాలు సృష్టించి లాభించచూశారో గాంధీ, నెహ్రూలు బహిర్గతం చేశారు. ఎక్కడినుంచో యూదుల్ని తీసుకొచ్చి పాలస్తీనియన్లకు స్వదేశం నుంచి ఉద్వాసన చెప్పించడానికి బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారని గాంధీ, నెహ్రూలు విమర్శించారు. ఇండియాలోని వివిధ జాతుల మధ్య తంపులు సృష్టించడం ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ పరిపాలనా రథాన్ని ఎలా కాపాడుకోదలచారో గాంధీ, నెహ్రూలు బహిర్గతం చేశారు. అలాంటి 'విభజించి – పాలించే' విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

వీరితోపాటు విశ్వకవి టాగూర్ లాంటి వారు కూడా జాతుల, వారి వైవిధ్యభరితమైన భాషా, సాంస్కృతిక ప్రత్యేకతలను గౌరవించి, కాపాడటానికే ప్రయత్నించారు. యూదుల్ని, అరబ్బుల మీదకు రెచ్చగొట్టే ప్రయత్నాలను జాతీయ నాయకులు నిరసించారు. అలాగే హిందూ–ముస్లింలను ఒకే దేశ పౌరులుగా భావించకుండా కుల, మతాల ప్రాతి పదికపైన రెండు గొప్ప జాతుల మధ్య చిచ్చు రేపజూచిన కుల, మత మౌఢ్యుల్ని వ్యతిరేకిస్తూ... భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలు, సర్వజనులూ సుఖశాంతులతో బతకాలన్న సువిశాల భావన నిజమైన భారతీయ ఉమ్మడి సొత్తు అనీ బోధించారు.

కానీ 2019 ఆగస్టు 5న బీజేపీ పాలకులు ఇందుకు విరుద్ధంగా జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిస్తున్న 370, 35 (ఏ) అధికరణలను రాజ్యాంగం నుంచి ఉపసంహరిస్తూ ప్రకటన చేశారు. అప్పటివరకు రాష్ట్రంగా ఉన్న ఈ భూభాగాన్ని జమ్మూ–కశ్మీర్, లదాక్ అనే కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసి కేంద్ర ప్రత్యక్ష పాలన కిందికి తీసుకు వచ్చారు. 2020 అక్టోబర్‌లో బీజేపీ పాలకులు తెచ్చిన కొత్త చట్టం... కశ్మీరేతరులైన ఇతర రాష్ట్రాల, ప్రాంతాల పౌరులకు కశ్మీర్‌లో స్వేచ్ఛగా ప్రవేశించి, స్థిరపడటానికీ, స్థానికుల భూములను ఆక్రమించడానికీ లేదా కొనుగోలు చేయడానికీ, తద్వారా నివాసయోగ్యత పొందడానికీ, శాశ్వత హక్కు దారులు కావడానికీ తలుపులు తెరచినట్లయింది. ఈ పరిణామం కశ్మీరేతర భారతీయ పౌరుల జనాభా కశ్మీర్‌లో పెరిగిపోవడానికీ, కశ్మీర్... స్థానిక ప్రజలకు దూరం కావడానికీ, సరికొత్త వలస పాలన కశ్మీరీల అనుభవంలోకి రావడానికి తోడ్పడుతుంది.

ఆ మాటకొస్తే కశ్మీర్‌లోనే కాదు, 2020 నుంచీ బీజేపీ పాలకులు భారతదేశంలో అటవీ భూములను సాగుచేసి బతుకుతున్న ఆదివాసీ కుటుంబాలను 'ఆక్రమణదారులని' ముద్ర వేసి, ఆ కుటుంబాల ఇళ్లను కూల్చి వేస్తోంది. ఈ కటిక నిజాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు బీజేపీ పాలకులు 'సరికొత్త మీడియా పాలసీ'ని కూడా ప్రకటించారు. ఈ చట్టం ప్రకారం 'ఏది నిజమైన వార్త, ఏది కాదు' అన్నది ప్రభుత్వ అధికారులే నిర్ణయించి, వారు 'కట్టు కథలని' ముద్ర వేసిన వార్తలు రాసిన జర్నలిస్టులపైన, ప్రచురించిన పత్రికలపైన కూడా అధికారులు చర్యలు తీసుకొంటారు. ఈ నిర్ణయం తర్వాత తమ మీద ఒత్తిళ్లు, అటకాయింపులు, వేధింపులు పెరిగిపోయాయని సర్వత్రా జర్నలిస్టుల ఫిర్యాదుల పరంపర ఎక్కువైందని మరచిపోరాదు.

ఈ వాస్తవాలన్నింటినీ పూసగుచ్చినట్టు అజాద్ ఎస్సా 'భారత–ఇజ్రాయెల్ ప్రభుత్వాల మధ్య పెనవేసుకున్న సరికొత్త అనుబంధం' తాజా గ్రంథంలో తేదీల వారీగా అక్షరబద్ధం చేశారు. మొత్తంమీద నేటి మతతత్త్వ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో నెరపుతున్న చెలిమి ఇప్పటివరకు భారత్ అనుసరిస్తున్న అంతర్గత, విదేశీ విధానాలకు గొడ్డలి పెట్టయ్యిందని చెప్పక తప్పదు.

abkprasad2006@yahoo.co.in

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.10.22 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** రేవతి ఉ.7.52 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** రా.3.23 నుండి 4.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.29 నుండి 12.22 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.41.

## క్లుప్తంగా...

### యూజీసీ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పునఃరూపకల్పన (రీడిజైన్) చేసిన వెబ్‌సైట్‌ను మంగళవారం యూజీసీ చైర్మన్ ఆచార్య ఎం.జగదీష్ కుమార్ ప్రారంభించారు. దీని ప్రత్యేకతలను వివరించారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత పాల్గొన్నారు. మరింత సులభంగా, ఉపయుక్తంగా, ఆకర్షణీయంగా యూజీసీ వెబ్‌సైట్‌ను రూపొందించారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### నీటిలో మునిగి ముగ్గురు మృతి

- విషాదంగా మిగిలిన విహారయాత్ర
- తిరుపతి జిల్లాలో ఘటన



నవీన్, మాధవ్, కార్తీక్‌ప్రసాద్ మృతదేహాలు

పిచ్చాటూరు(తిరుపతి జిల్లా): విహారయాత్రకు వచ్చి ముగ్గురు యువకులు నీట మునిగి దుర్మరణం పాలైన ఘటన తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలోని భూపతేశ్వర కోన జలపాతంలో చోటు చేసుకుంది. నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్ప కథనం మేరకు తమిళనాడులోని శివకాశికి చెందిన నవీన్, మాధవ్, మన్నార్‌గుడికి చెందిన కార్తీక్ ప్రసాద్, తిరుచ్చికి చెందిన హరిసుధన్ అనే నలుగురు చెన్నైలో ఒకే గదిలో ఉంటూ వివిధ కళాశాలల్లో చదువుకుంటున్నారు. ఈ నలుగురు చెన్నైకి చెందిన మెరీనా అనే యువతితో కలిసి మంగళవారం ఉదయం నాగలాపురం నుంచి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న భూపతేశ్వర కోన జలపాతానికి చేరుకున్నారు. ఉదయం 10.30 గంటలకు భూపతేశ్వర కోనలోని పిచ్చోడి గుండం నీటి మడుగు వద్దకు ఐదుగురు చేరుకున్నారు. ఇందులో హరిసుధన్‌కు ఈత రాదు. దీంతో అతను మడుగు గట్టుపై ఉండిపోయాడు. యువతి మెరీనా, నవీన్, మాధవ్, కార్తీక్‌ప్రసాద్ మడుగులో స్నానం చేయడానికి దిగారు. మడుగులో స్నానం చేస్తూ నవీన్, మాధవ్, కార్తీక్‌ప్రసాద్ ఎంతసేపటికీ పైకి రాలేదు. మెరీనా మాత్రం మడుగు అవతలి వైపు గట్టుకు చేరుకుంది. ఆ ప్రాంతంలో మొబైల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో గట్టుపై ఉన్న హరిసుధన్ కొంత దూరం పరిగెత్తుకొచ్చి నెట్ వర్క్ ఉన్న ప్రాంతం నుంచి నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్పకు తన లొకేషన్ చేరవేసి తన స్నేహితులు గల్లంతైన సమాచారం అందించాడు. సాయంత్రం 3 గంటలకు ముగ్గురి మృతదేహాలను గజ ఈతగాళ్లు వెలికి తీశారు. కాగా, మృతి చెందిన నవీన్, మాధవ్ ఇద్దరు అన్నదమ్ములు.

### 31 నుంచి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు


చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీఅలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. మే 31న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, జూన్ 1న శ్రీసుందరరాజస్వామి, జూన్ 2, 3, 4 తేదీల్లో శ్రీపద్మావతి అమ్మవారు తెప్పలపై విహరించనున్నారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలో అమ్మవారికి స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 3వ తేదీ రాత్రి గజవాహనం, 4వ తేదీ రాత్రి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు. తెప్పోత్సవాలను పురస్కరించుకుని కల్యాణోత్సవం, ఊంజల్ సేవను రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

### సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం



తిరుమల: తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో మంగళవారం సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం ఘనంగా ప్రారంభమైంది. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.అవధాని మాట్లాడుతూ సర్వమానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ టీటీడీ సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం చేపట్టిందని తెలిపారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య 16 గంటల పాటు నిర్విరామంగా అఖండ పారాయణ యజ్ఞం కొనసాగింది. ధర్మగిరిలోని ప్రార్థనా మందిరాన్ని వివిధ దేవతామూర్తులతో అలంకరించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు రఘునాథ్ బృందం శ్రీ హనుమాన్ జై హనుమాన్ భజనతో కార్యక్రమం ప్రారంభమైంది.

# తాగు, సాగు నీటికే తొలి ప్రాధాన్యం



## శ్రీశైలంలో జలాలపై కృష్ణా బోర్డుకు తేల్చిచెప్పిన సీడబ్ల్యూసీ

- జూన్ 1– అక్టోబర్ 31 మధ్య కనీస నీటి మట్టం 854 అడుగులు ఉండాలి
- విద్యుదుత్పత్తికంటే నికర జలాల వినియోగానికే ప్రాధాన్యం
- శ్రీశైలం ప్రాజెక్టు రూల్ కర్వ్‌లో స్పష్టంగా చెప్పిన సీడబ్ల్యూసీ
- ఇరు రాష్ట్రాల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- మరోమారు ఆర్‌ఎంసీలో చర్చించాలని బోర్డు నిర్ణయం

సాక్షి, అమరావతి: శ్రీశైలం జలాశయంలోని నీటి వినియోగంలో సాగు, తాగు అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా బోర్డుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిచెప్పింది. ప్రాజెక్టు కనీస నీటి మట్టాన్ని 854 అడుగులుగా ఖరారు చేసింది. నీటి సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు జలాశయంలో కనీస నీటి మట్టానికి ఎగువన నీటి నిల్వ ఉండేలా చూడాలని నిర్దేశించింది. శ్రీశైలంలో విద్యుదుత్పత్తికంటే 75 శాతం లభ్యత ఆధారంగా రెండు రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలను వాడుకోవడానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సాగు, తాగు నీటి అవసరాలను దెబ్బతీసేలా ఇతర అవసరాలకు అంటే విద్యుదుత్పత్తికి నీటిని వాడుకోకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీశైలం ప్రాజెక్టు రూల్ కర్వ్ (నిర్వహణ నియమావళి)లో ఈ విషయాలను స్పష్టంగా చెబుతూ కృష్ణా బోర్డుకు సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. నాగార్జున సాగర్ రూల్ కర్వ్‌పైనా సీడబ్ల్యూసీ ముసాయిదా నివేదిక ఇచ్చింది. వీటిపై రిజర్వాయర్ల మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్‌ఎంసీ)లో చర్చించినా ఏకాభిప్రాయం కుదరలేదు.

### మరోసారి ఆర్‌ఎంసీలో చర్చ

ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో విద్యుదుత్పత్తికి నియమావళి, రెండు ప్రాజెక్టుల రూల్ కర్వ్స్, మళ్లించిన వరద జలాలను కోటాలో కలపాలా వద్దా అనే అంశాలపై అధ్యయనం చేసి, నివేదిక ఇచ్చేందుకు గతేడాది మే 10న కృష్ణా బోర్డు ఆర్‌ఎంసీని ఏర్పాటు చేసింది. కృష్ణా బోర్డు అప్పటి సభ్యులు ఆర్కే పిళ్లై అధ్యక్షతన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు, జెన్‌కో డైరెక్టర్లు ఇందులో సభ్యులు. ఆర్‌ఎంసీ ఆరు సార్లు సమావేశమై.. గతేడాది డిసెంబర్ 8న కృష్ణా బోర్డుకు నివేదిక ఇచ్చింది. సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చించి, అంగీకారం తెలిపిన తెలంగాణ అధికారులు.. నివేదికపై సంతకం చేసేందుకు మాత్రం నిరాకరించారు. ఈ అంశంపై ఈనెల 10న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో చర్చించి, ఆర్‌ఎంసీని పునరుద్ధరించారు. రూల్ కర్వ్స్, విద్యుదుత్పత్తికి నియమావళి, వరద జలాల మళ్లింపుపై మరోసారి చర్చించి నెలలోగా నివేదిక ఇవ్వాలని బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ ఆర్‌ఎంసీని ఆదేశించారు.

### వివాదాలకు చరమగీతం పాడటానికే

కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచుగా విభేదాలు తలెత్తడానికి ప్రధాన కారణం ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ, విద్యుదుత్పత్తి, వరద జలాల మళ్లింపే. ఆర్‌ఎంసీ నివేదికను బోర్డు సమావేశంలో మరో మారు చర్చించి 2023–24లో అమలు చేయడం ద్వారా వివాదాలకు చెక్ పెట్టాలని చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ నిర్ణయించారు. గతంలో తరహాలోనే ఆర్‌ఎంసీ నివేదికపై ఈసారీ తెలంగాణ అధికారులు సంతకాలు చేయడానికి నిరాకరిస్తే.. కేంద్ర జల్ శక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు.

## ఏఎన్‌యూకి జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు

- 'ద వీక్– హన్స రీసెర్చ్' ర్యాంకులు ప్రకటన
- రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు దక్కించుకున్న ఏఎన్‌యూ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకును సొంతం చేసుకుంది. 'ద వీక్– హన్స రీసెర్చ్' 2023వ సంవత్సరానికి ఉన్నత విద్యాసంస్థలకు ప్రకటించిన ర్యాంకులలో ఏఎన్‌యూ సౌత్ జోన్ స్థాయిలో 6వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించింది. యూనివర్సిటీలో ఉన్న విద్య, పరిశోధనాంశాలు, మౌలిక వసతులు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, నూతన ఆవిష్కరణలు తదితర ప్రమాణాల ఆధారంగా ఏఎన్‌యూ ఈ ర్యాంకులను దక్కించుకుంది. ఏఎన్‌యూలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఉత్తమ ర్యాంకు సాధించామని తెలిపారు. త్వరలో వర్సిటీలో నాక్ బృందం సందర్శించనుందని, ఆయా విభాగాల పురోగతిని బృందానికి వివరించి యూనివర్సిటీ ఉత్తమ నాక్ గ్రేడ్ సాధించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఉత్తమ నాక్ గ్రేడ్ సాధించాలి

- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో అన్ని కాలేజీలూ భాగస్వాములవ్వాలి
- ఏపీ కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్


ప్రసంగిస్తున్న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్. చిత్రంలో కళాశాల విద్య జేడీ డాక్టర్ దేవిడ్‌కుమార్, ఏజీఓ ఎ.తులసి

ఏఎన్‌యూ: రాష్ట్ర ప్రభుత్వ మహోన్నత లక్ష్యంలో అన్ని కాలేజీలూ భాగస్వాములవ్వాలని.. విద్యార్థుల్లో ఉపాధి సంబంధిత నైపుణ్యాలను పెంపొందించాలని ఏపీ కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ సూచించారు. ఉత్తమ నాక్ గ్రేడ్‌ను సాధించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల ప్రతినిధులకు నాక్ గుర్తింపు అంశాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఏఎన్‌యూలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి సంబంధిత నైపుణ్యంతో కూడిన విద్యను అందించడం, ఉపాధి అవకాశాలు కల్పించడమనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఒక తరం భవిష్యత్ మన చేతుల్లో ఉందనే విషయాన్ని అధ్యాపకులు, కాలేజీలు గుర్తించాలన్నారు. విద్యార్థుల్లోనూ పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. కాలేజీల్లో ఉన్నతమైన మౌలిక వసతులు కల్పించడం కూడా ముఖ్యమనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. అర్హత ఉన్న కాలేజీలన్నీ అత్యుత్తమ నాక్ గ్రేడ్ సాధించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో కళాశాల విద్య కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవిడ్‌కుమార్, ఓఎస్‌డీ డాక్టర్ కె.విజయ్‌బాబు, ఏజీఓ ఎ.తులసి, డాక్టర్ గౌస్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లపై దుష్ప్రచారం

- సీఆర్డీఏ పరిధిలో అన్ని వసతులతో 5,024 ఇళ్లు సిద్ధం
- ఈ నెలాఖరుకల్లా అవి లబ్ధిదారులకు అందజేత
- టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్


మందడంలోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రసన్న కుమార్, అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో పేదల ప్రగతి కోసం నూరు శాతం పనిచేసే ప్రభుత్వం సీఎం జగనన్నదేనని, ఇది చూసి ఓర్వలేని టీడీపీ.. వారికి వత్తాసు పలికే ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలోని టిడ్కో గృహాలను మంగళవారం ఆయన పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఆర్డీఏ పరిధిలోని నిడమర్రు, మందడం, అనంతవరం, దొండపాడు, ఐనవోలు, పెనుమాక, తుళ్లూరు, నవులూరులో 5,024 టిడ్కో ఇళ్లను అన్ని వసతులతో సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వం సగం చేసిన పనులను తాము పూర్తిచేశామని, కరోనా కష్టకాలంలో కొన్ని నెలలు పనులు ఆగినా అనంతరం వేగంగా పూర్తి చేశామని ఆయన చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలు రాయడం సరికాదని ప్రసన్నకుమార్ హితవు పలికారు.

**మంచినీరు లేనిచోట ఇళ్లా!?**

ఇక తాగునీటి సరఫరా, డ్రైనేజీ, ఎస్టీపీ, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు లేకుండా గత ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. తమ ప్రభుత్వంపై దాదాపు రూ.200 కోట్లు అదనపు భారం పడినప్పటికీ అన్ని వసతులు కల్పించి టిడ్కో ఇళ్లను సిద్ధంచేశామన్నారు. నిజానికి.. గత ప్రభుత్వం మంచినీరు దొరకని ప్రదేశాలను టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఎంపిక చేసిందన్నారు. తుళ్లూరు, దొండపాడు, అనంతవరం, నవులూరు ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉప్పునీరు కావడంతో వాటికి గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి నీరు ఇచ్చేందుకు ప్రత్యేక ప్రాజెక్టును రూపొందించామన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సాధ్యమైందని ఆయన గుర్తు చేశారు. సీఆర్డీఏ ప్రాంతంలో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను ఈ నెలాఖరున లబ్ధిదారులకు అందిస్తామని ఆయన ప్రకటించారు. పచ్చ మీడియా అసత్య ప్రచారాలు మానుకుని ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధిని గుర్తించాలేగాని, ప్రభుత్వ కృషికి ఆటంకంగా నిలువరాదని ప్రసన్నకుమార్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడ్కో చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి, సీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

# బాబు కూల్చివేస్తే.. జగన్ నిలబెట్టారు

విజయవాడలో కర్మల భవనానికి స్థల కేటాయింపుపై విశ్వ బ్రాహ్మణులు


సజ్జలను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న శ్రీకాంత్, గొర్తి శ్రీనివాస్ చక్రవర్తి, విశ్వబ్రాహ్మణ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అపర కర్మల కోసం విజయవాడ గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్ వద్ద స్థలం కేటాయించినందుకు సీఎం జగన్‌కు విశ్వ బ్రాహ్మణులు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి తదితరులు మంగళవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. తమ కృతజ్ఞతలను సీఎంకు తెలియజేయాలని కోరారు. అలాగే స్థల కేటాయింపునకు సహకరించిన ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్, కలెక్టర్ ఢిల్లీరావుకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. పద్మావతి ఘాట్ వద్ద ఉన్న అపర కర్మల భవనం, బ్రహ్మంగారి గుడిని పుష్కరాల పేరుతో గతంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందని చెప్పారు. అప్పటి నుంచి విశ్వబ్రాహ్మణులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాడు విశ్వబ్రాహ్మణుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీస్తే.. నేడు సీఎం జగన్ స్థలం కేటాయించి నిలబెట్టారని కొనియాడారు. కర్మల భవనం అందుబాటులోకి వస్తే విశ్వబ్రాహ్మణులతో పాటు ఇతర కులస్తులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సజ్జలను కలిసిన వారిలో సంఘం నాయకులు పాలడుగు శివ, చేబ్రోలు నాగేశ్వరరావు, సున్నపు వీరభద్రాచారి, ధనాలకోట శేఖర్, జి.ఆచారి, జవ్వాది సుధీర్, కోసూరి రమేశ్, ఎస్.భ్రమరాంబ, సీహెచ్ అవినాశ్ తదితరులున్నారు.

## గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి చెల్లెలుగా భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరకు భక్తులు మంగళవారం పోటెత్తారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన గ్రామదేవత గంగమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జాతర హోరెత్తింది. జాతరలో చివరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనం ఇవ్వనుండడంతో ఉదయం నుంచే భక్తులు గంగమ్మ ఆలయానికి భారీగా తరలివచ్చారు. వారం రోజుల పాటు వివిధ వేషాలతో అలసిన శక్తిస్వరూపిణికి సోమవారం అర్ధరాత్రి శాస్త్రోక్తంగా సుగంధ ద్రవ్యాలతో మహాశాంతి అభిషేకం జరిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## దేశంలో తొలిసారిగా ఏపీ నుంచి ఆక్వాటెక్ యంత్రాల ఎగుమతి

- మడగాస్కర్‌కు పది యంత్రాలు
- ఆక్వా ఎక్స్చేంజ్ సీఈవో కొనసరాజు పవన్‌కృష్ణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: రొయ్యల సాగులో రైతులకు ఎంతో ఉపకరించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆక్వాబాట్ యంత్రాలను తొలిసారిగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆక్వా ఎక్స్చేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కొనసరాజు పవన్‌కృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లిలోని ఆ కంపెనీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ 2020లో స్టార్టప్ కంపెనీగా ప్రారంభమైన తమ సంస్థ అనతికాలంలోనే విదేశాలకు ఆక్వా టెక్ ఉపకరణాలను ఎగుమతిచేసే స్థాయికి చేరుకుందని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ నుంచి మడగాస్కర్ దేశానికి 25 వేల యూఎస్ డాలర్ల విలువ చేసే ఆక్వాబాట్ యంత్రాలను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మడగాస్కర్‌కు చెందిన ప్రముఖ ఆక్వా కంపెనీలు ఈ యంత్రాలను పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశాయని చెప్పారు. ప్రస్తుతం వందకిలోల సామర్థ్యంగల పది ఆక్వాబాట్ యంత్రాలను ఎగుమతి చేసినట్లు తెలిపారు. మనుషులతో సంబంధం లేకుండా ఏఐ (కృత్రిమ మేధస్సు), ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్) ఆధారిత అడ్వాన్స్ టెక్నాలజీతో ఈ ఆక్వాబాట్ పనిచేస్తుందని చెప్పారు. రొయ్యలకు ఫీడ్‌ను ఎంత పరిమాణంలో ఏయే కాల పరిమితుల్లో అందించాలనే విషయాలను ఈ ఆక్వా బాట్‌లో నమోదు చేయటం ద్వారా చెరువులో సమాన పరిమాణంలో, సమాన కాలవ్యవధుల్లో రొయ్యలకు మేత అందిస్తుందని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ సాయంతో పనిచేసే ఈ యంత్రాలను ప్రస్తుతం రాష్ట్రంలోని ఆక్వారైతులకు ఆరునెలలకు రూ.25 వేల చొప్పున అద్దెకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పేదల అభివృద్ధి నిరోధకుడు చంద్రబాబు

961వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలు ఆర్థికంగా ఎదిగితే తమను ఎక్కడ మించిపోతారో అనే భయం బాబు అండ్ కోను వెంటాడుతున్నందునే.. తమ ఎదుగుదలకు అడుగడుగునా అడ్డుపడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 961వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. రాజధానిలో ఈ నెల పేదలకు పట్టాల పండుగ జరుగనుందనే ఆక్రోశంతో రూ.కోట్లాది డబ్బులు వెదజల్లి లేనిది ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ అడ్డుకునేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఐడియాలజీతో కొనసాగిన మా సుదీర్ఘ ఉద్యమం సత్ఫలితాలు సాధించి బహుజనులకు హక్కులు సాధించిందని తెలిపారు. కులమతాలకతీతంగా నేడు రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమం అందుతుందనడంలో సందేహం లేదని, బహుజనులకు అండగా నిలిచిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణీ, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కంటైనర్ లారీని ఢీకొన్న కారు

## ముగ్గురు దుర్మరణం.. ఒకరికి తీవ్రగాయాలు

- మృతుల్లో కృష్ణాజిల్లా వీరవల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్
- కారు టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదం
- తూర్పు గోదావరి జిల్లా యర్నగూడెం వద్ద ఘటన



దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... రాజమహేంద్రవరం నేతాజీనగర్‌లోని 10వ వార్డుకు చెందిన పట్నాల రాధాకృష్ణస్వామి (55) కృష్ణాజిల్లా వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి వీరవల్లి బలెనో కారులో బయలుదేరారు. ఉదయం 11 గంటల సమయంలో యర్నగూడెం వద్ద కారు టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కంటైనర్ లారీని ఢీ కొంది. కారును గమనించిన లారీ డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించబోయి ముందు వెళుతున్న మినీ వ్యాన్‌ను ఢీ కొట్టాడు. వేగంగా వస్తున్న కారు లారీని ఢీ కొనడంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న రాధాకృష్ణస్వామి, మరొక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరొక ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, కారు రాధాకృష్ణస్వామికి చెందినదని, మిగిలిన ముగ్గురు ప్రయాణికులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు.

● తెలంగాణ

## 'నీట్'లాగా ఇంజనీరింగ్‌కు ఒకే ఎంట్రన్స్!

- జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష నిర్వహణ దిశగా కేంద్రం కసరత్తు
- రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న ఎంసెట్ తరహా ఎంట్రన్స్‌లకు ఇక స్వస్తి
- ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ముసాయిదా... ఎక్కువ రాష్ట్రాల ఆమోదం!
- ప్రతిపాదన అమలైతే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల బేరసారాలకు తెర

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్‌లో ఇక రాష్ట్రాల పరిధిలో ఎంసెట్‌ల నిర్వహణ ఉండే అవకాశం కన్పించడం లేదు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి 'నీట్'ను నిర్వహిస్తున్న మాదిరిగానే అన్ని రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష నిర్వహించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకూ పంపింది. మెజారిటీ రాష్ట్రాలు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దీంతో ఈ అంశంపై అవగాహనకు కేంద్రం సెమినార్లు నిర్వహిస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఉన్న డిగ్రీ, పీజీ సీట్ల భర్తీకి కూడా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రయోగం విజయవంతమైంది. దీంతో జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్షపై కేంద్రం దృష్టి పెట్టింది. గత కొన్నేళ్లుగా దేశంలోని ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కేంద్రం జేఈఈ మెయిన్ పరీక్ష నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష చేపడుతోంది. ఇదే మాదిరిగా రాష్ట్రాల ఇంజనీరింగ్ కాలేజీలనూ కలుపుకొని ఉమ్మడి ప్రవేశ పరీక్ష, కౌన్సెలింగ్ చేపట్టాలని 2016లోనే ఆలోచన చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.

**కొనసాగుతున్న చర్చలు**

గత నెల 18న భువనేశ్వర్‌లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), యూజీసీ, ఐఐటీల డైరెక్టర్లు, గవర్నింగ్ బాడీ చైర్మన్లతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్షపై చర్చించారు. అయితే ఇందుకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు, పొందుపరచాల్సిన నిబంధనలపై వివిధ వాదనలు వినిపించాయి. దీంతో అన్ని కోణాల్లోనూ పరిశీలించి, మార్పుచేర్పులతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఐఐటీ గవర్నింగ్ బాడీ చైర్మన్లను కేంద్ర మంత్రి ఆదేశించారు. దీంతో వారు అన్ని రాష్ట్రాలతో భేటీ అవుతూ అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. 2025–26 నాటికి ఈ ప్రయోగాన్ని అమల్లోకి తేవాలనే ఆలోచనలో ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విధానపరమైన నిర్ణయం తీసుకున్నాక ప్రస్తుతం రాష్ట్రాల పరిధిలో ఉన్న కాలేజీలకు రెండేళ్ల సమయం ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. అయితే ఐఐటీల నాణ్యతను ఏమాత్రం తగ్గించకుండా చూడాలని సమావేశంలో పాల్గొన్న విద్యావేత్తలు సూచించారు. నీట్, జేఈఈ మెయిన్ పరీక్షలతోపాటు కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)లో విలీనం చేసే యోచన ఉందని యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ కూడా గతంలో అనేక సందర్భాల్లో తెలిపారు.

**నిబంధనలు పాటిస్తేనే అనుబంధ గుర్తింపు...**

ఇంజనీరింగ్ సీట్ల భర్తీ జాతీయ స్థాయిలోకి వెళ్తే పూర్తిగా వెబ్ ఆధారితంగానే ఉంటుందని అధికారులు అంటున్నారు. యాజమాన్య కోటా కూడా కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేస్తారు. అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలన్నీ ఏఐసీటీఈ నిబంధనలు విధిగా పాటించాల్సి ఉంటుంది. మౌలిక వసతులు, నాణ్యమైన ఫ్యాకల్టీ, కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో బోధన ప్రణాళిక మొత్తం కేంద్ర పరిధిలోకి వెళ్తుంది. ఫలితంగా కొన్ని ప్రైవేటు కాలేజీలు అనేక మార్పులు చేసుకోక తప్పదని ఓ అధికారి పేర్కొన్నారు. ఇప్పటివరకు యూనివర్సిటీ అధికారులే తనిఖీలు చేసేవాళ్లు. ఇకపై జాతీయ స్థాయిలోనూ ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసి అనుమతిస్తేనే ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు లభిస్తుందని తెలుస్తోంది. ఈ విధానంతో యాజమాన్య కోటా సీట్ల బేరసారాలకు బ్రేక్ పడుతుందని అధికార వర్గాలు అంటున్నాయి.

## క్లుప్తంగా

### న్యూజిలాండ్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం..
## ఆరుగురు మృతి

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ రాజధాని వెల్లింగ్టన్‌లోని ఓ హాస్టల్ జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నాలుగంతస్తుల హాస్టల్ భవనంలో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగి అన్ని అంతస్తులకూ వ్యాపించాయి. అగ్ని మాపక సిబ్బంది 52 మందిని ఖాళీ చేయించారు. ఆరు మృతదేహాలు గదుల్లో కన్పించాయి. ప్రమాద తీవ్రతకు పై అంతస్తు కప్పు విరిగిపడింది. 92 గదులున్న ఈ హాస్టల్ భవనంలో శిథిలాలను పూర్తిగా తొలగించాకే మృతులు, బాధితుల లెక్క తేలుతుందంటున్నారు. ఏదేమైనా మృతుల సంఖ్య 10లోపే ఉండొచ్చని చెబుతున్నారు.

### అమెరికాలో కాల్పులు.. ముగ్గురు మృత్యువాత

**ఫార్మింగ్టన్:** అమెరికాలోని న్యూ మెక్సికోలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూ మెక్సికో, అరిజోనా, ఉటా, కొలరాడో రాష్ట్రాల కూడలిలో ఉన్న ఫార్మింగ్టన్ నగరంలో సోమవారం ఉదయం ఓ 18 ఏళ్ల యువకుడు విచ్చలవిడి కాల్పులకు దిగాడు. తన వాహనంపై తిరుగుతూ ఆ ప్రాంతంలోని ఆరు ఇళ్లు, మూడు కార్లపైకి కాల్పులు జరిపాడు. ముగ్గురు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసు కాల్పుల్లో సాయుధుడు హతమయ్యాడు. అతడి దగ్గర 3 తుపాకులు దొరికాయి.

### రోడ్డు ప్రమాదంలో అస్సాం 'లేడీ సింగం' మృతి



**నాగావ్(అస్సాం):** అస్సాంలో లేడీ సింగం, దబాంగ్ పోలీసుగా గుర్తింపు పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ జున్‌మణి రాభా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. నాగావ్ జిల్లా సురుభగియా గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం ఈ ఘోరం జరిగింది. ఆమె తన కారులో వెళ్తుండగా కంటైనర్ ఎదురుగా ఢీకొట్టింది. పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే ఆమె చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. జున్‌మణి నిజాయతీ గల అధికారిణిగా పేరు తెచ్చుకున్నారు.

# నైరుతి రాక 4న!

- ఈసారి మూడు రోజులు ఆలస్యం
- సాగుపై ప్రభావముండదు: ఐఎండీ

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ఆలస్యం కానున్నాయి. అవి జూన్ 4న దేశంలోకి ప్రవేశించవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశిస్తాయి. ఈ ఏడాది రుతుపవనాలు కొంత ఆలస్యమైనప్పటికీ దేశవ్యాప్తంగా పంటల సాగుపై, మొత్తం వర్షపాతంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని ఐఎండీ చీఫ్ ఎం.మొహాపాత్రా స్పష్టం చేశారు. రుతుపవనాలు ప్రవేశించే తేదీకి, ఈ సీజన్‌లో నమోదయ్యే మొత్తం వర్షపాతానికి సంబంధం లేదని తెలిపారు.



**సాధారణ వర్షపాతమే!**

నైరుతి రుతుపవనాలు సాధారణంగా ఏటా జూన్ 1న కేరళలో అడుగుపెడతాయి. 2018లో మే 29న, 2019లో జూన్ 8న, 2020లో జూన్ 1న, 2021లో జూన్ 3న, 2022లో మే 29న ఈ రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల రాకపై తమ అంచనాలు 2015 మినహా గత 18 ఏళ్లలో ఎప్పుడూ తప్పలేదని ఐఎండీ పేర్కొంది. మోకా తుఫాను కారణంగానే ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమవుతున్నట్లు చెప్పలేమని కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ మాజీ కార్యదర్శి ఎం.రాజీవన్ అన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణ వర్షపాతమే నమోదవుతుందని తాము అంచనా వేస్తున్నట్లు ఐఎండీ గత నెలలో తెలియజేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దేశంలో గత నాలుగేళ్లు సాధారణం, సాధారణం కంటే అధిక వర్షాలు కురిశాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆహారంలో 40 శాతం ఆహారం వర్షాధార సాగుతోనే ఉత్పత్తి అవుతోంది. ఆహార భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి తగిన వర్షపాతం నమోదు కావడం చాలా కీలకం. మన దేశంలో 52 శాతం సాగుభూమి వర్షాలపైనే ఆధారపడి ఉంది.

# 'మూన్ కింగ్'గా మళ్లీ శని గ్రహం



**బ్రిటిష్ కొలంబియా:** సౌర కుటుంబంలో అత్యధికంగా చంద్రులు పరిభ్రమిస్తున్న శని గ్రహం 'మూన్ కింగ్' కిరీటాన్ని తిరిగి చేజిక్కించుకుంది. ఈ గ్రహం చుట్టూ మరో 62 చంద్రులు పరిభ్రమిస్తున్నట్లు తాజాగా ఖగోళ పరిశోధకులు గుర్తించారు. దీంతో, శని చుట్టూ తిరుగుతున్న చంద్రుల సంఖ్య 83 నుంచి 145కు చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్తగా గుర్తించిన 12 చంద్రులతో కలిపి అత్యధికంగా 95 చంద్రులతో అగ్రభాగాన నిలిచిన గురుగ్రహం మూన్‌కింగ్‌గా కొనసాగుతోంది. అయితే, అకాడెమియా సినికా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌కు చెందిన ఎడ్వర్డ్ ఏస్టన్ మరో 62 చంద్రులు శని గ్రహం చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు గుర్తించారు. హవాయిలోని మౌనాకియాపై ఏర్పాటు చేసిన టెలీస్కోప్‌లో 2019–21 మధ్య నమోదైన డేటా ఆధారంగా సాగిస్తున్న పరిశోధనల్లో ఈ విషయం తేలిందన్నారు. సౌర కుటుంబంలో అత్యధిక చంద్రులతో 'మూన్‌కింగ్' కిరీటాన్ని శని దక్కించుకున్నట్లయిందని ఆయన తెలిపారు.

# అదే తీరు.. అదే తకరారు!

## కాంగ్రెస్‌కు సవాలుగా మారిన కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక

**పలు రాష్ట్రాల్లో సీఎం ఎంపికలో తప్పటడుగులు**

**దాంతో నిత్యం గ్రూప్ విభేదాలు, పార్టీకి ఓటములు**



దక్షిణాదిన కీలక రాష్ట్రం కర్ణాటక బీజేపీ నుంచి కాంగ్రెస్ చేతిలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన కాంగ్రెస్ కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడంలో మాత్రం ఇక్కట్లు ఎదుర్కొంటోంది. సీఎం కుర్చీ కోసం ఇద్దరు హేమాహేమీలు సిద్దరామయ్య, డీకే శివకుమార్ పోటీ పడుతున్నారు. ఎవరిని ఎంపిక చేయాలో తేల్చుకోలేక కాంగ్రెస్ అధిష్టానం తలపట్టుకుంటోంది. ఈ పరిణామం చివరకు ఎటు దారితీస్తుందో తెలియక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల్లో నెగ్గడం కంటే కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడమే పెద్ద సవాలుగా మారడం గమనార్హం. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌లో ఇలాంటి విపత్కర పరిస్థితి ఇదే మొదటిసారి కాదు. సుదీర్ఘ కసరత్తు తర్వాత సీఎంను నియమించినప్పటికీ పార్టీలో, ప్రభుత్వంలో లుకలుకలు కొనసాగడం, అసంతృప్త సెగలు రగలడం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ప్రత్యేకత. నిర్ణయాలు తీసుకోవడంలో తడబాటే కాంగ్రెస్‌కు గ్రహపాటుగా మారుతోంది. సీఎంలను ఎంపిక చేయడంలో తప్పటడుగులు వేయడం, ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోలేక ఉక్కిరిబిక్కిరి కావడం ఆ పార్టీలో ఒక ఆనవాయితీగా మారింది. ఇదే కాంగ్రెస్ సంస్కృతి అని సరిపెట్టుకోవాలేమో!

**అశోక్ గహ్లోత్ వర్సెస్ పైలట్**

రాజస్తాన్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. పీసీసీ చీఫ్, యువ నాయకుడు సచిన్ పైలట్ సీఎం పోస్టు ఆశించారు. తన నాయకత్వంలోనే పార్టీ గెలిచినందున పదవి తనకే దక్కుతుందని భావించారు. కానీ సోనియా కుటుంబం మరోలా ఆలోచించింది. కారణాలేమైనా సీనియర్ నేత అశోక్ గహ్లోత్‌ను సీఎం చేసింది. దాంతో పార్టీ రెండు వర్గాలుగా చీలింది. పైలట్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుబాటు చేశారు. 2021లో ప్రభుత్వాన్ని కూల్చేందుకు విఫలయత్నం ప్రయత్నించారు. సమస్య పరిష్కారానికి 2022లో గహ్లోత్‌ను ఏఐసీసీ అధ్యక్షుడిగా, పైలట్‌ను సీఎంగా నియమించేందుకు పార్టీ పెద్దలు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ కుర్చీ వీడేందుకు గహ్లోత్ అంగీకరించలేదు. ఈ విషయమై పెద్ద హైడ్రామానే నడిచింది. చివరికి అధిష్టానమే దిగిరాక తప్పలేదు. పైలట్‌కు సీఎం కుర్చీ ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. రాజస్తాన్‌లో గహ్లోత్ సర్కారుపై పైలట్ యుద్ధం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రెండు వర్గాల మధ్య సయోధ్య సాధ్యం కావడం లేదు. అధిష్టానం కూడా చేతులెత్తేసినట్లే కనిపిస్తోంది.

**అస్సాం చేజారింది**

ఈశాన్య భారతదేశంలో కీలక రాష్ట్రం అస్సాం. ఈ రాష్ట్రం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. రాహుల్ గాంధీ వ్యవహార శైలి పట్ల విసుగెత్తిపోయిన హిమంత బిశ్వ శర్మ 2015లో బీజేపీలో చేరారు. తర్వాత ఎన్నికల్లో నెగ్గి ఆ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అయ్యారు. అస్సాం బీజేపీ ఖాతాలో చేరింది. అక్కడ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభావం గాలిలో దీపమే.

**ఛత్తీస్‌గఢ్‌లోనూ...**

ఛత్తీస్‌గఢ్‌లో సైతం కాంగ్రెస్ పరిస్థితి గొప్పగా లేదు. పార్టీలో గ్రూప్‌లు భగ్గుమంటున్నాయి. తనను ముఖ్యమంత్రిని చేస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చిందని, ఇప్పటికీ నిలబెట్టుకోలేదని సీనియర్ నేత టీఎస్ సింగ్ దేవ్ ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పెద్దలపై, సీఎం భూపేష్ భగేల్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు.

**మధ్యప్రదేశ్‌ను వదిలేసుకున్నారు**

మధ్యప్రదేశ్‌లోనూ చేతికందిన అధికారం కాంగ్రెస్ తప్పిదంతో చేజారింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవగానే జ్యోతిరాదిత్య సింధియా సీఎం పదవి డిమాండ్ చేశారు. సోనియా కుటుంబం కమల్‌నాథ్ వైపు మొగ్గింది. దాంతో సింధియా 2020లో తన వర్గం ఎమ్మెల్యేలతో బీజేపీలో చేరారు. మెజార్టీ లేక కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయింది. ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఒప్పందంలో భాగంగా జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మిగిలింది గుండు సున్నా.

**పంజాబ్‌లో పరాభవం**

పంజాబ్‌లో ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, పీసీసీ అధ్యక్షుడు నవజోత్ సింగ్ సిద్ధూ మధ్య విభేదాలు కాంగ్రెస్ కొంప ముంచాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. సిద్ధూ సీఎం పదవిని కోరుకున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధిష్టానం దళిత కార్డు ప్రయోగించింది. చరణ్‌జిత్ సింగ్ చన్నీని సీఎంగా గద్దెనెక్కించింది. అమరీందర్ సింగ్ సొంత దారి చూసుకున్నారు. ఎన్నికల్లో సిద్ధూ వర్గం సహాయ నిరాకరణ చేసింది. ఫలితంగా ఆమ్ ఆద్మీ పార్టీకి అధికారం దక్కింది.

**ఎందుకు ఈ పరిస్థితి?**

అధికార బీజేపీలో మోదీయే ఏకైక పవర్ సెంటర్. పార్టీలో ఆయన మాటకు తిరుగులేదు. ఎవరిని సీఎంగా నియమించాలన్నా మోదీదే తుది నిర్ణయం. కాంగ్రెస్‌లో అలా కాదు. సోనియా, రాహుల్, ప్రియాంక రూపంలో మూడు పవర్ సెంటర్లున్నాయంటారు. డీకే శివకుమార్‌కు సోనియా అండదండలుంటే ప్రియాంక మాత్రం సిద్దరామయ్య వైపు మొగ్గుతుంటే రాహుల్ సైతం ఆమెను సమర్థిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ''రాష్ట్రాల్లో ఎవరో ఒక్కరే శక్తివంతులుగా పెత్తనం చెలాయించడం కాంగ్రెస్ అధిష్టానానికి ఇష్టముండదు. అభద్రతాభావమే ఇందుకు కారణం. అందుకే పలు పవర్ సెంటర్లను ప్రోత్సహిస్తుంది'' అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

## కృత్రిమ తీపి పదార్థాలు ప్రమాదకరం

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక



**న్యూఢిల్లీ:** అధిక బరువు నియంత్రణలో కృత్రిమ తీపి పదార్థాలతో దీర్ఘ కాలంలో ఎటువంటి ప్రయోజనం ఉండదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) స్పష్టం చేసింది. పైగా వీటితో టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులతోపాటు పెద్దల్లో ఆకస్మిక మరణాల ముప్పు పొంచి ఉందని కూడా తన తాజా సిఫారసుల్లో హెచ్చరించింది. శాకరిన్, సుక్రలోజ్ వంటి వివిధ కృత్రిమ తీపి పదార్థాలను ప్యాకేజ్డ్ ఆహార పానీయాల్లో వాడుతుంటారు. చక్కెరకు ప్రత్యామ్నాయంగా వీటిని విడిగానూ విక్రయిస్తారు. అయితే, చిన్నారుల్లో బరువు నియంత్రణలో ఈ కృత్రిమ తీపి పదార్థాలు ఎటువంటి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. అందుకే, చక్కెర పదార్థాలను తీసుకోవడాన్ని తగ్గించుకునేందుకు కృత్రిమ తీపి పదార్థాలు(ఎన్ఎస్ఎస్)లకు ఇతర ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సూచించింది. సహజ చక్కెరలు కలిగి ఉండే పండ్లు, చక్కెర లేని ఆహార పానీయాలను తీసుకోవడం మంచిదని డబ్ల్యూహెచ్‌వో న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ ఫ్రాన్సెస్కో బ్రాంకా తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే చిన్నప్పటి నుంచి తక్కువ తీపి ఆహారం తీసుకోవాలన్నారు. ''మందులు, స్కిన్‌క్రీమ్స్ వంటి ఉత్పత్తుల్లో ఎన్ఎస్ఎస్‌ను ఉపయోగించవచ్చు. తక్కువ కేలరీలుండే తీపి పదార్థాలు, షుగర్ ఆల్కహాళ్లకు కూడా ఈ సిఫారసు వర్తించదు. కేలరీలుండే ఇవి కృత్రిమ తీపి పదార్థాల జాబితాలోకి రావు'' అని డబ్ల్యూహెచ్‌వో వివరించింది.

# నేడే విడుదల!

**కర్ణాటక సీఎంపై అదే పీటముడి • హస్తినలో రోజంతా రాజకీయ వేడి**

**సిద్ధూ, డీకేలతో అధిష్టానం చర్చలు**

- పట్టు వీడేందుకు ఇద్దరూ ససేమిరా
- నేడు కర్ణాటకకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
- అందరితో మాట్లాడి నేడు నిర్ణయం!





మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో డీకే శివకుమార్, సిద్ధరామయ్య

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. పదవి కోసం పట్టుబడుతున్న మాజీ సీఎం సిద్ధరామయ్యతో పాటు పీసీసీ డీకే శివకుమార్ కూడా మంగళవారం హస్తిన చేరుకున్నారు. వారిలో ఎవరిని ఎంచుకోవాలనే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం ఈ విషయమై రోజంతా మల్లగుల్లాలు పడింది. అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సహా అగ్ర నేతలంతా అటు సిద్ధూ డీకేలతో, ఇటు తమలో తాము ఉదయం నుంచి రాత్రి దాకా పెద్దలు చర్చోపచర్చల్లో మునిగిపోయారు. అయినా వారిద్దరిలో ఎవరూ పట్టు వీడకపోవడంతో ఎటూ తేలక నిర్ణయం బుధవారానికి వాయిదా పడింది. సిద్ధరామయ్య వైపే రాహుల్ మొగ్గారని, దాంతో ఆయనకు దాదాపుగా లైన్ క్లియరైనట్టేనని సాయంత్రానికి వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈడీ, సీబీఐ, ఐటీ కేసులు డీకేకు బాగా వ్యతిరేకంగా మారాయన్న ప్రచారం ఊపందుకుంది. అయితే సీఎంగా చాన్సివ్వని పక్షంలో ఎమ్మెల్యేగా కొనసాగుతానే తప్ప డిప్యూటీ సీఎం సహా మరే ప్రతిపాదనకూ అంగీకరించేది లేదని డీకే కుండబద్దలు కొట్టారంటున్నారు. సిద్ధూ కూడా రాజీలో భాగంగా డీకేకు ఆర్థికం వంటి కీలక శాఖలు అప్పగించేందుకు ససేమిరా అన్నట్టు చెబుతున్నారు. దాంతో సీఎం ఎంపికపై పీటముడి మరింత బిగుసుకుంది. బహుశా ఖర్గే బుధవారం బెంగళూరు వెళ్లి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలతో మరోసారి సంప్రదింపులు జరిపాక తుది నిర్ణయం వెలువడవచ్చని తెలుస్తోంది. మరో సీనియర్ నేత జి.పరమేశ్వర కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. అధిష్టానం కోరితే సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమని ప్రకటించారు. ''నాకు లాబీయింగ్ అవసరం లేదు. నేను చేసిన సేవలు అధిష్టానానికి తెలుసు'' అన్నారు.

**టైం పడుతుంది: ఖేరా**

అధిష్టానం పిలుపు మేరకు సిద్ధరామయ్య సోమవారమే ఢిల్లీ వెళ్లగా, తనకు సానుకూల సంకేతాలు లేవనే అసంతృప్తితో డీకే మాత్రం బెంగళూరుకే పరిమితం కావడం తెలిసిందే. మంగళవారం ఢిల్లీ వెళ్లిన ఆయన సాయంత్రం నేరుగా ఖర్గేతో భేటీ అయ్యారు. అరగంటకు పైగా చర్చలు జరిపారు. సీఎం పదవి దక్కకుంటే రాజీనామా చేస్తానన్న వార్తలను అంతకుముందు ఆయన తీవ్రంగా ఖండించారు. ''పార్టీ నా తల్లి వంటిది. మేమంతా కలిసి నిర్మించుకున్న పార్టీని వీడే ప్రసక్తే లేదు'' అని మీడియాకు స్పష్టం చేశారు. అలా ప్రసారం చేసే చానళ్లపై పరువునష్టం కేసు పెడతానని హెచ్చరించారు. రాహుల్‌ను కూడా కలుస్తారా అని ప్రశ్నించగా, నేతలందరినీ కలుస్తానని చెప్పారు. ఆ తర్వాత సిద్ధరామయ్య వెళ్లి ఖర్గేను కలిశారు. అంతకుముందు రాహుల్ కూడా రణ్‌దీప్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఖర్గే నివాసానికి వెళ్లి గంటన్నరకు పైగా మంతనాలు జరిపారు. తర్వాత వేణుగోపాల్ మళ్లీ రాహుల్ నివాసానికి వెళ్లి మరో దఫా చర్చలు జరిపారు. సిద్ధరామయ్య కూడా ఖర్గేతో భేటీ అనంతరం వేణుగోపాల్ నివాసానికి వెళ్లి ఆయనతో చర్చించారు. బహుశా రాహుల్ సందేశాన్ని సిద్ధూకు వేణుగోపాల్ అందించారని భావిస్తున్నారు. సీఎం అభ్యర్థిపై నిర్ణయం తీసుకోవడం అంత సులువు కాదని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు. ''సీఎంను ఢిల్లీ నుంచి రుద్దలేం. ఎమ్మెల్యేలు, అందరితోనూ చర్చించి వారికి ఆమోదయోగ్యుడైన నాయకున్ని ఎంపిక చేయాల్సి ఉంటుంది. అందుకు సమయం పడుతుంది'' అని హైదరాబాద్‌లో మీడియాకు చెప్పుకొచ్చారు.

## 30న పార్లమెంట్ నూతన భవనం ప్రారంభం!

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనం దాదాపు సిద్ధమయ్యింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా సిద్ధమవుతుందని అధికారులు చెబుతున్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 30వ తేదీన నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధానమంత్రి స్వయంగా ప్రారంభిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జూలైలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కొత్త భవనంలోనే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి 2020 డిసెంబర్‌లో ప్రధాని మోదీ పునాది రాయి వేసిన సంగతి తెలిసిందే. నిర్మాణ పనులను టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. నిజానికి ముందుగా నిర్దేశించిన డెడ్‌లైన్ ప్రకారం గత ఏడాది నవంబర్ నాటికే నిర్మాణం పూర్తికావాలి. కొన్ని అవాంతరాల వల్ల దాదాపు ఆరు నెలలు ఆలస్యమైంది. ప్రధాని మోదీ సూచనలకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా కొత్త పార్లమెంట్ బిల్డింగ్ నిర్మించారు.

## ఫ్రీలాన్స్ జర్నలిస్టుపై గూఢచర్యం కేసు

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ఓ న్యూస్ పోర్టల్ కోసం భారత్‌లో పనిచేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు వివేక్ రఘువంశీపై సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 120–బి(నేరపూరిత కుట్ర), అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 3(గూఢచర్యం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. భారత రక్షణ శాఖతోపాటు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ప్రాజెక్టులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించి, విదేశీ నిఘా సంస్థలకు చేరవేస్తున్నట్లు వివేక్ రఘువంశీపై ఆరోపణలు వచ్చాయి. ఆయనకు సంబంధించిన 12 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, జైపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. రక్షణ శాఖ భవిష్యత్తులో కొనుగోలు చేయాలనుకుంటున్న ఆయుధాల వివరాలను సైతం వివేక్ రఘువంశీ సేకరించాడని అధికారులు చెబుతున్నారు.

## వెకేషన్ బెంచ్ ముందు కొత్తగా 300 కేసులు: సీజేఐ

**సాక్షి, న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు వేసవి సెలవుల్లో తొలివారంలోనే వెకేషన్ బెంచ్ ముందు 300 తాజా కేసులను జాబితాలో చేర్చనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. వెకేషన్ బెంచ్ న్యాయమూర్తుల అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమయంలో హైబ్రిడ్ విచారణలకు అనుమతి ఇస్తున్నామని, ఎక్కడి నుంచైనా న్యాయవాదులు వాదనలు వినిపించుకోవచ్చని పేర్కొంది. అయితే తగినవిధంగా మంచి దుస్తులు ధరించాలంటూ జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు. వెకేషన్ బెంచ్‌లు సాధారణంగా అత్యవసర విచారణ, అవసరమయ్యే అంశాలు మాత్రమే వింటాయి. బెంచ్ అంగీకరిస్తేనే తాజా కేసులు తీసుకుంటారు. మే 22 నుంచి జులై 3 వరకూ సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు.

## మసీదు మెట్ల కింద...శ్రీకృష్ణ విగ్రహం

**ఇప్పించాలంటూ కోర్టుకెక్కిన ట్రస్టు**

**లఖ్‌నవూ:** ఆగ్రాలోని జామా మసీదు మెట్ల కింద కృష్ణుని విగ్రహముందని శ్రీకృష్ణ జన్మభూమి సంరక్షిత్ సేవా ట్రస్ట్ ఆరోపించింది. దాన్ని తమకు తిరిగి ఇప్పించాలంటూ కోర్టుకెక్కింది. దీనిపై మే 31లోగా స్పందించాలంటూ షాహీ మస్జిద్ ఆగ్రా ఫోర్ట్ ఇంతజామియా కమిటీ సహా పలువురికి కోర్టు నోటీసులు జారీ చేసింది. తమ వాదనకు మద్దతుగా ఎన్నో రుజువులున్నాయని ట్రస్ట్ చైర్మన్ మనోజ్‌కుమార్ పాండే వాదిస్తున్నారు. వాటిని కోర్టుకు సమర్పిస్తానని చెబుతున్నారు. మెట్ల తవ్వకం మొదలుకుని అన్ని ఖర్చులూ ట్రస్టే భరిస్తుందని ఆయన అన్నారు. ''కేశవ్‌దేవ్ ఆలయాన్ని 1670లో ఔరంగజేబ్ నేలమట్టం చేసి కేశవదేవ్ విగ్రహాన్ని జామా మసీదు మెట్ల కింద పూడ్చినట్టు చారిత్రక ఆధారాలెన్నో ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

# ఉద్యోగ నియామకాల్లో అవినీతి, బంధుప్రీతి అంతం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి • రోజ్‌గార్ మేళాలో 71,000 మందికి నియామక పత్రాలు**



**న్యూఢిల్లీ:** ఉద్యోగ నియామకాల వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సమూల మార్పులతో అవినీతి, బంధుప్రీతికి అవకాశాలు అంతమయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ఆయన మంగళవారం 71,000 మందికి నియామక పత్రాలను వర్చువల్ కార్యక్రమంలో అందజేశారు. వీరికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభించాయి. ఆ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం నుంచి తుది ఫలితాలు ప్రకటించే దాకా మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేశామని వివరించారు. నియామకాల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా, పక్షపాత రహితంగా మార్చామని అన్నారు. గ్రూప్–సి, గ్రూప్–డి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రద్దు చేశామని తెలిపారు. గత తొమ్మిదేళ్ల బీజేపీ పరిపాలనలో దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయని, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగం పుంజుకుందని ఉద్ఘాటించారు. సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం ఇదే రోజు(మే 16)న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని గుర్తుచేశారు. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' స్ఫూర్తితో తమ ప్రయాణం ఆనాడే మొదలైందన్నారు. 'వికసిత్ భారత్' కోసం శ్రమిస్తున్నామని చెప్పారు. ఇదే రోజు సిక్కిం రాష్ట్ర హోదా పొందిందని వివరించారు.

### దేశమంతటా కొత్త ఉద్యోగాల సృష్టి

మన దేశంలో 2018–19 నుంచి ఇప్పటిదాకా 4.5 కోట్ల మంది ఉద్యోగాలు పొందారని, ఈపీఎఫ్ఓ గణాంకాలను బట్టి ఈ విషయం నిరూపణ అవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) పెరుగుతున్నాయని, మన ఎగుమతులు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని, దేశంలో ప్రతిమూలనా కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టి కొనసాగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతుతో కొత్త కొత్త రంగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని, ఉద్యోగాల స్వరూప స్వభావాలు మారిపోతున్నాయని వెల్లడించారు. ఇకస్టార్టప్ రంగం ఆకాశమే హద్దుగా ఎదుగుతోందని అన్నారు. 2014 కంటే ముందు దేశంలో కేవలం కొన్ని వందల సంఖ్యలో స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య లక్షకు చేరిందని తెలియజేశారు. స్టార్టప్ కంపెనీల్లో 10 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. యువత సంక్షేమం, అభివృద్ధి పట్ల తమ అంకితభావం, చిత్తశుద్ధికి రోజ్‌గార్ మేళాలే నిదర్శనమని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందని వివరించారు. పేదల కోసం 4 కోట్ల పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. దేశంలో ఇప్పుడు యూనివర్సిటీల సంఖ్య 1,100కు, మెడికల్ కాలేజీల సంఖ్య 700కు చేరిందన్నారు.



# డాక్టరైన మహిళా కండక్టర్

**బస్సులో గర్భిణికి ప్రసవం**

**బనశంకరి:** కర్ణాటక రాష్ట్ర ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో మహిళా కండక్టర్ డాక్టర్‌గా మారి సురక్షితంగా కాన్పు చేశారు. చిక్కమగళూరు డిపోకు చెందిన కేఎస్ఆర్‌టీసీ బస్సు సోమవారం బెంగళూరు నుంచి చిక్కమగళూరుకు వెళ్తోంది. బెంగళూరు నుంచి బేలూరుకు ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి ప్రసవ వేదన ఆరంభమైంది. బస్సు వెళ్లే మార్గంలో 16 కిలోమీటర్ల వరకూ ఎలాంటి ఆసుపత్రి లేదు. దీంతో బస్సులోని మహిళా కండక్టర్ ఎస్.వసంతమ్మ బస్సును నిలిపి ప్రయాణికులను కిందికి దించేశారు. ఆమె గర్భిణికి కాన్పు చేయగా ఆడపిల్ల పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. మహిళ నిరుపేద కావడంతో చేతిలో ఖర్చులకు కూడా డబ్బులు లేవు, ఆమె పరిస్థితిని గమనించి కండక్టర్, డ్రైవరు ప్రయాణికులు కలిసి రూ.1,500 సేకరించి అందజేశారు. తరువాత అంబులెన్స్ ద్వారా శాంతిగ్రామ ఆసుపత్రిలో చేర్చారు. మహిళా కండక్టర్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 17 : మే : 2023

## ఆత్మపరిశీలన చేసుకొన్నాం : బొమ్మై

**శివాజీనగర:** ఎన్నికల్లో ఓటమికి కారణాలపై ఆత్మ పరిశీలన చేసుకొన్నామని తాత్కాలిక సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. మంగళవారం సదాశివనగరలో ఆయన మాజీ మంత్రి కే సుధాకర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, సుధాకర్‌ను కలిశానని, తమ అభ్యర్థులు కొందరు అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయారని, వారిలో ధైర్యం నింపే పని చేస్తున్నానని తెలిపారు. మాజీమంత్రి సోమణ్ణను కూడా కలుస్తానన్నారు. సీఎం పదవి అనేది కాంగ్రెస్‌కు చెందిన అంశం, ఎవరు సీఎం అవుతారనేది వేచి చూడాలన్నారు.

**ఉన్నతాధికారులకు తేనీటి విందు**

సీఎం బొమ్మై తన నివాసంలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు తేనీటి విందు ఇచ్చారు. పరిపాలనలో తనకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కర్ణాటక అనేక విషయాల్లో ముందంజలో ఉందని అన్నారు.

## న్యూస్‌రీల్

### వేతన కమిషన్ గడువు పెంపు

**శివాజీనగర:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు నియమించిన 7వ వేతన కమిషన్ గడువును మరో 6 నెలల వరకు విస్తరిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గతేడాది నవంబర్ 19న రిటైర్డ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రావు అధ్యక్షతన ఈ కమిషన్‌ను సీఎం బొమ్మై ఏర్పాటు చేసి 6 నెలల్లోగా నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. అయితే ఇంకా సర్కారు ఏర్పడక పోవడం, కమిషన్ అధ్యయనం కూడా పూర్తి కాని కారణాలతో గడువును పొడిగిస్తూ గవర్నర్ పేరుతో ఆర్థిక శాఖ ఉప కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు.

### కళాభిరుచికి చేయూత



**మండ్య:** జిల్లాలోని పాండవపుర తాలూకాలోని దేవరకాడు గ్రామంలో ఉన్న ప్రాచీన రామదేవుని దేవాలయం ఆవరణలో కుణియోన బారో పేరుతో నృత్య శిక్షణ వేసవి శిబిరం ఆరంభమైంది. పల్లె ప్రాంతాల్లో బాల బాలికల కోసం వేసవిలో శిక్షణ శిబిరాలను నిర్వహించడం ద్వారా వారిలో కళలను ప్రోత్సహించవచ్చని నిర్వాహకులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 55 మందికి పైన చిన్నారులు పాల్గొన్నారు. జానపద, సినీ నృత్యాలు, నాటకాలు, మర్మ కళల గురించి శిక్షణనిస్తున్నట్లు నిర్వాహకుడు చిక్కబళ్ళాపుర దిలీప్ తెలిపారు.

### హిజాబ్ చట్టం రద్దవుతుంది

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫాతిమా

**రాయచూరు రూరల్:** రాష్ట్రంలో విద్యాలయాల్లో ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించరాదని నిషేధం ఉండగా, దానిని రద్దు చేయడానికి సర్కార్‌పై ఒత్తిడి తెస్తామని కలబుర్గి ఉత్తర కాంగ్రెస్ ఎమ్మెల్యే ఖనీజ్ ఫాతిమా చెప్పారు. ఆమె నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజల సహకారంతో విజయం సాధించానన్నారు. విద్యా సంస్థల్లో హిజాబ్ నిషేధాన్ని కాంగ్రెస్ సర్కార్ వాపస్ తీసుకుంటుందని చెప్పారు. మైనారిటీ విద్యార్థులకు అనుకూలం కోసం హిజాబ్ చట్టాన్ని రద్దు చేస్తుందన్నారు. నేను హిజాబ్ ధరించి విధానసభలో ప్రవేశిస్తానని , హిజాబ్ ధారణ అనేది ముస్లింల సంప్రదాయమని అన్నారు.

### యువతికి వేధింపులు

**యశవంతపుర:** పట్టపగలే పెద్ద కత్తి పట్టుకొని యువతిని వేధించిన ఘటన బెంగళూరు పులకేశి నగరలో జరిగింది. సోమవారం మధ్యాహ్నం వివేకానంద రెసిడెన్సీ వద్ద యువకుడు డ్రాగర్‌ను పట్టుకొని యువతిని అడ్డుకున్నాడు. ఆమె మొబైల్ ఫోన్‌ను లాక్కొనే ప్రయత్నం చేశాడు. అక్కడ ఉన్న ఓ మహిళ అడ్డుకోవడంతో దుండగుడు పలాయనం చిత్తగించాడు. ఈ ఘటన సీసీ కెమెరాలలో రికార్డయింది. పులకేశినగర పోలీసులు సక్రమంగా గస్తీ నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్లు స్థానికులు విమర్శించారు.

### ప్రాచీన శిలాశాసనం లభ్యం



**తుమకూరు:** తుమకూరు జిల్లాలోని కుణిగల్ చరిత్ర గురించి రాసిన ప్రముఖ శిలా శాసనం ఒకటి బయటపడింది. అది విజయనగర జిల్లాలోని హరపనహళ్ళి తాలూకాలోని తవ్వకాల్లో దొరకడం విశేషం. హరపనహళ్ళిలోని అరసికెరె దగ్గర ఈశ్వర దేవాలయం వద్ద జరుగుతున్న తవ్వకాలలో కుణిగల్ చరిత్రను చెప్పే శిలా శాసనం వెలుగుచూసింది. తుమకూరు వర్సిటీ చరిత్ర, పురావస్తు శాఖ ప్రొ. ఎం. కొట్రే ష్, దావణగెరె వర్సిటీకి చెందిన సుధాజీ ఈ శాసనంపై పరిశోధన చేసి వివరాలను ప్రకటించారు. 11వ శతాబ్దానికి చెందినదని, 6వ విక్రమాదిత్య కాలం నాటిదని కొట్రేష్ తెలిపారు.

### గ్యారంటీ కార్డుకు షరతులు !

**బనశంకరి:** శాసనసభ ఎన్నికల్లో గెలుపొందడానికి ఐదు గ్యారంటీ పథకాలను ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. అయితే ఆ పార్టీ అప్పుడే స్వరం మార్చింది. గ్యారెంటీ కార్డుకు షరతులు వర్తిస్తాయని మాజీ డిప్యూటీ సీఎం పరమేశ్వర్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ... మొదటి మంత్రి వర్గ సమావేశంలో ప్రకటించిన ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని, అయితే వీటికి షరతులు వర్తిస్తాయని, పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ బిల్లులు చెల్లించేది లేదని ప్రజలు చెబుతుండటంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.

# మెజారిటీ మాయ

ఎన్నికల్లో ఓట్లే ప్రధానం. ఒక్క ఓటు విజయాన్ని నిర్ణయిస్తుంది. రెండు ఓట్ల మెజారిటీ వచ్చినా, రెండు లక్షలు వచ్చినా విజేతలందరూ వెళ్లేది అసెంబ్లీకే. కానీ మెజారిటీ అనేది నియోజకవర్గంలో ఆ నాయకునికి ఉన్న పట్టుకు పలుకుబడికి నిదర్శనం. ఈ ఎన్నికల్లో కొందరు భారీ మెజారిటీతో గెలిస్తే, కొందరు మాత్రం ఏదో గెలిచామన్నట్లు ఎన్నికయ్యారు.

- కొందరికి అత్యధికం, మరికొందరికి అత్యల్పం





అతి స్వల్ప మెజారిటీతో గెలిచిన అభ్యర్థుల్లో బీజేపీ వారు అధికం

**బనశంకరి:** ఈ విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 135 సీట్లతో జెండా ఎగరేయగా, బీజేపీ ప్రతిపక్షంగా అవతరించింది. ఎన్నికల్లో రాష్ట్రంలో 10 మంది అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో ఎన్నిక కాగా, 8 మంది బొటాబొటీ ఆధిక్యంతో గెలిచినట్లయింది.

**మెజారిటీ వీరులు వీరే**

- కనకపుర నియోజకవర్గంలో కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ 1,22,392 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇదే అత్యధికం.
- చిక్కోడి సదలగా క్షేత్రంలో కాంగ్రెస్ అభ్యర్థి గణేశ్ హుక్కేరి 77,749 ఓట్ల మెజారిటీతో విజయం.
- అథణిలో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ సవది 75,673 ఓట్లతో గెలుపు.
- బెంగళూరు పులకేశినగరలో కాంగ్రెస్ అభ్యర్థి ఏసీ శ్రీనివాస్‌కు 62,062 ఓట్ల మెజారిటీ
- కొళ్లేగాలలో కాంగ్రెస్ అభ్యర్థి ఏఆర్ కృష్ణమూర్తికి 59,519 ఓట్ల ఆధిక్యం. యమకనమరడిలో కాంగ్రెస్ అభ్యర్థి సతీశ్ జార్కిహొళికి 57,046 ఓట్లు, బెంగళూరు సర్వజ్ఞనగరలో కాంగ్రెస్ అభ్యర్థి కేజే.జార్జ్ 55,768 మెజారిటీ దక్కింది.
- బెళగావి రూరల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీ హెబ్బాళ్కర్‌కి 55,546 ఓట్ల మెజారిటీ. బెంగళూరులో పద్మనాభనగరలో బీజేపీ అభ్యర్థి ఆర్.అశోక్ 55175 ఓట్ల మెజారిటీ. బసవనగుడిలో బీజేపీ అభ్యర్థి రవి సుబ్రమణ్యకు 54978 ఓట్ల ఆధిక్యం.

**అత్యల్ప ఆధిక్యంతో ఎన్నిక**

- బెంగళూరు జయనగర నుంచి బీజేపీ అభ్యర్థి సీకే.రామమూర్తి 16 ఓట్ల అత్యంత స్వల్ప మెజారిటీతో ఎన్నికయ్యారు. అలాగే గాంధీనగరలో కాంగ్రెస్ అభ్యర్థి దినేశ్ గుండూరావ్‌కు వచ్చిన మెజారిటీ 105 ఓట్లు
- శృంగేరిలో కాంగ్రెస్ అభ్యర్థి టీడీ రాజేగౌడ ఆధిక్యం 201 ఓట్లు
- మాలూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కేవై నంజేగౌడ ఆధిక్యం 218 ఓట్లు
- కుమటాలో బీజేపీ అభ్యర్థి దినకరశెట్టి ఆధిక్యం 673 ఓట్లు
- మూడిగెరెలో కాంగ్రెస్ అభ్యర్థిని నయన మోటమ్మ 772 ఓట్ల మెజారిటీతో గెలుపు
- చించోళిలో బీజేపీ అభ్యర్థి అవినాశ్ జాదవ్ మెజారిటీ 858 ఓట్లు కాగా, జగళూరులో కాంగ్రెస్ అభ్యర్థి దేవేంద్రప్ప 874 ఓట్లతో గెలిచారు.



మంగళవారం చిక్కబళ్లాపురలో బీజేపీ సమీక్షా సమావేశంలో ఓటమిపై మహిళల కన్నీరు

## కాంగ్రెస్ చెప్పింది, కరెంటు బిల్లులు కట్టం

- ఓ గ్రామస్తుల వింత ధోరణి



**బనశంకరి:** ఈసారి శాసనసభ ఎన్నికల్లో గెలుపొందాలని ధ్యేయంతో కాంగ్రెస్ పార్టీ అనేక గ్యారంటీలను ప్రకటించింది. ఇందులో ప్రతి నెలా ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. జూన్ 1 నుంచి ఎవరూ కరెంటు బిల్లు చెల్లించరాదని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఎన్నికల ప్రచారసభల్లో కూడా ప్రకటించారు. ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది, మరోవైపు కొందరు అప్పుడే హామీల అమలు కోసం గళమెత్తారు. పార్టీ పెద్దలు చెప్పారు కాబట్టి విద్యుత్ బిల్లులు కట్టేది లేదని చిత్రదుర్గ జిల్లా జాలికట్టెలో సోమవారం గ్రామస్తులు మొండికేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది, మేము కరెంటు బిల్లు చెల్లించేదిలేదని బెస్కాం మీటర్ రీడర్‌కు గ్రామస్తులు స్పష్టంచేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ప్రభుత్వం చెబితే ఫ్రీగా ఇస్తాం**

ఇంకా ప్రభుత్వం ఏర్పాటు కాలేదు, మాకు ఆదేశాలు వస్తే మీకు బెస్కాం నుంచి ఉచితంగా కరెంటు ఇస్తాము, అప్పటివరకు బిల్లులుకట్టాలని మీటర్ రీడర్ తెలిపారు. దీనికి ఒప్పుకోని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ ఫ్రీ అని చెప్పారు. కాబట్టి మేం బిల్లులు చెల్లించేది లేదు. దీనిపై మీరు ప్రభుత్వానికి చెప్పండి అని కరాఖండిగా చెప్పారు. అందరూ ఇదే మాదిరి వాదిస్తే బెస్కాం పరిస్థితి ఏమవుతుందని విద్యుత్ అధికారుల్లో గుబులు ఏర్పడింది.



జాలికట్టెలో బెస్కాం మీటర్ రీడర్‌తో ఓ గ్రామస్తుడు

## ఎయిర్‌పోర్టులో హైటెక్ బిచ్చగాడు

**దొడ్డబళ్లాపురం:** బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో మాదిరిగా విమానాశ్రయాల్లో యాచకులు ఉండరు. వారిని దరిదాపుల్లోకి కూడా రాకుండా భద్రతా సిబ్బంది కాపలా కాస్తారు. కానీ ప్రయాణికుని మాదిరిగా బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో ప్రవేశించి కట్టుకథలు చెప్పి ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న హైటెక్ బిచ్చగాడు పట్టుబడ్డాడు. నిందితుడు విఘ్నేష్ (27) కాగా అతన్ని సీఐఎస్ఎఫ్ సిబ్బంది అరెస్టు చేసారు. ఇతడు చెన్నై నుంచి బెంగళూరుకి విమానంలో వచ్చి ఎయిర్‌పోర్టులో దిగగానే అందరికీ దీనగాథలను చెప్పేవాడు. తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని, ఆస్పత్రిలో చేర్చామని అత్యవసరంగా డబ్బులు కావాలని ఇంగ్లీషులో అడుక్కునేవాడు. ఇలా వేలల్లో డబ్బులు దండుకునేవాడు. సీఐఎస్ఎఫ్ అధికారులు అరెస్టు చేసినప్పుడు విఘ్నేష్ వద్ద 26 క్రెడిట్ కార్డులు లభించగా వాటిలో 24 యాక్టివ్‌గా ఉన్నాయి. చెన్నై, బెంగళూరు విమానాల్లో తిరుగుతూ యాచకత్వం సాగించేవాడని అధికారులు తెలిపారు. ఇతనితో పాటు మరికొందరు ఈ గ్యాంగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితునిపై 420 చీటింగ్ కేసు నమోదు చేసారు.



నిందితుడు

## ప్రయాణం ఉచితమని పేచీ!



**యశవంతపుర:** తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్ పాస్ ఇస్తాం, ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని కాంగ్రెస్ ప్రకటించడంతో, బీఎంటీసీ బస్సుల్లో కొందరు మహిళలు టికెట్ తీసుకోబోమని చెబుతున్నారు. ఇది కండక్టర్లకు సమస్యగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాబట్టి బస్సు ప్రయాణం ఉచితం కదా అని మహిళలు ప్రశ్నించడం గమనార్హం. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు టికెట్ తీసుకోవాలని కండక్టర్లు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



**అడ్మిషన్ ప్లీజ్** ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ ఆరంభమైంది. మంగళవారం బెంగళూరు జయనగరలో రాణి సరళాభాయి కాలేజీలో దరఖాస్తుల స్వీకారం



**క్లిక్.. క్లిక్** అందరూ ఒకేసారి కెమెరాలను ఎక్కుపెట్టారు. బెంగళూరు వెంకటప్ప ఆర్ట్ గ్యాలరీలో ఛాయాచిత్ర వర్క్‌షాప్‌లో శిక్షణలో ఓ దృశ్యం

## పొట్టలో కొకైన్ క్యాప్సూల్స్ దాచుకుని..

- కేఐఏలో పట్టుబడిన స్మగ్లర్

**దొడ్డబళ్లాపురం:** క్యాప్సూల్స్ రూపంలో కొకైన్‌ను మార్చి కడుపులో దాచుకుని తరలిస్తున్న నైజీరియన్‌ను కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ అధికారులు అరెస్టు చేసారు. ఏప్రిల్ 28న ఇథియోపియా నుంచి విమానంలో కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చిన నైజీరియన్ విమానంలో సిబ్బంది ఎన్నిసార్లు అడిగినా నీరు, ఆహారం తిరస్కరించడంతో వారు డీఆర్ఐ అధికారులకు సమాచారమిచ్చారు. కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో దిగగానే డీఆర్ఐ అధికారులు అతడ్ని అదుపులోకి తీసుకుని ఆస్పత్రికి తరలించి ఎక్స్‌రే తీయించగా పొట్టలో 64 క్యాప్సూల్స్ బయటపడ్డాయి. సుమారు కేజీ బరువుగల కొకెయిన్ విలువ బయట మార్కెట్లో రూ.11 కోట్లు అని అధికారులు తెలిపారు. నిందితుడు ఆఫ్రికాకు చెందిన 40 ఏళ్ల నైజీరియన్ వ్యక్తి. వైద్యం కోసం భారత్‌కు వచ్చినట్లు చెప్పాడు.



పట్టుబడ్డ కొకెయిన్ క్యాప్సూల్స్

## పిల్లలకు ఏమివ్వాలో తల్లికి తెలుసు

- ఢిల్లీ వెళ్లే ముందు డీకేశి వ్యాఖ్యలు

**శివాజీనగర:** కాంగ్రెస్ పార్టీ తనకు తల్లి లాంటిది. పిల్లలకు ఏమి ఇవ్వాలనేది తల్లికి తెలుసని కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ అన్నారు. నూతన సీఎం ఎంపికపై చర్చించేందుకు హైకమాండ్ పిలుపు మేరకు ఢిల్లీకి వెళ్లే ముందు ఆయన బెంగళూరులోని సదాశివనగర తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ...తాను తన దేవుడిని కలిసేందుకు దేవాలయానికి వెళ్తున్నానని, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తనను ఒక్కడినే ఢిల్లీకి రావాలని తెలిపారని, తన ఆరోగ్యం కుదుటపడిందని, ప్రజల ఆశీర్వాదంతో గెలుపు సాధించామని, వారు తమపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటామన్నారు. హైకమాండ్‌ను ముఖ్యమంత్రి స్థానం కోరుతారా అన్న ప్రశ్నకు తాను తన కర్తవ్యాన్ని నిర్వర్తించాను. 135 స్థానాలను గెలిపించి ఇచ్చాను అంతే అని ఆయన సమాధానమిచ్చారు.

తాను వెన్నుపోటు పొడవను, బ్లాక్ మెయిల్ చేయనని డీకేశి అన్నారు. తమది ఐకమత్యం కలిగిన ఇల్లు అని, తమ సంఖ్య 135 ఏ ఒక్కరిని విడగొట్టే పని చేయనని చెప్పారు.

## రూ. 20 చూపిస్తే రెండువేలు !

- స్వతంత్ర అభ్యర్థిపై కేసు

**శివాజీనగర:** ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచడానికి అభ్యర్థులు వివిధ మార్గాలను ఎంచుకుంటారు. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో 20 రూపాయల నోట్లనే సంకేతంగా ఉపయోగించుకుని నగదు పంపిణీ చేయటంపై ఎఫ్ఐఆర్ నమోదైంది. వివరాలు.... బెంగళూరు గాంధీనగర నియోజకవర్గంలో పరాజిత అభ్యర్థి, మాజీ మంత్రి మాలూరు కృష్ణయ్య శెట్టి, ఆయన మద్దతుదారులపై హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉదయం కొంత మంది ఓటర్లకు రూ. 20లు పంపిణీ చేస్తారు, వారు చెప్పిన చోటకు వెళ్తే రూ. 20లు చూపిస్తే రూ. 2 వేలు ఇస్తారు. ఓటర్ల గుర్తింపు కార్డు ఉన్న వారికి ఇలా పంపిణీ చేసినట్లు సమాచారం. ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కృష్ణయ్య శెట్టి, ఆయన అనుచరులపై కేసు నమోదైంది.

## డాక్టరైన మహిళా కండక్టర్

- బస్సులో గర్భిణికి ప్రసవం

**బనశంకరి:** కేఎస్ ఆర్‌టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో మహిళా కండక్టర్ డాక్టర్‌గా మారి సురక్షితంగా కాన్పు చేసింది. చిక్కమగళూరు డిపోకు చెందిన కేఎస్ ఆర్‌టీసీ బస్సు సోమవారం బెంగళూరు నుంచి చిక్కమగళూరుకు వెళ్తోంది. బెంగళూరు నుంచి బేలూరుకు ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి ప్రసవ వేదన ఆరంభమైంది. బస్సు వెళ్లే మార్గంలో అటు ఇటు 16 కిలోమీటర్ల వరకూ ఎలాంటి ఆసుపత్రి లేదు. దీంతో బస్సులోని మహిళా కండక్టర్ ఎస్.వసంతమ్మ బస్సును నిలిపి ప్రయాణికులను కిందికి దింపివేశారు. ఆమె గర్భిణికి కాన్పు చేయగా ఆడపిల్ల పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

మహిళ నిరుపేద కావడంతో చేతిలో ఖర్చులకు కూడా డబ్బులు లేవు, ఆమె పరిస్థితిని గమనించి కండక్టర్, డ్రైవరు ప్రయాణికులు కలిసి రూ.1,500 సేకరించి బాలింతకు అందజేశారు. తరువాత అంబులెన్స్ ద్వారా శాంతిగ్రామ ఆసుపత్రిలో చేర్చారు. మహిళా కండక్టర్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.



శిశువుతో కండక్టర్ వసంతమ్మ, ఆస్పత్రిలో తల్లితో వసంతమ్మ

## కేంద్ర శాఖల్లో ఉద్యోగాల భర్తీ



**మైసూరు:** దేశంలో యువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంతో పాటు అందరికీ ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తుందని కేంద్ర వ్యవసాయ సహాయ శోభా కరంద్లాజె అన్నారు. మంగళవారం మైసూరు నగరంలోని మానసగంగోత్రిలో ఉద్యోగ మేళాను మంత్రి ప్రారంభించారు. దేశంలో ఉన్న అన్నిచోట్లా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, అన్ని శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించిందని చెప్పారు. అతి త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు సంస్థలు యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశాయి.

## యడ్డి ఏడుపు బీజేపీకి శాపం : షెట్టర్

**యశవంతపుర:** సీఎంగా ఉన్న యడియూరప్పతో రాజీనామా చేయించడంతో బీజేపీకి ఈ గతి పట్టిందని మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ ఆరోపించారు. ఆయన మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ సీఎం పదవిలో మంచి అభివృద్ధి పనులు చేస్తున్న ఆయనను పదవి నుంచి తప్పించడం వల్ల కన్నీరు పెట్టారు. ఆ కన్నీరు బీజేపీకి శాపంగా మారి ఓటమికి కారణమైందని చెప్పారు. యడియూరప్పను ఎందుకు తప్పించారో కేంద్ర నాయకులు బహిరంగం చేయాలని డిమాండ్ చేశారు. నేను ఓడినా ఫర్వాలేదు, కానీ లింగాయత సముదాయం ఓట్లు కాంగ్రెస్ గెలుపునకు కారణమైనట్లు షెట్టర్ తెలిపారు. ఒక సీటు కోసం తనను బీజేపీ నాయకులు వేధించడం వల్ల లింగాయత సముదాయం సహించలేక కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. ఎంతోమంది నాయకులు బీజేపీని వీడితే ఎవరినీ కూడా బుజ్జగించలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌లో తనకు గౌరవమైన స్థానం కల్పిస్తామని ఖర్గే హామీనిచ్చినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### తిమ్మాపూర్‌కు డీసీఎం పదవి ఇవ్వాలి

కంప్లి: సామాన్య కార్యకర్తలా, సైనికుడిలా పార్టీ అభివృద్ధికి శ్రమించి, జౌళి నిగమ అధ్యక్షునిగా, మంత్రిగా, విధాన పరిషత్ సభ్యునిగా ఉత్తమ సేవలు అందించిన మాజీ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్‌కు ఉపముఖ్యమంత్రి స్థానం అందించాలని మెట్రి కర్ణాటక దళిత సంఘర్ష సమితి(డీజీ.సాగర్ బణ) తాలూకా సమన్వయ సంచాలకులు ఏ.కుమారస్వామి ఒత్తిడి చేశారు. మంగళవారం ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగ సముదాయానికి రాజకీయ ప్రాతినిథ్యం అందించాలన్నారు. సమావేశంలో మాదిగ సమాజ కంప్లి తాలూకా క్షేమాభివృద్ధి సమాఖ్య అధ్యక్షులు డీఎస్.ప్రసాద్ మాదిగ, సమాజ ప్రముఖులు వీరాంజనేయులు, హన్మంతప్ప, హెచ్.జగదీశ్, జీ.యల్లప్ప, ఎమ్మిగనూరు జడెప్ప, గోనాళ కృష్ణ, శేఖర్, శాంతప్ప, మెట్రి నాగరాజ్, బ్లాక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్‌పీ శశికుమార్ పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలను అరికట్టండి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాల విక్రయాన్ని అరికట్టాలని అఖిల భారత రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద అధ్యక్షులు జమాలుద్దీన్ మాట్లాడారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా నిల్వ ఉంచాలని, పత్తి గింజల ధరలను నియంత్రించాలని, నాణ్యమైన విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరుతూ వ్యవసాయ శాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### పక్షుల కోసం నీటితొట్టెలు



నీరుపోస్తున్న సభ్యులు

మైసూరు: మైసూరు నగరంలో కోర్టు ముందు ఉన్న నీటి తొట్టెలను కేఎంపికె చారిటబుల్ ట్రస్టు సభ్యులు మంగళవారం నీటితో నింపారు. ఎండాకాలంలో పశువులు, పక్షుల దాహార్తి తీరుతుందని చెప్పారు. నగరంలో పలుచోట్ల 30కి పైన నీటి తొట్టెలను ఏర్పాటు చేసినట్లు, రోజూ ఉదయం, సాయంత్రం వాటిలో నీటిని పోస్తామని చెప్పారు.

### అప్రమత్తతే డెంగీకి మందు

గంగావతి: డెంగీ జ్వరానికి ముందు జాగ్రత్త చర్యగా మందులను వాడాలని ఆరోగ్యశాఖ అధికారిణి ఆశాబేగం పేర్కొన్నారు. ఆమె డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులపై ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. డెంగీ జ్వరం ఇటీవల కురిసే కొద్దిపాటి వర్షాలకు సంభవిస్తుందని, అందువల్ల తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇళ్ల పరిసరాలను శుభ్రపరుచుకొని ప్రధానంగా నీరు నిల్వకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మలేరియా తాలూకా అధికారి దేవేంద్రప్ప, ఆ శాఖ నీక్ అధికారి హెచ్.సురేష్, రమేష్, సరస్వతి పాల్గొన్నారు.

### డెంగీపై ప్రచారం అవసరం

రాయచూరు రూరల్: జిల్లాలో చాప కింద నీరులా విస్తరిస్తున్న డెంగీ వ్యాధిపై ముమ్మర ప్రచారం చేపట్టాలని జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు పిలుపు ఇచ్చారు. మంగళవారం జిల్లా ఆరోగ్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డెంగీపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్యాధికారి షాకీర్, వైద్యులు గణేస్, నందితా, లలిత, సరోజ, సంధ్యలున్నారు.

### విధానసౌధలో మంత్రుల ఆఫీసులు ఖాళీ

- ముఖ్యమైన సామగ్రి తరలింపు



ఓ మంత్రి ఆఫీసులో ఫైళ్లను కట్టకడుతున్న దృశ్యం

శివాజీనగర: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పరిపాలనా శక్తి కేంద్రాలైన విధానసౌధ, వికాససౌధలో మంత్రుల ఆఫీసులు ఖాళీ అవుతున్నాయి. బీజేపీ తాజా మాజీ మంత్రులు తమ తమ వస్తువులను ఆఫీసుల నుంచి ప్యాక్ చేసి ఇళ్లకు తరలించడం ప్రారంభించారు. కార్యాలయాల్లో ఉన్న గంపలకొద్దీ కాగితాలను, పత్రాలను సిబ్బంది తొలగించటం ప్రారంభించారు. కొత్త మంత్రుల రాక కోసం శుభ్రం చేయసాగారు. ఎన్నికల్లో ఓటమి తరువాత సీఎం బొమ్మై గవర్నర్‌కు రాజీనామాను అందజేశారు. ఆ వెంటనే మంత్రులందరూ పదవులను కోల్పోయినట్లయింది. సీఎం తాత్కాలికంగా కొనసాగడం తెలిసిందే. విధానసౌధ, వికాససౌధలు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేశాక సందడి మొదలవుతుంది.

# ఛాయాచిత్రం.. ఇలా అద్భుతం



నాట్య కళాకారిణిని ఫోటో తీయడంపై శిక్షణ



కెమెరాలు, మొబైల్‌తో ఛాయాచిత్రాలు తీయడంపై శిక్షణ

- ఫోటోగ్రఫీలో యువతకు వర్క్‌షాప్

బనశంకరి: యూత్ ఫోటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీలో మెళకువలపై యువతకు వర్క్‌షాప్ నిర్వహించింది. బెంగళూరు వెంకటప్ప ఆర్ట్ గ్యాలరీలో యూత్‌ఫోటోగ్రఫిక్ సొసైటీ అధ్యక్షుడు మంజువికాస్‌శాస్త్రి, ప్రేమ కాకడేలు మొబైల్, డీఎస్ఎల్ఆర్ కెమెరాలో అత్యుత్తమ ఫోటోలు, వీడియోలు తీయడం, ఎడిటింగ్ గురించి వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫోటోలు తీయడమే కాకుండా అతిసులువుగా మొబైల్‌లోనే ఫోటో, వీడియోల ప్రాసెసింగ్, మిక్సింగ్ గురించి ఔత్సాహికులకు బోధించారు.

**మెళకువల బోధన**

ఫోటోలు తీసేటప్పుడు ఎలాంటి తప్పుల చేయరాదు అనేది ప్రయోగాత్మకంగా వివరంచారు. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, ఫోటోగ్రఫీపై మక్కువ కలిగిన వ్యక్తులు పాల్గొన్నారు. భరతనాట్యం, యక్షగానం కళాకారుల ప్రదర్శన జరుగుతుండగానే ఆకర్షణీయమైన ఫోటోలను తీయడంపై శిక్షణనిచ్చారు. ఆ చిత్రాల గురించి నిపుణులు సమీక్ష నిర్వహించి నైపుణ్యాలను పెంచుకోవడం గురించి తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను వితరణచేశారు. సతీశ్, హార్దిక్ షా, మధు కాకడే, భాగ్య పాల్గొన్నారు.

## హంపీలో యథేచ్ఛగా తవ్వకాలు



పథకం పనుల కోసం తవ్వకాలు చేపట్టిన దృశ్యం

హొసపేటె: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న హంపీ బడవలింగ స్మారకం వద్ద మంచినీటి సరఫరా పథకం పనుల కోసం తవ్వకాలను హంపీ గ్రామ పంచాయతీ కార్యాలయం వారు యథేచ్ఛగా సాగిస్తున్నారు. హంపీలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని నియమాలు ఉన్నా వాటిని గాలికి వదిలి అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. హంపీకి వచ్చే పర్యాటకులు, భక్తాదులకు మంచినీరు, వసతి, మరుగుదొడ్ల నిర్మాణ పనులతో పాటు మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు గ్రామ పంచాయతీ నడుం బిగించింది. కానీ అధికారులు హంపీలో ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టాలన్నా స్మారకాలకు ఎలాంటి హాని కలుగకుండా చర్యలు తీసుకోవాలి. హంపీలోని రాయల కాలం నాటి సుందర స్మారకాలు, కట్టడాలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. భావి తరాలకు కూడా హంపీలోని ప్రతి స్మారకం, కట్టడాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని పర్యాటకులు పేర్కొన్నారు.

## ఆలయ జీర్ణోద్ధరణకు రూ.2 లక్షల డీడీ



డీడీని అందిస్తున్న జిల్లా యోజన నిర్దేశకులు సతీష్‌శెట్టి

కంప్లి: కంప్లి కొట్టాల(గోపాలపురం)లో రుక్మిణి పాండురంగ దేవస్థానం జీర్ణోద్ధరణకు శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ద్వారా విజయనగర జిల్లా యోజన నిర్దేశకులు సతీష్ శెట్టి రూ.2 లక్షల డీడీ అందించారు. యోజనాధికారి హాలప్ప, మున్సిపల్ మాజీ అధ్యక్షులు ఎం.సుదీర్, దేవస్థానం పాలక మండలి పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

- నదిలో స్నానానికెళ్లి సోదరుల దుర్మరణం



మరణించిన సోదరులు(ఫైల్)

రాయచూరు రూరల్: ఈతకెళ్లిన సోదరులిద్దరు దుర్మరణం పాలైన ఘటన సోమవారం మధ్యాహ్నం జిల్లాలోని సింధనూరు తాలూకా ధడేసూగూరులో చోటు చేసుకుంది. తుంగభద్ర నదిలో వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం నదిలో స్నానం కోసం వెళ్లిన అమర్(18), మల్లికార్జున(16) అనే అన్నదమ్ములిద్దరూ నదిలోని బురదలో చిక్కుకుపోయి మృత్యువాత పడ్డారు. సాయంత్రం ఈ విషయం తెలుసుకున్న తండ్రి ముదియప్ప గ్రామీణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై సింధనూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



కిట్లను అందిస్తున్న తహసీల్దార్ గౌసియాబేగం

కంప్లి: పిల్లల ఆరోగ్య సంరక్షణపై తల్లులు శ్రద్ధ వహించాలని తహసీల్దార్ గౌసియాబేగం తెలిపారు. మంగళవారం మెట్రిక్ పూర్వ బాలుర విద్యార్థి నిలయంలో అపౌష్టిక ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన బాల చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లలో పిల్లలు అపౌష్టికత బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సిరుగుప్ప సహాయక శిశు అభివృద్ధి యోజనాధికారి మోహన్ మాట్లాడుతూ తాలూకాలో అపౌష్టికతతో బాధపడుతున్న 32 మంది శిశువులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ రాధిక, ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప, పాఠశాల పూర్వ విద్య జిల్లా సంపన్మూల వ్యక్తి కే.జగన్నాథ్, ఆరోగ్య నిరీక్షణాధికారి బసవరాజ్, అంగన్‌వాడీ అధికారిణి లతీఫా బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మారుతున్న ప్రభుత్వం..విమ్స్ అధికారుల్లో భయం



విమ్స్ డైరెక్టర్ కార్యాలయం(ఫైల్)

బళ్లారి రూరల్ : ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాధికారులు, ప్రభుత్వరంగ సంస్థలు నిష్పక్షపాతంగా పాలన సాగిస్తే ఎటువంటి సమస్యలు రావు. అయితే అధికార పక్షానికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తే తరువాత మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్దాసుపత్రిగా పేరుగాంచిన బళ్లారి విమ్స్‌లో అధికారుల తీరే వేరన్నట్లుగా వ్యవహరిస్తూ విమ్స్ పాలకమండలి సభ్యులు ప్రభుత్వం మారితే కంగారు పడాల్సిన పరిస్థితి తెచ్చుకొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకమండలి స్థానిక నాయకులకు అనుకూలంగా కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులు, ఉద్యోగ నియామాల్లో సిఫారసులతో అధికారుల నియామకాలు సాగించారు. ఉద్యోగులపై సైతం కక్షసాధింపుతో బదిలీ వేటువేశారు. నిధులు సైతం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారుతున్న తరుణంలో తమ కుర్చీలకు ఎక్కడ ఎసరొస్తుందోనని అధికారులు భయపడుతున్నారు. ఏదేమైనా కొత్తప్రభుత్వం రాకతో విమ్స్‌లో కొత్త పరిణామాలు ఎలా మారతాయో చూడాల్సిందే.

## బావిలో మునిగి బాలుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కంబదూరు: మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో ప్రభాస్ (10) అనే బాలుడు బావిలో ఈతకెళ్లి చనిపోయాడు. వివరాలు..బోయ భాస్కర్, కవితలది కర్ణాటకలోని తిప్పగానపల్లి గ్రామం, వీరికి ప్రభాస్,హర్షిత్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కవిత పెద్దకుమారుడైన ప్రభాస్‌ను చిన్నప్పుడే మర్రిమాకులపల్లి గ్రామంలో తల్లిదండ్రుల వద్ద వదిలింది. అవ్వాతాతల వద్ద ఉంటూ 4వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ప్రభాస్ తల్లిదండ్రుల గ్రామానికి వచ్చాడు. మంగళవారం ప్రభాస్, తమ్ముడైన హర్షిత్‌తో కలిసి ఊరిబయట ఉన్న బావికి వెళ్లాడు. ప్రభాస్ ఈత రాకున్నా బావిలోకి దిగగానే మునిగిపోయాడు. దీంతో తమ్ముడు గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు వచ్చి చూసేసరికి ప్రభాస్ విగతజీవిగా ఉన్నాడు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

- గాలి జనార్ధనరెడ్డే నాకు మార్గదర్శకుడు
- కేఆర్‌పీపీ నాయకుడు కేఎస్ దివాకర్



మాట్లాడుతున్న కే.ఎస్.దివాకర్

బళ్లారి రూరల్ : గాలి జనార్ధనరెడ్డే తనకు మార్గదర్శకుడని, మున్ముందు స్థానిక ఎన్నికల్లోను కేఆర్‌పీపీ మనుగడకు శ్రమిస్తానని ఆ పార్టీ ప్రముఖుడు కే.ఎస్.దివాకర్ తెలిపారు. సండూరులోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికాగోష్టిలో ఆయన మాట్లాడారు. గాలి జనార్ధనరెడ్డి తనకు మహాశక్తి, ఆయన మార్గదర్శకత్వంలో సండూరు టీపీ, జెడ్పీ, లోకసభ ఎన్నికలకు సిద్ధమౌతామని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు సరిపోక కేఆర్‌పీపీలో చేరి కేవలం 15 నుంచి 20 రోజులపాటు ప్రచారం చేస్తే 32,561 ఓట్లు సాధించానన్నారు. ఆర్‌టీసీ బస్టాండు, హైటెక్ ఆసుపత్రి, తాగునీటి సౌకర్యాలు లేవన్నారు. సండూరులో అనేక సమస్యలు ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. కేఆర్‌పీపీ కార్యకర్తలు అధైర్య పడకూడదన్నారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తానున్నానన్నారు. సండూరును వీడి తాను ఎక్కడికీ వెళ్లనని, ఇక్కడే ఉండి పార్టీతో పాటు సండూరు అభివృద్ధికి పాటుపడతానన్నారు.

# ఈశ్వర్ ఖండ్రేను డీసీఎం చేయండి



మాట్లాడుతున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: కల్యాణ కర్ణాటకలో వీరశైవ లింగాయత్ సమాజంలో ప్రముఖ నాయకుడు, బీదర్ జిల్లా భాల్కి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఈశ్వర్ భీమణ్ణ ఖండ్రేకు ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని మఠాధీశులు డిమాండ్ చేశారు. మంగళవారం కిల్లే బృహన్మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిచ్చాలి మఠాధిపతి వీరభద్ర శివాచార్య, శాంతమల్ల శివాచార్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పైవిధంగా నివేదించారు. 1989 నుంచి కల్యాణ కర్ణాటకలో వీరశైవ లింగాయత్‌లకు ముఖ్యమంత్రి పదవి కేటాయించలేదన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మఠాధీశుల కమిటీ కలసి ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించాలని కోరిందన్నారు. ఖండ్రేకు నాలుగు సార్లు శాసన సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీ కార్యాధ్యక్షుడిగా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. వీరేంద్ర పాటిల్ అనంతరం వీరశైవ లింగాయత్‌లకు సీఎం, డీసీఎం పదవులు లభించలేదన్నారు. పార్టీ జారీ చేస్తామన్న సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు పరచాలన్నారు. జిల్లాలో సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు.

## కల్యాణ కర్ణాటకకు కేబినెట్‌లో పెద్ద పీట వేయాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర కుష్టిగి

రాయచూరు రూరల్: కల్యాణ కర్ణాటకలో ఎనిమిది మందికి అమాత్య పదవులివ్వాలని హైదరాబాద్ కర్ణాటక జనాందోళన సమితి సంచాలకుడు రాఘవేంద్ర కుష్టిగి పేర్కొన్నారు. ఆయన మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీజేపీ సర్కార్ హయాంలో ప్రాంతీయ అసమానతలను నివారించడంలో, స్థానిక మంత్రులను కేటాయించక పోవడంతో ఈ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైందన్నారు. కొత్త ప్రభుత్వ మంత్రివర్గంలో ఈ ప్రాంతానికి పెద్ద పీట వేయాలన్నారు. నంజుండప్ప కమిషన్ నివేదిక ఆధారంగా కలబుర్గి విభాగంలో 8 మందికి మంత్రి పదవులు కట్టబెట్టాలన్నారు.

## మంత్రి పదవి కోసం కార్యకర్తల పూజలు

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ తూర్పు ఎమ్మెల్యే అబ్బయ్య ప్రసాద్ హ్యాట్రిక్ గెలుపు సాధించిన నేపథ్యంలో మంత్రి పదవి లభించాలని స్థానిక మూరు సావిర మఠంలో కాంగ్రెస్ కార్యకర్తలు విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి చాలా కృషి చేశారన్నారు. అంతేగాక ఆయనకు ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందన్నారు. నిరాడంబర వ్యక్తిత్వంతో అందరినీ ఆకట్టుకునే తత్వం ఆయనదని తెలిపారు. ఆయన అభిమానుల సంఘం అధ్యక్షులు ప్రకాశ్ హుబ్లీ ఈసారి మంత్రి పదవి ఇవ్వక పోతే తీవ్రంగా ఆందోళన చేస్తామని, మంచి కేబినెట్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కేఆర్‌పీపీ నాయకులకు ఉలుకెందుకో?

గంగావతి రూరల్: కాంగ్రెస్ నాయకులు హెచ్.ఆర్ శ్రీనాథ్, ఎం మలికార్జున నాగప్పల గురించి తాము మాట్లాడితే కేఆర్‌పీపీ నాయకులకు ఉలుకెందుకు? అని గంగావతి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శామీద్ మనియర్ ఎద్దేవా చేశారు. ఆయన మంగళవారం స్థానిక పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇందులో వీరికి ఉన్న సంబంధం ఏమిటో ప్రజలకు అర్థమైందన్నారు. ఇకనైనా నైతిక విలువలతో కూడిన రాజకీయం చేయాలని హితవు పలికారు. గంగావతి కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారి ఓటమికి ఆ ఇద్దరు నాయకులు బాధ్యత వహించి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జుబేర్, మహమ్మద్ అయూబ్‌ఖాన్, నగర ఘటక అధ్యక్షులు మల్లేశప్ప, దేవరాజ్, నబీసాబ్, ఫ్రూట్ బాబా(షేక్‌బాబా) తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ దేవత జాతర

హుబ్లీ: హుబ్లీ సమీపంలోని కట్నూరు గ్రామంలో గ్రామ దేవత జాతర మహోత్సవం భక్తిశ్రద్ధలతో మంగళవారం నెరవేర్చారు. ఈ సందర్భంగా బండార హొన్నాట, గ్రామ దేవి ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. ఆ గ్రామంలో తొలిసారిగా జాతర చేపట్టడం విశేషం. 5 రోజుల పాటు జాతర జరగనుంది. ఎటువంటి కుల మత విభేదాలు లేకుండా బండార హొన్నాటను ప్రజలు ఆడారు. యువతీ యువకులు, మహిళలు, చిన్నారులు బండారను పరస్పరం చల్లుకొని భక్తిభావం చాటుకున్నారు. యువత నృత్యం చేశారు. వివిధ ధార్మిక కార్యక్రమాలు 5 రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## తంగడిగిని డీసీఎం చేయాలి

గంగావతి: కనకగిరి ఎమ్మెల్యే శివరాజ్ తంగడిగికి ఉప ముఖ్యమంత్రి స్థానాన్ని కల్పించాలని ఆ పార్టీ సిద్ధాపుర నేత మల్లికార్జున హొసమని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన హైదరాబాద్-కర్ణాటక ప్రాంతానికి రాజకీయ ప్రాధాన్యత కల్పనలో భాగంగా మెజార్టీతో గెలుపొందిన శివరాజ్ తంగడిగికి డీసీఎం పదవిని కట్టబెట్టాలన్నారు. ఆయనకు ఆ స్థానం కల్పించడం వల్ల వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి సముచితమైన న్యాయం చేకూరుస్తారని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో కుంభోత్సవ పూజలు



మేటి కుంభం ఊరేగింపులో పాల్గొన్న జ్యోతిష్యుల కుటుంబ సభ్యులు

బళ్లారి అర్బన్: నగర ప్రజల ఆరాధ్యదైవం కనక దుర్గమ్మ కుంభోత్సవ పూజలను మంగళవారం వైశాఖ మాస సందర్భంగా సింధే ఎస్‌వి.రాఘవేంద్ర జ్యోతిష్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజేశ్వరి నగర్, పాండురంగ దేవస్థానం సమీపంలోని రాఘవేంద్ర జ్యోతిష్యుల ఇంటి నుంచి ఊరేగింపుగా కుంభంతో పాటు వివిధ వేషభూషణలతో కోలాట నృత్యాలు, బ్యాండ్ డోలు వాయిద్యాలతో కలశాలతో ఊరేగింపును కుమారస్వామి దేవస్థానం మీదుగా ఎస్పీ సర్కిల్, పార్వతీనగర్, కనక దుర్గమ్మ దేవస్థానం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్‌వీ.రాఘవేంద్రజోషి, ఎస్‌వీ.శాస్త్రీ, ఎస్‌వీ.రమేష్‌జోషి, ఎస్‌వీ.చంద్రజోషి, ఎస్‌వీ.కృష్ణజోషిలు ముందుగా పూజలను నిర్వహించి మేటి కుంభాన్ని ముక్తాభాయ్, వినోద్‌లు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం జ్యోతిష్యులు మాట్లాడుతూ గతంలో వ్యాపించిన కరోనా మహమ్మారి బారి నుంచి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ప్రజా శాంతి కోసం ఆదిశక్తి అమ్మవారికి జ్యోతిష్యులు కోరుకొన్న మొక్కులను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది వర్షాలు బాగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని పూజలు చేశామన్నారు. ఈసందర్భంగా సమాజ బాంధవులతో పాటు భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

## కోలారు వార్తలు...

# 57 మందికి ధరావత్తు గల్లంతు

కోలారు: జిల్లాలోని 6 నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో ఈనెల 13న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌లో 57 మంది అభ్యర్థులు ధరావత్తు(డిపాజిట్ల)ను కోల్పోయారు. జిల్లాలో మొత్తం 72 మంది అభ్యర్థులు పోటీ పడగా డిపాజిట్లు కోల్పోయిన వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా ఉండడం గమనార్హం. వీరిలో ముగ్గురు చొప్పున బీజేపీ, బీఎస్పీ, ఇద్దరు జేడీఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కేఆర్ఎస్ పార్టీలకు చెందిన అందరు అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో మాలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన హూడి విజయకుమార్ మాత్రం డిపాజిట్ దక్కించుకోవడంలో సఫలమయ్యారు. ఓడిన వారిలో 15 మంది డిపాజిట్లు దక్కించుకున్నారు. వీరిలో ఆర్‌పీఐకి చెందిన ఎస్.రాజేంద్రన్ కూడా ఒకరు. శ్రీనివాసపురం నుంచి పోటీ చేసిన గుంజూరు శ్రీనివాసరెడ్డి(బీజేపీ) 6644 ఓట్లు, ముళబాగిలు నుంచి పోటీ చేసిన సీగేహళ్లి సుందర్(బీజేపీ) 9,163 ఓట్లు, బంగారుపేట నుంచి పోటీ చేసిన ఎం నారాయణస్వామి(బీజేపీ) 8972 ఓట్లు, కేజీఎఫ్ నుంచి పోటీ చేసిన డాక్టర్ రమేష్‌బాబు(జేడీఎస్) 1360 ఓట్లు, మాలూరు నుంచి పోటీ చేసిన జేఈ రామేగౌడ(జేడీఎస్) 17,627 ఓట్లు సాధించి డిపాజిట్లు కోల్పోయారు.

**తొలి మూడు స్థానాలు మినహా..**

శ్రీనివాసపురం, ముళబాగిలు, బంగారుపేట నియోజకవర్గాల్లో విజేత, రెండో స్థానం పొందిన వారు మినహాయించి మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోవడం విశేషం, కోలారు, మాలూరు, కేజీఎఫ్ నియోజకవర్గాలలో విజేత, రెండు, మూడు స్థానాలు పొందిన వారు మినహాయించి మిగిలిన వారందరి డిపాజిట్ గల్లంతయింది. శ్రీనివాసపురం నుంచి 9 మంది అభ్యర్థులు పోటీపడగా వీరిలో విజేత జేడీఎస్ అభ్యర్థి జి కె వెంకటశివారెడ్డి, పరాజిత కాంగ్రెస్ అభ్యర్థి కె ఆర్ రమేష్‌కుమార్ మినహాయించి మిగిలిన వారందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. కేజీఎఫ్ నుంచి 10 మంది అభ్యర్థులు పోటీ పడగా వీరిలో జేడీఎస్‌కు చెందిన రమేష్‌బాబుకు నోటా కంటే తక్కువ ఓట్లు లభించాయి. కోలారు నుంచి 18 మంది అభ్యర్థులు పోటీ పడగా వీరిలో కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ అభ్యర్థులకు మాత్రమే డిపాజిట్ దక్కగా మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. జనరల్ నియోజకవర్గం నుంచి రూ.10 వేలు, రిజర్వ్‌డ్ నియోజకవర్గం అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చేశారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు ఓట్లు పొందని అభ్యర్థులకు డిపాజిట్ మొత్తం వాపసు రాదు. ఈ మొత్తాన్ని ఎన్నికల కమిషన్ స్వాధీనం చేసుకుంటుంది.

## పార్టీలకతీతంగా లబ్ధి అందిస్తా



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: ప్రభుత్వ సౌలభ్యాలను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ అందిస్తానని విజేత జేడీఎస్ అభ్యర్థి జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. మంగళవారం యల్దూరు గ్రామంలో జేడీఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఫరవా లేదు ప్రత్యేక నిధులను తెచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ సాగుదారులకు అర్హులైన వారందరికీ బోరుబావులు తవ్వించి ఇస్తానన్నారు. నియోజకవర్గంలో ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. లక్ష్మీపుర, యల్దూరుల్లో గ్రామీణ విద్యార్థుల అనుకూలం కోసం జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామన్నారు. ప్రతి గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పిస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను అందిస్తామన్నారు. ఈసందర్భంగా జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ శివారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి, ఎంపీ శ్రీనివాస్, రాజణ్ణ పాల్గొన్నారు.

## డెంగీని తరిమికొడదాం

కోలారు: అందరి సహకారంతో సమాజం నుంచి డెంగీ వ్యాధిని తరిమికొడదామని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ డెంగీ దినోత్సవంలో భాగంగా జాతాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లలో పరిశుభ్రతను పాటించాలన్నారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, సింటెక్స్‌లను కనీసం వారానికోసారి శుభ్రం చేయాలన్నారు. ఇంటి చుట్టుపక్కల వాన నీరు నిలవకుండా, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. తాలూకా వైద్యాధికారి డాక్టర్ నారాయణస్వామి, ఆర్ఎంఓ డాక్టర్ బాలసుందర్, డాక్టర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మునియప్పను సీఎంని చేయాలని ధర్నా



కోలారు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా దళితుడికి అవకాశం ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత, కేంద్ర మంత్రిగా అపార అనుభవం కలిగిన కెహెచ్ మునియప్పను ఈసారి ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం నగరంలోని మెక్కె సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఊరుబాగిలు శ్రీనివాస్, నాయకులు జయదేవ్, ఉదయకుమార్, మల్లప్ప పాల్గొన్నారు.

## ఖైదీల గొడవలో ఒకరికి గాయాలు

కేజీఎఫ్: చాంపియన్ రీఫ్‌లో ఉన్న ప్రత్యేక కారాగృహంలో సోమవారం రాత్రి ఇద్దరు హత్య కేసు నిందితులు పరస్పరం ఘర్షణ పడ్డారు. ఘటనలో ఒక ఖైదీ గాయపడ్డాడు. జైలులో రాత్రి 8.30 గంటల సమయంలో ఎ బ్యారక్‌లో ఉన్న విజయకుమార్, వెంకటేష్‌లు గొడవ పడ్డారు. విజయకుమార్ విసిరిన పేపర్ వెంకటేష్‌పై పడింది. అప్పుడు ప్రారంభమైన గొడవ పెద్దదై పరస్పరం దాడులకు దిగారు. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది గమనించి వీరిని అదుపు చేశారు. ఘటనలో వెంకటేష్ గాయపడగా, అతనిని సిబ్బంది ఆస్పత్రికి తీసుకు వెళ్లి చికిత్స చేయించారు. వెంకటేష్‌పై దాడి చేసిన విజయకుమార్ హత్య కేసులో ప్రముఖ నిందితుడు, నగరంలోని హెన్రిస్ కాలనీ నివాసి, గాయపడిన వెంకటేష్ కూడా హత్య కేసులో నిందితుడిగా ఉండి విచారణ ఖైదీగా ఉన్నారు.

## హుండీలో కానుకల లెక్కింపు



మాలూరు: పట్టణంలోని మారికాంబ ఆలయంలో భక్తులు హుండీలో వేసిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.25 లక్షల నగదు, 28 గ్రాముల బంగారం, 280 గ్రాముల వెండి లభించింది. గత మూడు నెలలుగా భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. భక్తులు హుండీలో వేసిన కానుకలను ఆలయ ట్రస్టు అధ్యక్షుడు పి.వెంకటేష్ అధ్యక్షతన కెనరా బ్యాంకులో జమ చేశారు.

## క్లుప్తంగా

### డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలి



మాట్లాడుతున్న వక్కలిగ సంఘం నేతలు

మండ్య: రాష్ట్ర సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరుపొందిన వక్కలిగ సముదాయానికి చెందిన కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని జిల్లా వక్కలిగ సంఘం అధ్యక్షుడు తిమ్మేగౌడ గౌడయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని, అలాంటి నాయకుడిని ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు.

### ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్టు

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణంలో సోమవారం జరిగిన రెండు చైన్‌స్నాచింగ్ సంఘటనలకు సంబంధించి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దొడ్డ తాలూకా గెద్దలపాళ్య గ్రామానికి చెందిన సుబ్రమణి (23), ప్రవీణ్ (19) పట్టుబడ్డ నిందితులు. సోమవారం మధ్యాహ్నం సమయంలో శాంతినగర్ 10వ క్రాస్‌లో భారతి అనే మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన నిందితులు చైను లాక్కెళ్లారు. అదేవిధంగా సాయంత్రం కుచ్చప్పనపేటలో వృద్ధురాలి మెడలో చైను లాక్కెళ్లారు. సీసీ కెమెరా దృశ్యాలు పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేసారు.

### ఘనంగా అమ్మవారి రథోత్సవం



రథోత్సవంలో భక్తజనం

మండ్య: మండ్య నగరంలోని పోలీసు కాలనీలో చాముండేశ్వరి అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం చాముండేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### పునరావాస కేంద్రానికి యాచకులు

మైసూరు: మైసూరు నగరంలోని ప్రముఖ కూడళ్లలో భిక్షాటన చేస్తున్న సుమారు 16 మంది బాలలు, నలుగురు మహిళలను అధికారులు పట్టుకుని ఆశ్రయ కేంద్రానికి తరలించారు. వివిధ శాఖల అధికారులు కలిసి మృగాలయం చుట్టుపక్కల ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు పర్యాటకులను యాచిస్తున్న 7 మంది బాలికలు, 7 మంది బాలురు, మరో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని బాలల మందిరానికి తరలించారు.

### బోనులో పడ్డ చిరుత



దొడ్డబళ్లాపురం: గత కొన్ని రోజులుగా రామనగర తాలూకా అరెగడకల్లు గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ గ్రామస్తుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్న చిరుత మంగళవారం తెల్లవారుజామున బోనులో పడింది. రెండు రోజుల క్రితం అటవీశాఖ అధికారులు అరెగడకల్లు గ్రామం శివారులోని ఒక తోటలో బోను ఏర్పాటు చేసారు. మంగళవారం ఉదయం ఆహారం వెదుక్కుంటూ వచ్చిన చిరుత బోనులోపడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చిరుతను తీసికెళ్లి అడవిలో వదిలేసారు.

### పరమేశ్వర్ విజయంపై సంబరాలు



తుమకూరు: మాజీ డీసీఎం పరమేశ్వర్ తుమకూరు జిల్లాలోని కోరటిగెరె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించడంతో తుమకూరు నగరంలోని శ్రీ సిద్దార్థ విద్యాసంస్థల ఆవరణంలో కళాశాల సిబ్బంది బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని మరళూరు ఉన్న ఎస్ఎస్ఐటీ ఆవరణంలో కళాశాల సిబ్బంది మంగళవారం స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల్లో విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.ఎస్. రవి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సముదాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- రామలింగారెడ్డిని ఉప ముఖ్యమంత్రి చేయాలి

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానున్న నేపథ్యంలో రెడ్డి సముదాయానికి చెందిన ఎమ్మెల్యేలకు ప్రభుత్వ ఏర్పాటులో ప్రాధాన్యత కల్పించాలని రెడ్డి సముదాయ గురువు శ్రీ వేమనానంద స్వామీజీ అన్నారు. మంగళవారం నగరంలోని కోరమంగలలో ఉన్న మహా యోగి వేమన విద్యా సంస్థల ఆవరణంలో కర్ణాటక రెడ్డి సముదాయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ... బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలో సుమారు 12 మందికిపైగా రెడ్డి సముదాయానికి చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు ఎన్నికయ్యారని, వారికి ప్రభుత్వ ఏర్పాటులో ప్రాధాన్యత ఇవ్వాలని స్వామీజీ అన్నారు. గతంలో మాజీ సీఎం యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెడ్డి సముదాయానికి చెందిన ముగ్గురికి మంత్రి పదవి ఇచ్చారని, బసవరాజ బొమ్మై హయాంలో రెడ్లకు



మాట్లాడుతున్న వేమనానంద స్వామీజీ

అవకాశం కల్పించలేని, ప్రస్తుతం కాంగ్రెస్‌లో అత్యంత సీనియర్ నాయకుడు, 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రామలింగారెడ్డికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి జనసంఘం అధ్యక్షుడు జయరామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటశివారెడ్డి, కార్యదర్శి సదాశివరెడ్డి, కృష్ణారెడ్డి, కోశాధికారి చంద్రారెడ్డితో పాటు పలువురు రెడ్డి సముదాయం సభ్యులు పాల్గొన్నారు.

### సతీష్‌రెడ్డికి సన్మానం



బొమ్మనహళ్లి: శాసనసభ ఎన్నికల్లో 4వ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డిని మంగళవారం స్థానిక బీజేపీ కార్యకర్తలు భారీ గజమాలతో సన్మానించారు. మాజీ డిప్యూటీ మేయర్ డామ్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో సతీశ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

### కేరళ స్టోరీ ఉచిత ప్రదర్శన

యశవంతపుర: ది కేరళ స్టోరీ సినిమాను వీక్షించడానికి విజయపుర ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ విజయపుర నగరంలోని థియేటర్‌లో ఉచిత ప్రదర్శన ఏర్పాటు చేయించారు. మంగళ, బుధ, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల షోను ప్రజలు ఉచితంగా చూడవచ్చని చెప్పారు. సినిమాను వీక్షించి మూకాంబికా దేవిని దర్శించుకోవాలని అన్నారు.

### డీకేశి సీఎం కావాలని పూజలు



మొక్కులు తీర్చుకుంటున్న అభిమానులు

దొడ్డబళ్లాపురం: కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ రామనగర జిల్లాలో ఆయన అభిమానులు అనేక చోట్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. చెన్నపట్టణ తాలూకాలో యువ కాంగ్రెస్ నేత మల్లేశ్ ఆధ్వర్యంలో ధర్మస్థలం వెళ్లిన వందల సంఖ్యలో అభిమానులు పూజలు చేయించారు. రామనగరలో డీకేశి అభిమానులు నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. విశేషం ఏమిటంటే జేడీఎస్‌కు చెందిన పలువురు వక్కలిగ సామాజికవర్గం నాయకులు పార్టీలకు అతీతంగా డీకే శివకుమార్ సీఎం కావాలని కోరుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. హారోహళ్లిలో కూడా డీకే అభిమానులు శనేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీకే అభిమానులు రాష్ట్రంలో 135 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడానికి ముఖ్య కారణం డీకే పడ్డ శ్రమ అన్నారు. ముఖ్యమంత్రి అయ్యే అన్ని అర్హతలు ఆయనకే ఉన్నాయన్నారు.

### గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



ఆనందకుమార్ (ఫైల్)

యశవంతపుర: బెంగళూరు హలసూరు గేట్ ట్రాఫిక్ ఏఎస్ఐ ఆనందకుమార్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రాత్రి నాగరబావిలోని తన ఇంటికి వచ్చారు. భోజనం చేసిన పడుకున్నారు. మరుసటి రోజు ఎంతసేపటికి లేవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### హామీలే కాంగ్రెస్‌ను గెలిపించాయి

దొడ్డబళ్లాపురం: ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ కార్డ్ వల్లే ఆ పార్టీ గెలిచిందని మాజీ మంత్రి, బీజేపీ నేత కట్టా సుబ్రమణ్య నాయుడు అన్నారు. మంగళవారం దొడ్డలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి మహిళకు నెలకు రూ.2వేలు నగదు, 10 కేజీల బియ్యం,ఉచిత సిలిండర్ లాంటి పథకాలు ప్రజలకు తీవ్రంగా ప్రభావితం చేసాయన్నారు. బీజేపీని తిరస్కరించడానికి కారణాలు తెలుసుకుని తప్పులు దిద్దుకుంటామన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీయే గెలుస్తుందన్నారు.

- ఎండ నుంచి ఊరట ఇలా



ఎండకాలం నుంచి ఉపశమనం కోసం, అలాగే సెలవుల్లో ఈత నేర్చుకోవడానికి బాలలు ఈత కొలనుకు వచ్చారు. బెంగళూరు జయనగరలోని ఒక స్విమ్మింగ్‌పూల్ కిటకిటలాడిన దృశ్యం



వేసవి ఎండలు అందరికీ చెమటలు పట్టిస్తున్నాయి. ఉదయం నుంచే ఎండ వేడిమి మనుషులనే కాదు పశుపక్ష్యాదులనూ అల్లాడిస్తోంది. మంగళవారం బెంగళూరు కంఠీరవ మైదానంలో నీళ్లు చల్లుతుండగా, జలకాలాడుతున్న కాకులు

### హామీలను వెంటనే అమలు చేయాలి

మైసూరు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కేంద్రమంత్రి శోభా కరందాజ్లె డిమాండ్ చేశారు. మంగళవారం మైసూరు నగరంలోని చాముండికొండకు వచ్చిన కేంద్ర మంత్రి నాడిన శక్తిదేవత చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు కీలకంగా వ్యవహరించాలన్నారు.

### ఆత్మహత్యాయత్నం చేసిన అభిమాని మృతి

మైసూరు: శాసనసభ ఎన్నికల్లో కేఆర్ నగరలో జేడీఎస్ అభ్యర్థి సా.రా. మహేష్ ఓడిపోగా, ఆయన వీరాభిమాని, దమ్మనహళ్ళి గ్రామానికి చెందిన వెంకటేష్ (26) బావిలో దూకాడు. 13వ తేదీ నుంచి రెండు రోజుల నుంచి ఇంటి వద్ద ఆహారం తీసుకోకుండా ఎవరితో కలవకుండా దిగులుగా ఉండేవాడు. చనిపోవాలని బావిలోకి దూకగా స్థానికులు చూసి అతన్ని కాపాడి కేఆర్ నగర ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక అతడు మంగళవారం చనిపోయాడు. సాలిగ్రామ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

# నా ఓటమిలో జేడీఎస్ పాత్ర



మాట్లాడుతున్న సుధాకర్

చిక్కబళ్లాపురం: తన ఓటమికి జేడీఎస్ పార్టీ కారణమని బీజేపీ నేత, మాజీ మంత్రి సుధాకర్ ఆరోపించారు. మంగళవారం ఆయన తన నివాసంలో నాయకులు, కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... కుట్రతో జేడీఎస్ ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించి తనను ఓడించారని, జేడీఎస్ అభ్యర్థి కేపీ బచ్చేగౌడ తండ్రి పిళ్లప్ప ఆత్మ శాంతించదని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు మహిళా కార్యకర్తలు కన్నీరు పెట్టారు. తాను ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటానని, భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ నాగరాజు, కేవీ నవీన్‌కిరణ్ నగరసభ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, బాబు మాజీ జెడ్పీ అధ్యక్షుడు కేశవరెడ్డి, రామస్వామి మరళుకుంటె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టైరు పేలి ప్రైవేటు బస్సుకు ప్రమాదం



గుంతలో పడిన బస్సు

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

పావగడ: తుమకూరు జిల్లా అరసికెర పోలీస్ స్టేషన్ పరిధిలోని బెళ్ళబట్టలు గ్రామం రహదారిలో మంగళవారం ఉదయం ప్రైవేటు బస్సుకు ప్రమాదం జరిగింది. ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. చిత్రదుర్గం నుంచి తుమకూరుకు వెళ్లే ఓ ప్రైవేట్ బస్సు ముందరి చక్రం పేలిపోవడంతో డ్రైవర్ అదుపుతప్పాడు. బస్సు రోడ్డు పక్కన ఉండే కరెంటు స్తంభాన్ని ఢీకొని అక్కడే ఓ గుంతలోకి పడి పోయింది. దీంతో బస్సు ముందరి భాగం నుజ్జు నుజ్జయింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రాణాపాయం సంభవించ లేదు. స్వల్ప గాయాల పాలైన పలువురు ప్రయాణికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. అరసికెర పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

# అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు

గౌరిబిదనూరు: నియోజక వర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తానని స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచిన కెహెచ్ పుట్టస్వామిగౌడ తెలిపారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సౌలభ్యాలు అందేలా చూస్తానని, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలను అనవసరంగా తిప్పుకోకూడదని, ఈ విషయంపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. నియోజక వర్గంలో పరిశ్రమలు, విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తానన్నారు. తాలూకాలో అవినీతి పెచ్చు పెరిగింది, దానిని నియంత్రించడానికి కఠిన చర్యలు చేబడతానన్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతిరెడ్డి మాట్లాడుతూ... నియోజక వర్గంలో రెండు దశాబ్దాలుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీ అధ్యక్షుడు హోసూరు మంజునాథ్, జీకే సతీశ్, కాంతరాజు, రాఘవేంద్ర హనుమాన్, లక్ష్మణరావ్, అనంతరాజు, శ్రీనివాసగౌడ, నాగార్జున, ఢిల్లీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

### మోసగాడు అరెస్ట్

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ పోర్టల్‌లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని ఆదాయ పన్ను చెల్లింపులో కోట్లల్లో మోసం చేసిన వ్యక్తిని సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం పోలీసులు అరెస్టు చేసారు. హాసన్ జిల్లా హిరిసావెకు చెందిన దిలీప్ పట్టుబడ్డ నిందితుడు. ప్రభుత్వ పోర్టల్లో లోపాలను దిలీప్ ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నుండి పన్ను చెల్లింపుదారులకు చేరాల్సిన పెద్ద మొత్తంలో డబ్బును చెల్లింపుదారుల బ్యాంక్ అక్కౌంట్ వివరాలను తెలుసుకుని నకిలీ ఖాతాలు తెరచి డబ్బును మళ్లించేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీసీబీ సైబర్ క్రైం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసారు.

### రాజకీయాలకు రమనాథ్‌రై గుడ్‌బై

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళకు చెందిన మాజీ మంత్రి రామనాథ్‌రై రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. మంగళవారం ఆయన మంగళూరులో విలేకర్లతో మాట్లాడారు. దక్షిణ కన్నడ జిల్లాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. గెలిచిన వారికి అభినందనలు, ప్రజలు విశ్వాసంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారు. జిల్లాలో ఓడినా తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయిన పార్టీకి అన్ని విధాలుగా సహకరిస్తాన్నారు.

# శ్రమకు డీకేశి ఫలితం కోరుతున్నారు

శివాజీనగర: కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ తన శ్రమకు ఫలితం ఇవ్వాలని కోరుతున్నారని ఎంపీ డీకే.సురేశ్ తెలిపారు. మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ...డీకే.శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది తన కోరిక అని, క్లిష్ట పరిస్థితుల్లో సోనియాగాంధీ తమపై విశ్వాసముంచి బాధ్యతలను అప్పగించారు. ఆ బాధ్యతలను డీకే.శివకుమార్ విజయవంతంగా నెరవేర్చారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 135 స్థానాలను గెలిపించి ఇచ్చారన్నారు. వేధింపులు, అవమానాలు, దూషణలను సహించుకొని, అన్నిటిని సవాళ్లతో ధైర్యంతో ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఈ శ్రమకు ఫలితం ఇవ్వాలని డీకేశి కోరుతున్నారని, నిర్ణయం తీసుకోవాల్సింది అధిష్టానమని అన్నారు.

## హోసూరు వార్తలు..

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణతో యల్లమ్మదేవి మూలవిరాట్

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం విరుపాక్షి నగర్‌లోని యల్లమ్మదేవి ఆలయంలో 5వ వార్షిక కుంభాభిషేకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి గణపతి హోమం, నవగ్రహ హోమం, గాయత్రీ హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించి మహాకుంభాభిషేకోత్సవం జరిపించారు. బాలగురి యల్లమ్మదేవి ఆలయ కమిటీచే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కెలమంగలం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వేడుకలో పాల్గొన్నారు.

### యల్లమ్మదేవి జాతర



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా ఉళియాలం గ్రామంలో వెలసిన గ్రామదేవత యల్లమ్మదేవి ఆలయంలో ప్రతి సంవత్సరం ఊరు పండుగ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గత రెండురోజులుగా అమ్మవారికి విశేషంగా అభిషేకం, ఆరాధన, అలంకరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. హోసూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి గ్రామదేవతల ఉత్సవమూర్తులను తీసుకెళ్లి ఊరేగింపు నిర్వహించారు. ఉళియాలం, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు.

### ఇద్దరిపై కత్తితో పోకిరీ దాడి

కెలమంగలం: మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదంటూ వ్యాపారితో పాటు ఇద్దరిపై కత్తితో దాడి చేసిన పోకిరీని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. డెంకణీకోటకు చెందిన యల్లప్ప అదే ప్రాంతంలో కాయగూరల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అబ్జల్ బాషా (22) అనే యువకుడు సోమవారం యల్లప్ప వద్దకెళ్లి మద్యం తాగేందుకు డబ్బులడిగాడు. నేనెందుకు ఇవ్వాలని యల్లప్ప చెప్పడంతో అబ్జల్ బాషా కోపావేశంతో కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన నందకుమార్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని అబ్జల్ బాషాను అరెస్ట్ చేశారు.

# కనీస వసతులు లేని గ్రామం



సిద్దాండపల్లి పల్లం గ్రామానికెళ్లే మట్టి రోడ్డు



గ్రామంలో ధ్వంసమైన నీటి ట్యాంక్

క్రిష్ణగిరి: గత 40 ఏళ్లగా గ్రామంలో మౌలిక వసతులను కల్పించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని సూళగిరి తాలూకా సిద్దాండపల్లిపల్లం గ్రామస్థులు ఆవేదన చెందారు. సిద్దాండపల్లిపల్లం గ్రామంలో 20కి పైగా కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి రోడ్డు, పక్కా ఇళ్లు, నీటి వసతి తదితరాలను కల్పించాలని గ్రామస్థులు గత 40 ఏళ్లగా ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఎన్నికల సమయాల్లో మాత్రమే గ్రామం వైపు వెళ్లి గ్రామస్థులకు ఉచిత సలహాలు, హామీలు ఇచ్చి వెళుతున్నారని, నేటికి తమ గ్రామానికి రోడ్డు వసతులు కల్పించలేదని తెలిపారు. గతంలో తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు కూడా పాడైపోయిందని చెప్పారు. పొలాల్లోని బోరుబావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికార్లు, ప్రజా ప్రతినిధులు తమ గ్రామంలో వసతులు కల్పించాలని కోరారు.

# మేయర్ ఆకస్మిక తనిఖీలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో మంగళవారం ఉదయం మేయర్ ఎస్.ఏ.సత్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని 23, 24వ వార్డులు రామ్‌నగర్, పాత ఏఎస్‌టిసి హడ్కో తదితర ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ప్రధానంగా రోడ్ల వసతి, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక సౌకర్యాలపై సంబంధిత శాఖాధికార్ల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్, ఎన్.ఎస్.మాదేశ్వరన్, మంజమ్మగిరి, మోసిన్ తాజ్, దేవిమాదేష్, శ్రీధర్, సురేష్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



పర్యటిస్తున్న మేయర్ సత్య తదితరులు

### రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



గుంతలమయమైన రోడ్డు

క్రిష్ణగిరి: సూళగిరి నుంచి మైగదాండపల్లి మీదుగా వేపనపల్లికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. తాలూకా కేంద్రం సూళగిరి నుంచి మారండపల్లి, మైదానండపల్లి, మీదుగా సింపల్‌త్రాడి గ్రామం వరకు సుమారు ఏడు కిలోమీటర్లు తారురోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిపోయిందని, ఈ రహదారిపై వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

### విద్యార్థులకు వేసవి శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్‌జేకప్

హోసూరు: క్రిష్ణగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో పిల్లలకు వేసవి శిక్షణను కలెక్టర్ దీపక్ జేకప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో విద్యార్థినీ విద్యార్థుల్లో ప్రతిభను పెంచే ఉద్దేశంతో వేసవి శిక్షణ ప్రారంభించారని, 26వ తేదీ వరకు కొనసాగే ఈ శిక్షణల్లో విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని, కళలు, చేతి నైపుణ్యాలు, మట్టిబొమ్మల తయారీ, చారిత్రక ఆధారాలు, సంగీతం, నాట్యం తదితర కళలపై పిల్లలకు చైతన్యం కల్పించనున్నారని, ముగింపు రోజు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారిణి మహేశ్వరి, అధికారులు మణిమేగలై, మహేంద్రన్, సర్దార్, గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### టీడీపీ సీనియర్ నేత ఏవీపై భూమా అఖిల వర్గం దాడి

ఏవీ సుబ్బారెడ్డికి గాయాలు



గాయాల పాలైన ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల: నంద్యాల నియోజక వర్గంలో టీడీపీకి చెందిన మాజీ మంత్రి భూమ అఖిలప్రియ అనుచరులు అదే పార్టీకి చెందిన సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కిందపడిన ఆయనపై పిడిగుద్దులు కురిపించారు. మంగళవారం టీడీపీ నాయకుడు లోకేశ్ పాదయాత్ర సందర్భంగా నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో జరిగిన ఈ ఘటనలో సుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. ఆయన ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

### టీడీపీ మినీ మహానాడులో బాహాబాహీ

అన్నమయ్య జిల్లా కేంద్రంలో రసాభాసగా ఎన్టీఆర్ శత జయంతి



సౌండ్ సిస్టమ్ ఆగిపోవడంతో ఆపరేటర్‌తో గొడవపడుతున్న మండిపల్లె అనుచరులు

రాయచోటి టౌన్: ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మంగళవారం నిర్వహించిన మినీ మహానాడులో టీడీపీ నాయకుల అనుచరులు బాహాబాహీకి దిగారు. సభ ప్రారంభం నుంచే రమేష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌బాబు వర్గాలు ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ తోపులాటకు దిగాయి. ఫర్నిచర్ ధ్వంసం చేశాయి. మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో మైక్ మూగపోవడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్‌లు ఆగిపోయాయి. దీంతో రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు సౌండ్ సిస్టమ్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవ పెద్దది కాకుండా సముదాయించారు. ఇంతలో రాంప్రసాద్‌రెడ్డి వేదిక పైనుంచి రండిరా పోదాం రండి అంటూ కిందకు దిగి వెళ్లిపోయారు. మిగతా నాయకులు ఆయన్ని వారించే ప్రయత్నం చేయలేదు.

# ఉదయం నుంచే భగభగ

## తీవ్రమైన ఎండలతో జనం ఉక్కిరి బిక్కిరి



విజయవాడలో నిర్మానుష్యంగా జాతీయ రహదారి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం 6 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం 9 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు, మరో 10 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. మిగిలిన జిల్లాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటింది. 13 మండలాల్లో 46 డిగ్రీలు, 39 మండలాల్లో 45 డిగ్రీలు, 255 మండలాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 148 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా మద్దిపాడులో 46.7 శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ కోరారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణిలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రయాణాల్లో ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**నేడు 20 మండలాల్లో వడగాడ్పులు**

బుధవారం 20 మండలాల్లో వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనకాపల్లి జిల్లాలో 2 మండలాలు, గుంటూరు జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో ఒకటి, ఎన్టీఆర్ జిల్లాలో 3, పల్నాడులో 3, వైఎస్సార్ జిల్లాలో 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

**జిల్లాల వారీగా మంగళవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రదేశాలు**

| జిల్లా | మండలం | ప్రదేశం | నమోదైన ఉష్ణోగ్రత |
|---|---|---|---|
| తూర్పుగోదావరి | రాజమహేంద్రవరం | ధవళేశ్వరం | 46.8 |
| ప్రకాశం | మద్దిపాడు | గుండ్లపల్లె | 46.7 |
| శ్రీకాకుళం | కొత్తూరు | కొత్తూరు | 46.5 |
| బాపట్ల | అమృతలూరు | అమృతలూరు | 46.4 |
| అంబేద్కర్ కోనసీమ | మండపేట | మండపేట | 46.3 |
| గుంటూరు | తాడికొండ | తాడికొండ | 46.3 |
| కాకినాడ | శంఖవరం | సీతంపేట | 46.2 |
| కృష్ణా | కోడూరు | కోడూరు | 46.2 |
| ఏలూరు | ఆగిరిపల్లి | ఈదులగూడెం | 46.0 |
| ఎన్టీఆర్ | విస్సన్నపేట | పుట్రేల | 45.9 |
| నెల్లూరు | వరికుంటపాడు | పెద్దిరెడ్డిపల్లె | 45.9 |
| పల్నాడు | మాచర్ల | విజయపురి సౌత్ | 45.8 |
| పార్వతీపురం మన్యం | కురుపాం | కురుపాం | 45.4 |
| తిరుపతి | సత్యవేడు | సత్యవేడు | 45.4 |
| నంద్యాల | పాములపాడు | పాములపాడు | 45.2 |
| విజయనగరం | రేగిడిఆమదాలవలస | గొల్లపాడు | 45.1 |
| పశ్చిమగోదావరి | తణుకు | తణుకు | 45.1 |
| అల్లూరి సీతారామరాజు | గంగవరం | నువ్వుమామిడి | 45.0 |
| అనకాపల్లి | మాడుగుల | మాడుగుల | 45.0 |

## మన బడి నాడు-నేడు రెండో దశ వేగం పెంచండి

- డీఈవోలు, ఏపీసీలకు స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: మన బడి నాడు – నేడు రెండో దశ పనులు పూర్తి స్థాయిలో చేయాలని, ఎక్కడా అసంపూర్తిగా ఉండకూడదని జిల్లా విద్యా శాఖాధికారులు (డీఈవోలు), అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు (ఏపీసీ)కు స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటంనేని భాస్కర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రెండో దశలో నాడు – నేడు కింద 22,344 పాఠశాలలు, విద్యా సంస్థల్లో రూ.8,000 కోట్లతో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని, అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం మినహా మిగతా అన్ని పనులు జూన్ 12వ తేదీ నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత పనులు అసంపూర్తిగా జరిగాయని, పరికరాలు, సదుపాయాల కల్పన పూర్తిస్థాయిలో లేవనే మాటలు వినిపించకూడదని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో మాట్లాడి రెండో దశ పనులు సకాలంలో వేగంగా పూర్తి చేయడానికి డీఈవోలు, ఏపీసీలు నాయకత్వం వహించాలని సూచించారు. ఈ దశ పనుల్లో కిచెన్ షెడ్ నిర్మాణం, వంట గదుల మరమ్మతులు ముఖ్యమైనవని, వాటిని వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

# పేదలపై బాబుది అణచివేత ధోరణి

- అమరావతిలో 50,004 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తాం
- బాబు రూపొందించిన సీఆర్డీఏ చట్ట ప్రకారమే భూమి కేటాయింపు
- వారు చేసిన చట్టాన్నే అమలుచేస్తుంటే అడ్డుకోవడం ఏం న్యాయం
- మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్



కృష్ణాయపాలెంలో లే అవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేశ్ తదితరులు

సాక్షి, అమరావతి/మంగళగిరి: రాష్ట్రంలోని జగనన్న ప్రభుత్వం నిరుపేదల మేలు కోరుకుంటే.. చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు ఆ పేదలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ మండిపడ్డారు. దేశ చరిత్రలో ఇంత నీచమైన రాజకీయాలు చేసేవారు చంద్రబాబు తప్ప మరొకరు ఉండరన్నారు. అమరావతిలోని నవులూరులో వేసిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' లేఅవుట్‌ను మంగళవారం మంత్రి రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్‌తో కలిసి పరిశీలించారు. సీఆర్డీఏ పరిధిలో 1,402 ఎకరాల్లో 50,004 కుటుంబాలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు 25 లేఅవుట్లను సిద్ధంచేస్తున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, ఇప్పటికే అప్రోచ్ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేసినట్లు తెలిపారు. వీటి పట్టాలను త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన వేదిక ఏర్పాటుకు ప్రాంతాన్ని పరిశీలించారు. మంత్రి సురేశ్ మాట్లాడుతూ.. సొంతిల్లు లేనివారి కలను సీఎం జగన్ నిజం చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక న్యాయస్థానాల ద్వారా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. అమరావతి ప్రాంతం అందరిదీ అని ఉన్నత న్యాయస్థానం చెప్పినా రైతుల ముసుగులో టీడీపీ నేతలు ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. నిజానికి.. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేసిన సీఆర్డీఏ చట్టం–2014 ప్రకారమే తాము నిరుపేదలకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించామని ఆయన చెప్పారు. అప్పట్లో సేకరించిన మొత్తం భూమిలో ఐదుశాతం పేదల ఇళ్ల కోసం కేటాయించవచ్చని నిబంధన పెట్టారని, దాని ప్రకారమే ఇప్పుడు సీఎం స్థలాలు కేటాయించారన్నారు.

**అస్మదీయులకు లబ్ధిచేకూర్చేందుకే..**

అయితే, తన అస్మదీయులకు లబ్ధిచేకూర్చేందుకు చంద్రబాబు తాను చేసిన చట్టాన్నే ఉల్లంఘిస్తూ అమరావతిలో నిరుపేదలకు చోటులేకుండా చేయడానికి కుయుక్తులు పన్నుతున్నారని మంత్రి సురేశ్ మండిపడ్డారు. ఇంతటి క్రూరమైన మనస్తత్వం చంద్రబాబుకు తప్ప మరొకరికి ఉండదన్నారు. ఆయన తీరును దళితులుగాని, అంబేద్కర్ వాదులుగాని హర్షించరన్నారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## లోకేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- శ్రీశైలంలో 220 గదుల వసతి సముదాయం 30న సీఎంచే ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ చెప్పారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ అంటే సంక్షేమమని, సంక్షేమం అంటేనే సీఎం జగన్ అని అన్నారు. వైఎస్ జగన్ పాదయాత్రలో ప్రజల అవసరాలు తెలుసుకుని ఇచ్చిన హామీలే కాకుండా చెప్పని హామీలను కూడా నెరవేర్చారని తెలిపారు. లోకేశ్ నోరు అదుపులో పెట్టుకొని పాదయాత్ర చేయాలని హెచ్చరించారు. జయంతికి, వర్ధంతికి తేడా తెలియని లోకేశ్ ఆయనది అంబేద్కరిజం అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అన్ని సామాజికవర్గాలకు కార్పొరేషన్లు, మంత్రి వర్గంలో పదవులిచ్చిన మహోన్నత వ్యక్తి సీఎం జగన్‌ది అంబేద్కరిజం అని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై లోకేశ్ నిరాధారమైన ఆరోపణలు చేసి అభాసు పాలయ్యారని చెప్పారు. శ్రీశైలంలో భక్తుల కోసం 220 గదులతో నిర్మించిన వసతి సముదాయాన్ని ఈ నెల 30న సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నట్లు చెప్పారు.

# ప్రభుత్వ ప్రతిష్టకు ఆస్పత్రులు వన్నెతేవాలి

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్యరంగం పరంగా రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న మొత్తానికి అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు బాగుండాలని సీఎం జగన్ ఆశిస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆమె మంగళవారం మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలోకి అడుగుపెట్టగానే రోగికి తాను పొందబోయే సౌకర్యాల గురించిన నాలుగైదు ప్రాధాన్యాంశాల పోస్టర్లను ప్రతి ఆస్పత్రిలో ప్రదర్శించాలని సూచించారు. రోగి ఆస్పత్రిలో వైద్యం పొందాక డిశ్చార్జి అయినప్పుడు సంతోషంతో ఇంటికి వెళ్లాలని, సేవల పట్ల సంతృప్తి వ్యక్తపరచాలని చెప్పారు. ముఖ్యంగా పారిశుధ్యం విషయంలో చాలా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్యం, పరిపాలన, ఆస్పత్రుల నిర్వహణ, రోగులకు బలవర్ధకమైన ఆహారం పంపిణీ ఇవన్నీ సరిగా అమలవుతున్నదీ లేనిదీ అధికారులు తరచూ చూడాలని చెప్పారు. తనిఖీల్లో అవకతవకలు వెలుగు చూస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆస్పత్రిలో మాతాశిశు సంరక్షణ వార్డుల్లో పింక్ కలర్ కర్టెన్లు ఏర్పాటు చేసి, పాలిచ్చే తల్లులకు తగినంత మరుగు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మహిళా వార్డుల వద్ద క్లోజ్డ్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రుల పనితీరుపై కేటాయించే మార్కుల విషయంలో పారదర్శకత ఉండాలని, పనితీరు అన్నివిధాలా బాగున్నప్పుడే మార్కులు ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ నిధులతో, సీఎస్ఆర్ సహకారాన్ని తీసుకుని, 16 బోధనాస్పత్రుల్లో ఇన్సినిరేటర్స్ ఏర్పాటు చేసి, వ్యర్థాల ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. రోగులకు బలవర్ధక ఆహారాన్ని అందించాలన్న లక్ష్యంతో గతంలో రూ.40గా ఉన్న డైట్‌చార్జీలను రూ.80కి పెంచిన నేపథ్యంలో మెనూలో మార్పు రావాలన్నారు. గిరిజన ప్రాంతాలు, ఒడిశాకు సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాలకు విశాఖ, విజయనగరం ఆస్పత్రుల్లో మహాప్రస్థానం వాహనాలను పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీటీ, ఎమ్మారై యంత్రాలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించాలన్నారు. ఈవెనింగ్ క్లినిక్‌లను బోధనాస్పత్రుల్లో పక్కాగా అమలు చేయాలని చెప్పారు. ఉదయం ఓపీలకు హాజరైన రోగుల వైద్యపరీక్షల ఫలితాల పరిశీలన, ఇతర సేవలను ఈవెనింగ్ క్లినిక్‌లలో అందించాలని ఆమె సూచించారు. డీఎంఈ డాక్టర్ నరసింహం పాల్గొన్నారు.

# ఏపీలో వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్

విజయవాడ సహా 35 రైల్వే స్టేషన్లలో ఏర్పాటు



విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో రైల్వే మంత్రిత్వశాఖ వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 35 రైల్వే స్టేషన్లలో 37 వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రాష్ట్రంలో విజయవాడ స్టేషన్‌తో పాటుగా నెల్లూరు, రాజమండ్రి, ఏలూరు, ఒంగోలు, గుడివాడ తదితర ప్రధాన స్టేషన్లలో ఏర్పాటు చేసిన అవుట్‌లెట్ స్టాల్స్ ద్వారా స్థానిక చేతి వృత్తుల వారి జీవనోపాధి, సంక్షేమానికి ప్రధాన ప్రోత్సాహం కల్పించారు. సంప్రదాయ కలంకారి చీరలు, జనపనార ఉత్పత్తులు, అనుకరణ ఆభరణాలు, చెక్క హస్తకళలు, గిరిజన ఉత్పత్తులు, ఊరగాయలు, మసాలా పొడులు, అప్పడాలు వంటి స్థానిక వంటకాలు, షెల్ పెయింటింగ్స్, రైస్ ఆర్ట్స్ తదితర ఉత్పత్తులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రైల్వే స్టేషన్లు అనుకూలమైన స్థలమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

# చిల్ అవుదాం.. పద!



- వేసవి విడిదికి సై అంటున్న భారతీయులు
- దేశీయంగా కశ్మీర్ వెళ్లేందుకు ఆసక్తి
- మాల్దీవులు, మారిషస్ వంటి ద్వీపాలకు పయనం
- అంతర్జాతీయంగా యూరప్‌కు మొగ్గు
- తాజాగా 'ఇండియా హాలిడే రిపోర్ట్–మే 2023' వెల్లడి

సాక్షి, అమరావతి: ఎండలు సెగ పుట్టిస్తున్నాయి. ఫ్యాన్ కింద కూర్చున్నా ఉక్కపోతే. ఏసీ వేసుకుంటే కొంతసేపే చల్లదనం. పగలంతా ఇదే తీరు. సాయంత్రం సరదాగా నాలుగడుగులు బయటకు వేద్దామంటే భగ్గుమనే వేడిగాలులు... ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి దగ్గర వేసవి సెలవుల్ని ఏం ఎంజాయ్ చేస్తామంటూ.. సుదీర్ఘ ప్రయాణాలకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం వేసవి ట్రిప్‌లను చూస్తే కరోనా మునుపటి స్థితిని అధిగమించేలా కనిపిస్తున్నాయని ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ సంస్థ థామస్ కుక్ (ఇండియా), ఎస్ఓటీసీ ట్రావెల్ విడుదల చేసిన 'ఇండియా హాలిడే రిపోర్ట్–మే 2023' వెల్లడించింది. పర్యాటకుల ప్రయాణాలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో ఎక్కువ ఖర్చుపెట్టి విదేశాలకు కూడా వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. మెజార్టీ ప్రజలు సులభంగా ప్రయాణ వీసాలు పొందే దేశాలకే మొగ్గు చూపుతున్నారు. భారతీయులకు అత్యంత ఇష్టమైన విదేశీ వేసవి విడిది ప్రాంతంగా యూరప్ అగ్రస్థానంలో నిలుస్తోంది. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ దేశాలు ప్రాధాన్య గమ్యస్థానాలుగా ఎక్కువ ట్రావెల్ బుకింగ్‌లు చేస్తున్నారు. సుదూర ప్రయాణాలకు సమయం వెచ్చించలేని పర్యాటకులు థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, దుబాయ్, అబుదాబి, ఒమన్‌తో పాటు మాల్దీవులు, మారిషస్ వంటి ద్వీపాల్లో సేద తీరేందుకు రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. కొత్తగా జపాన్, దక్షిణ కొరియా పర్యటనలపై కూడా ఆసక్తి పెరిగినట్టు సర్వే నివేదిక చెబుతోంది. విచిత్రంగా అమెరికా కంటే ట్రావెల్ బుకింగ్‌లలో 20 శాతం అధికంగా ఆస్ట్రేలియాకు ఉంటున్నాయి. వీసాలు పొందడంలో ఇబ్బందుల ఫలితంగా అమెరికాకు ట్రావెల్ బుకింగ్‌లలో తగ్గుదల కనిపిస్తోంది.

**చల్లని కాశ్మీరానికి ఛలో!**

దేశీయంగా వేసవి పర్యటనలకు అనుకూలమైన గమ్యస్థానంగా కశ్మీర్‌కు మద్దతు లభిస్తోంది. ఆ తర్వాత హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్, ఈశాన్య ప్రాంతాలు, కేరళ, అండమాన్, గోవాతో పాటు భూటాన్‌కు వెళ్లేందుకు లగేజీలు సర్దేస్తున్నారు. సర్వేలో మెట్రో, మినీ మెట్రో నగరాలు పుణే, చండీగఢ్, కోయంబత్తూర్, టైర్ 2, 3 సిటీలైన జైపూర్, ఇండోర్, తిరుచిరాపల్లి, మధురై, నాగ్‌పూర్, సూరత్, బరోడా, భువనేశ్వర్, లక్నో, మైసూర్, విశాఖపట్నం, గౌహతి, పాట్నాలో ఆన్‌లైన్ ద్వారా సర్వే చేశారు. ఇందులో 40 శాతం మంది దేశీయంగా, 60 శాతం మంది విదేశాల్లో పర్యటించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు వెల్లడైంది.

# అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

▶ మొదటి పేజీ తరువాయి

బయటపడుతున్నాయి. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణతో భూ దోపిడీ మొత్తం బయటపడుతోంది.

**కమిటీలో సింగపూర్ కంపెనీ ప్రతినిధి**

2014 జూన్‌లో అధికారం చేపట్టగానే రాజధాని పేరిట చంద్రబాబు భారీ భూదోపిడీకి పన్నాగాన్ని రూపొందించారు. 2015 జూలైలో రాజధాని సలహా కమిటీని నియమించి పొంగూరు నారాయణ, సుజనా చౌదరి, గల్లా జయదేవ్‌తోపాటు సింగపూర్ కంపెనీ ప్రతినిధికి స్థానం కల్పించడం గమనార్హం. అంతర్జాతీయ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్తున్నందున విదేశీ కంపెనీ ప్రతినిధిని సభ్యుడిగా నియమించడంపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభ్యంతరం తెలిపినా చంద్రబాబు పట్టించుకోలేదు. సింగపూర్ కంపెనీకి రాజధాని ప్రాంత ఎంపిక బాధ్యతను అప్పగించడం ద్వారా భారీ భూదోపిడీకి అప్పుడే పథకం వేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనేబిలింగ్ యాక్ట్‌ను కూడా టీడీపీ సర్కారు ఉల్లంఘించింది. ఓపెన్ కాంపిటీషన్ ద్వారా డెవలపర్‌ను ఎంపిక చేయాలన్న నిబంధనను చంద్రబాబు ఖాతరు చేయలేదు.

**కేంద్రం అనుమతి లేదు.. టెండర్లూ లేవు**

2014 నవంబరులో చంద్రబాబు సింగపూర్ పర్యటనలోనే భూదోపిడీకి స్కెచ్ వేశారు. ఆ వెంటనే డిసెంబరులో రాజధాని మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు సింగపూర్ కంపెనీతో చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంవోయూ కుదుర్చుకుంది. విదేశీ కంపెనీతో చేసుకునే ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే కేంద్రం అనుమతి లేకుండానే ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబు బుకాయిస్తూ వచ్చారు. తద్వారా ఇతర కంపెనీలు పోటీకి రాకుండా నిరోధించారు. కానీ సంబంధిత శాఖల నోట్ ఫైల్స్‌లో ఎక్కడా సింగపూర్ ప్రభుత్వం అనే ప్రస్తావనే లేదు. చివరికి చంద్రబాబు ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది సింగపూర్ ప్రభుత్వంతో కాకుండా ఓ ప్రైవేట్ కంపెనీతో కావడం గమనార్హం. ఇక రాజధాని ప్రాంతంలో అత్యంత కీలకమైన సీడ్‌క్యాపిటల్ ఎంపిక కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లానర్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంపిక చేసింది. అందుకోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టలేదు. సింగపూర్‌కే చెందిన కంపెనీలను మాస్టర్ డెవలపర్‌గా ఎంపిక చేయాలని ఎంవోయూలో స్పష్టం చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించే కంపెనీ, సీడ్ క్యాపిటల్ మాస్టర్ డెవలపర్ ఎవరన్నది చంద్రబాబు ముందుగానే నిర్ణయించేశారు.

**2015 జనవరిలోనే అమరావతి మ్యాపులు**

రాజధానిలో కీలకమైన సీడ్‌క్యాపిటల్ ప్రాంతం ఎంపికలో చంద్రబాబు తన పన్నాగాన్ని అమలులోకి తెచ్చారు. విజయవాడ–గుంటూరు–తెనాలి– మంగళగిరి(వీజీటీఎం) పరిధిలోని జోనింగ్ మ్యాపులన్నీ 2015 జనవరిలోనే సింగపూర్ మాస్టర్ డెవలపర్‌కు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ ప్రభుత్వం అప్పగించేసింది. ఆ మ్యాపుల్లో పేర్కొన్న ప్రాంతాల్లోనే రాజధాని, సీడ్ క్యాపిటల్‌ను ఎంపిక చేయాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదికి అభిముఖంగా ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, లింగాయపాలెం గ్రామాల పరిధిలో సీడ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అంటే రాజధాని, సీడ్ క్యాపిటల్ ఏ మండలాలు, గ్రామాల పరిధిలో రానున్నాయో చంద్రబాబు, నారాయణ, వారి బినామీలకు ముందుగానే తెలుసన్నది స్పష్టమైంది. అనంతరం సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను 2015 జూలైలో ప్రభుత్వానికి సమర్పించి కథ ముగించింది.

**పచ్చ ముఠా గుప్పిట్లో సీడ్ క్యాపిటల్**

2015 జనవరిలోనే సీడ్‌క్యాపిటల్ ఎక్కడ రానుందో తెలిసిన చంద్రబాబు, నారాయణ తమ బినామీలను రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో అతి తక్కువ ధరకు భూములను భారీగా కొనుగోలు చేశారు. సీఐడీ దర్యాప్తులో ఈ బినామీ లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. నారాయణ తన బినామీలు, బంధువుల పేరిట 65.50 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటైన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. ఆ విధంగా కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే రీతిలో చంద్రబాబు బినామీలు, సన్నిహితులు సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భారీగా భూములు గుప్పిట పట్టారు. దీనిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలో మరిన్ని బినామీ లావాదేవీలు బహిర్గతం కానున్నాయి.

**స్విస్ ఛాలెంజ్ ముసుగులో 1,691 ఎకరాల దోపిడీ**

తమ దోపిడీకి మార్గం సుగమం చేసేలా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన చట్టానికి చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారం సవరణలు చేసింది. ఓపెన్ కాంపిటీషన్ విధానాన్ని పక్కనపెట్టేసి స్విస్ చాలెంజ్ విధానంలో సీడ్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంది. కౌంటర్ చాలెంజ్‌కు ఇతర కంపెనీలకు అవకాశం లేకుండా చేసి సింగపూర్ కంపెనికి స్విస్ ఛాలెంజ్ కింద ఏకపక్షంగా కట్టబెట్టేసింది. సీడ్ క్యాపిటల్ అంచనా వ్యయం రూ.3,137 కోట్లు కాగా నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం అందులో 25 శాతం అంటే రూ.784 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు బిడ్డింగ్ అర్హత ఉంటుంది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం కనీసం రూ.2 వేల కోట్ల టర్నోవర్ ఉండటాన్ని అర్హతగా నిర్ణయించడం గమనార్హం. తద్వారా ఇతర కంపెనీలు ఏవీ పోటీకి రాకుండా కట్టడి చేసింది. ఇక సీడ్ క్యాపిటల్ కింద 1,691 ఎకరాల్లో నిర్మాణాలను సింగపూర్ కంపెనీకి కాంట్రాక్టు అప్పగించారు. కానీ అందులో సింగపూర్ కంపెనీ నిర్మించేది కేవలం 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని భవనం మాత్రమే. అంటే మిగిలిన భూమి అంతా సింగపూర్ కంపెనీకే అప్పగించేశారు. ఆ ప్రకారం ఆ భూమిని ప్లాట్లు వేసుకుని అమ్ముకునే హక్కు కల్పించారు. సింగపూర్ కంపెనీ ముసుగులో చంద్రబాబు, ఆయన బినామీలు భూములను కాజేసేందుకే ఈ పథకం వేశారు.

**పాపాల్లో పవన్‌కూ భాగం**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు వాటా కల్పించారు. కాజ వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలో పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

**'ఇన్నర్' మెలికలు**

గత సర్కారు పెద్దల ఆదేశాలతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరిగాయి. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజలో ఉన్న భూములను ఆనుకుని ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. సీఆర్డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. కంతేరు, కాజలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్‌కు ఒకచోట 9 ఎకరాలు, మరో చోట నాలుగు ఎకరాలు ఉండటం గమనార్హం.

**అమాంతం పెరిగిన విలువ**

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.



'ఏ వయసులో అయినా సరే ఎవ్వరిపైనా ఆధారపడకూడదు' అని టైలరింగ్ చేస్తూ తన రెక్కల కష్టం మీదే బతుకుతోంది 70 ఏళ్ల లచ్చుమమ్మ. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావు పేట గ్రామంలో ఉండే లచ్చుమమ్మ ఐదు దశాబ్దాలుగా పాత కాలం నాటి రవికల నుంచి నేటి మోడ్రన్ డ్రెస్సుల వరకు తన కుట్టుపనితనంతో మెప్పిస్తోంది.

# లచ్చుమమ్మను చూసి నేర్చుకోవాలె..!

ఆ ఊళ్లో అందరూ 'లచ్చుమమ్మను చూసి నేర్చుకోవాలె' అని అంటుంటారు. ఏడు పదుల వయసులో కూడా లచ్చుమమ్మ ఆధునిక డిజైన్లలో బ్లౌజులు, డ్రెస్సులు కుట్టడం చూసి కాలానికి తగినట్టు పని తనాన్ని మెరుగుపరుచుకుంటుంది అని కూడా అంటుంటారు. యాభై ఏళ్లుగా అలుపెరగకుండా బట్టలు కుడుతూ జీవనం సాగిస్తున్న లచ్చుమమ్మ అసలు పేరు గజవాడి లక్ష్మి. ధర్మారావుపేట గ్రామంలో అందరూ లచ్చుమమ్మ అని పిలుస్తారు. లచ్చుమమ్మకు 14వ ఏట ధర్మరావుపేటకు చెందిన బాలవీరయ్యతో వివాహం జరిగింది. వాళ్లకు ఐదుగురు కూతుళ్లు. ఉన్న ఊళ్లో ఉన్నంతలో చదివించారు. వాళ్లను పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి, అత్తవారిళ్లకు పంపించారు. వాళ్లకు పిల్లలు. లచ్చుమమ్మకు పన్నెండు మంది మనుమలు, మనుమరాళ్లు. వాళ్లు కూడా పెద్దోళ్లయ్యారు. నాటి విషయాల గురించి ప్రస్తావిస్తూ 'ఐదుగురు ఆడపిల్లల్ని పెంచి, పెళ్లిళ్లు చేయడం అంటే సవాలే..' అంటూ తమ కష్టాన్ని వివరిస్తుంది. లచ్చుమమ్మ భర్త బాలవీరయ్య చిన్న చిన్న వ్యాపారాలు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. భర్త కష్టానికి చేదోడుగా ఉంటుందని యాభై ఏళ్ల కిందటే లచ్చుమమ్మ సొంతంగా బట్టలు కుట్టడం మొదలుపెట్టింది. అప్పుడు ఆ ఊళ్లోకి ఇంకా టైలరింగ్ మిషన్లు రాలేదు. దాంతో బట్టలు కత్తిరించి సూదీదారంతోనే కుట్టేది. గ్రామంలో నాటి తరం మహిళలు ధరించే రవికలను బాగా కుడుతుందనే పేరు లచ్చుమమ్మకి. ఆడపిల్లలకు గౌన్లు, లంగా, జాకెట్లు కుట్టడమూ సొంతంగానే నేర్చుకుంది. అందరి ఇళ్లల్లోనూ ఆమె కుట్టిన బట్టలు ఉంటాయి.

**ఆధునిక డిజైన్లు సైతం**

లచ్చుమమ్మ చేతికుట్టు బాగుంటుందని చాలా మంది ఆమె దగ్గరే కుట్టించుకునేవారు. నిన్న మొన్నటి వాళ్లే కాదు, ఈ తరం అమ్మాయిలు కూడా లచ్చుమమ్మ దగ్గరకు వచ్చి బ్లౌజులు కుట్టించుకుంటారు. మొదట్లో సాదా రవిక కుట్టడానికి 30 పైసలు, గుండీల రవిక కుట్టడానికి 50 పైసలు తీసుకునేదట. ఇప్పుడు సాధారణ బ్లౌజ్‌కు రూ. 65, లైనింగ్ బ్లౌజ్‌కు రూ.130 తీసుకుంటుంది. 'అప్పట్లో రోజుకు పది నుంచి ఇరవై దాకా బ్లౌజులు, గౌన్లు కుట్టేదాన్ని. పండుగల సీజన్లో అయితే రాత్రి, పగలు తేడా ఉండేది కాదు. ఇప్పుడు కూడా రోజూ రెండు మూడు బ్లౌజులు కుడతా' అని చెబుతోంది లచ్చుమమ్మ. పదేళ్ల క్రితం భర్త వీరయ్య చనిపోయాడు. ఇప్పుడు లచ్చుమమ్మ ఒక్కత్తే ఉంటుంది. తన పోషణార్థం కుట్టుపనినే నమ్ముకుంది.

ఏళ్లుగా ఆమె దగ్గర రవికలు కుట్టించుకున్న నాటి తరం వాళ్లంతా ఇప్పటికీ లచ్చుమమ్మ దగ్గరికే వస్తుంటారు. వయసు మీద పడి, నెమ్మదిగా కుట్టినా చెప్పిన మాట ప్రకారం కుట్టి ఇస్తుందని నమ్మకం ఎక్కువ. ఏ సమయంలో ఆమె ఇంటికి వెళ్లినా.. కూర్చుని బట్టలు కత్తిరించడమో, లేదంటే మిషన్ మీద కుట్టడమో చేస్తూ కనిపిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

– ఎస్.వేణుగోపాల్ చారి, సాక్షి, కామారెడ్డి

### యాభై ఏళ్లుగా కుడుతున్నా..

పద్నాలుగేళ్ల వయసులో పెళ్లయ్యి ఈ ఇంటికి వచ్చా. ఇద్దరు కూతుళ్లు పుట్టిన తరువాత కుటుంబ అవసరాల కోసం ఏదైనా పని చేయాలనుకున్నా. మా అమ్మ మాకు చిన్నప్పుడు చేతితోనే బట్టలు కుట్టేది. ఇంటి అవసరాలు పెరిగినప్పుడు నేను కూడా బట్టలు కుట్టాలని, చేతికుట్టుతో రవికలు కుట్టడం మొదలుపెట్టాను. ఒక్కొక్కరుగా రావడం మొదలై ఊళ్లో ఉన్న ఆడవాళ్లందరూ రవికలు కుట్టించుకునేవారు. ముప్పైఏళ్ల పాటు చేతి కుట్టుతోనే కుట్టేదాన్ని. కుట్టు మిషన్లు వచ్చిన తరువాత ఓ మిషన్ తీసుకున్నా. కొన్ని రోజుల్లోనే మిషన్ కుట్టు నేర్చుకొని, సొంతంగానే కుట్టడం మొదలుపెట్టిన. పిల్లలు వద్దంటరు కానీ, చేతనైనన్ని రోజులు పనిచేసుకొని బతకాలి. ఎవరి మీదా ఆధారపడవద్దని ఈ పని వదలడం లేదు.

– గజవాడ లక్ష్మి



బట్టలు కత్తిరిస్తున్న లచ్చుమమ్మ

### బ్యూటిప్
## పద్మాల్లాంటి పాదాల కోసం...



చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.



అంజనేయస్వామి ఆబాలగోపాలానికి ప్రియమైన దేవుడు. చిత్రకారులు మారుతిని ప్రపంచ ప్రేక్షకులకు మరింత చేరువ చేయడానికి శ్రమిస్తున్నారు. యానిమేటర్ చారువి అగర్వాల్ అంజనీ పుత్రుణ్ణి రేఖల్లో దింపడంలో పేరు గడించింది. ఆమె యానిమేషన్స్ మన పురాణ పాత్రల్నే కాదు మన సాంస్కృతిక వైభవాన్ని కూడా లోకానికి తెలిసేలా చేస్తున్నాయి. ఒక మహిళా యానిమేటర్‌గా ఆమె ఇంత కృషి చేయడం చాలా విశేషం.

### చిత్రార్చన

# యానిమేషన్ ఆంజనేయ

'హనుమాన్ చాలీసా' పేరుతో 2007లో యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ తీయడంతో చాలామందికి తెలిసింది చారువి అగర్వాల్ పేరు. అంతవరకూ ఆమె పడిన కష్టం, అవమానం అంతా ఇంతా కాదు. కెనడాలో మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ యానిమేషన్ చదువుకుని ఇండియాకు వచ్చిన చారువి అగర్వాల్ 2000 సంవత్సరంలో కెరీర్ మొదలెట్టినప్పుడు అందరూ ఆమెను వింతగా చూడటమే. అప్పటికి సినిమా ఫీల్డులోనే తెర వెనుక విభాగాలలో స్త్రీలు కనిపించేవారు కాదు. ఇక యానిమేషన్‌లో బొత్తిగా వింత. 'నువ్వు అమ్మాయివి. చిన్నపిల్లవి. ఏం చేయగలవు' అని అందరూ అడిగేవారే. కాని చారువి అగర్వాల్ పట్టుదల పట్టింది. సాధించింది.



చారువి అగర్వాల్

**ఢిల్లీ అమ్మాయి**

చారువి అగర్వాల్‌ది ఢిల్లీ. చిన్నప్పటి నుంచి బొమ్మలంటే ఇష్టం. తల్లిదండ్రులు ఆ బొమ్మ లేయడాన్నే చదువుకో అని చెప్పారు. కెనెడా పంపించారు. అక్కణ్ణుంచి ఇక్కడికి వచ్చాక యానిమేషన్‌లో కృషి చేయడానికి ముంబైకి చేరుకుంది. కాని మనకు ఎంత టాలెంట్ ఉన్నా ఇది మగవారి ప్రపంచం... ఇక్కడ స్త్రీలకు అవకాశాలు దక్కడం కష్టం అనిపించింది చారువికి. 'క్లయింట్‌లు కూడా అమ్మాయి అనేసరికి వర్క్ ఇవ్వడానికి వెనక్కు తగ్గేవారు' అని గుర్తు చేసుకుంది చారువి.

**సొంతగా స్టూడియో పెట్టి**

ఇక సొంతగా స్టూడియో పెట్టి అటో ఇటో తేల్చుకుందామని గుర్‌గావ్‌లో 'చారువి డిజైన్ ల్యాబ్స్' పేరుతో యానిమేషన్ స్టూడియో మొదలుపెట్టింది. 'నాకు మన సంస్కృతి, పురాణ పాత్రలు ఇష్టం. వాటినే ప్రేరణగా తీసుకోవాలనుకున్నాను. హనుమాన్ చాలీసా అందరికీ తెలిసిందే. దానికి దృశ్యరూపం ఇస్తూ అదే పేరుతో యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్ తీస్తే ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. నా వర్క్‌కు చాలా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత చాలా యానిమేషన్ ఫిల్మ్స్ చేశాను. అప్పుడు 'ది లెజెండ్ ఆఫ్ హనుమాన్' యానిమేటెడ్ వెబ్ సిరీస్ చేసే అవకాశం వచ్చింది. 2021లో డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అయిన ఈ వెబ్ సిరీస్ దేశవిదేశాల్లో హనుమాన్‌కు అభిమానులను సంపాదించి పెట్టింది' అంది చారువి.



26 వేల గంటలతో చారువి తయారుచేసిన హనుమ

**26 వేల గంటలతో హనుమ**

చారువి యానిమేటర్ మాత్రమే కాదు శిల్పి, కార్టూనిస్టు కూడా. 'క్లేట్రానిక్స్' (కార్టూనింగ్‌ను శిల్పంతో మిళితం చేసి తయారు చేసే బొమ్మలు) ద్వారా మన్మోహన్ సింగ్, వాజ్‌పేయి, లాలూ వంటి నేతల మినియేచర్స్‌ను తయారుచేసి అందరినీ ఆకట్టుకుంది. అంతే కాదు ఒక మాల్‌లో 26 వేల చిరుగంటలను ఉపయోగించి 25 అడుగుల ఎత్తు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 'లిమ్కా రికార్డ్స్'లోకి ఎక్కింది.

**ఇంకా వివక్షే**

'ప్రతి ఏటా యానిమేషన్ చదువుకున్న విద్యార్థుల్లో 70 శాతం మంది అమ్మాయిలే ఉంటున్నారు. కాని వారిలో 30 శాతం మందికే ఉపాధి దొరుకుతోంది. ఇంకా వారిని పనిలోకి తీసుకోవడానికి, పని ఇవ్వడానికి వివక్ష పాటిస్తున్నారు' అంటుంది చారువి. 'కాని నిరాశ పడవద్దు. ఇవాళ సినిమా, డిజిటల్, టివి రంగాల్లో యానిమేషన్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రతిభ చూపితే తప్పక విజయం సాధిస్తారు' అని తెలియ చేస్తోంది ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి.

### సేవాపథం

# దస్రా - సేవా సంస్థలకు సేవ

మార్పు సహజం అంటారు. ఆ మార్పు మనం కనే కలలలోనూ సహజమే. సూటు, బూటు వేసుకొని పెద్ద కార్పొరేట్ కంపెనీలో పెద్ద జీతంతో పనిచేయాలనేది నీరా నుండీ కల. ఆమె కల నెరవేరింది. అయితే, ఆ తరువాతే అసలు కల మొదలైంది. 'ఏ నాన్-ప్రాఫిట్ ఫర్ నాన్-ప్రాఫిట్' అనే నినాదంతో 'దస్రా' అనే స్వచ్ఛంద సంస్థను మొదలు పెట్టి తన కల నెరవేర్చుకుంది. సమస్యలు ఎదుర్కొంటున్న స్వచ్ఛంద సంస్థలకు అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది.



నీరా నుండీ

కెనడాలోని టోరంటోలో పుట్టి పెరిగిన నీరా నుండీ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసింది.

బిజినెస్ సూట్ వేసుకొని పెద్ద జీతం తీసుకోవాలనే ఆమె కల నెరవేరింది. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ 'మోర్గన్ స్టాన్లీ' లో ఉద్యోగం.

అయితే కొంతకాలానికి ఆమెకు 'నా పని ఇది కాదేమో' అనిపించింది. స్వచ్ఛంద సేవారంగంపై మనసు లాగింది. దీనికి కారణం చిన్నప్పుడు పశ్చిమబెంగాల్ గ్రామీణ ప్రాంతాలలో తాను చూసిన పేదరికం. ఆ దృశ్యాలు పదేపదే గుర్తుకు వచ్చేవి.

ప్రాథమిక దశలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఫండింగ్ లేక ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి వాటికి సహాయం అందించాలనే ఉద్దేశంతో తనలాంటి ఆలోచనలే ఉన్న సహ-ఉద్యోగి దేవల్ సంఘవితో కలిసి ముంబై కేంద్రంగా 'దస్రా' (సంస్కృతంలో దస్రా అంటే వెలుగు ఇవ్వడం అని అర్థం) అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

ఫండ్ రైజింగ్‌లో భాగంగా ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగి తమ సంస్థ లక్ష్యాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసినా స్పందన అంతంత మాత్రంగానే ఉండేది. కొందరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోయేవారు. కొందరు తాము ఒప్పుకున్న దాంట్లో చాలా తక్కువ మొత్తం మాత్రమే ఇచ్చేవారు. ఇలాంటి నిరాశామయ పరిస్థితుల్లో తాను పనిచేసిన 'మోర్గన్ స్టాన్లీ' కంపెనీ చైర్మన్ రిచర్డ్ బి ఫిషర్‌ను కలిసి మాట్లాడింది నీర.

'నా రిటైర్‌మెంట్ తరువాత నేను అత్యంత సంతోషంగా గడిపే కార్యక్రమం ఏదైనా ఉందంటే అది స్వచ్ఛందసేవకు సంబంధించిన కార్యక్రమమే' అంటూ ఆయన ఎంతో ప్రోత్సాహకరంగా మాట్లాడడంతో పాటు ఆర్థికసహకారమూ అందించాడు.

ఆయన కాలం చేసిన తరువాత సమస్యలు ఎదురయ్యాయి.

అయితే ప్రతి సమస్య తాము నేర్చుకునే పాఠం అయింది.

ఎక్కడా నిరాశపడలేదు. 'మనం చేయాల్సింది ఎంతో ఉంది' అనుకోవడమే దీనికి కారణం.

నలుగురు సభ్యులతో మొదలైన 'దస్రా'లో ఇప్పుడు 105 మంది సభ్యులు ఉన్నారు. దాతలు, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. న్యూట్రీషియన్, మెంటల్ హెల్త్, శానిటేషన్, విద్య... మొదలైన రంగాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందిస్తోంది దస్రా.

'దస్రా' ఇచ్చిన చేయూతతో స్వచ్ఛంద సంస్థలు తమ కార్యకలాపాలను విస్తృతపరుచుకోగలుగుతున్నాయి.

'ఒక స్వచ్ఛందసంస్థకు సహాయం అందిస్తే దాని అడుగులు వేగంగా పడతాయి. ఆ ప్రభావం సమాజంపై ఉంటుంది. అందుకే అవి ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టాం' అంటున్న నీరా ఆర్థిక విషయాలపైనే కాకుండా తన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనుభవాన్ని ఉపయోగించి స్వచ్ఛంద సంస్థల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోంది..

పారదర్శకతనే తన బలంగా చేసుకొని ముందుకు వెళుతోంది దస్రా.

'దస్రా వల్ల స్వదేశీ, విదేశీ స్వచ్ఛంద సంస్థలతో మాత్రమే కాదు ఎంతోమంది ఫండర్స్, పాలసీ మేకర్స్‌తో పరిచయం ఏర్పడింది. ఎంతో మేలు జరిగింది. స్వచ్ఛంద సంస్థల ఉనికికి నమ్మకమే ప్రధానం. ఆ నమ్మకాన్ని దాతలలో దస్రా తీసుకువచ్చింది. మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది' అంటున్నాడు 'దస్రా' ద్వారా సహాయ సహకారాలు పొందిన వొకేషనల్-ఎడ్యుకేషన్‌కు సంబంధించిన స్వచ్ఛంద సంస్థ 'లెండ్-ఏ-హ్యాండ్ ఇండియా' వ్యవస్థాపకుడు రాజ్ గిల్డా.

**మరి నీరా మాటేమిటి?**

'కార్పొరేట్ రంగంతో పోల్చితే సామాజిక రంగంలో పని చేయడం సులువైన విషయం కాదు. ఆ ప్రయాణానికి ఎంతో సహనం కావాలి. ఆ సహనమే అపారమైన శక్తిని ఇస్తుంది' అంటుంది నీరా నుండీ.

> కార్పొరేట్ రంగంతో పోల్చితే సామాజిక రంగంలో పని చేయడం సులువైన విషయం కాదు. ఆ ప్రయాణానికి ఎంతో సహనం కావాలి. ఆ సహనమే అపారమైన శక్తిని ఇస్తుంది.
> - నీరా నుండీ

### యూత్ పల్స్

యువసంగీతాభిమానులు... 'మ్యూజిక్ కంపోజర్' కావాలని కలలు కనే యువతరానికి 'మ్యూజిక్ ఎల్‌ఎం' ఎంతో ఆసక్తి కలిగిస్తోంది. గూగుల్ లేటెస్ట్ రిసెర్చ్ ఏఐ పవర్డ్ మ్యూజిక్ టూల్ మ్యూజిక్ ఎల్‌ఎం 'కంపోజ్ యువర్ ఓన్ సాంగ్' అంటూ యువతరాన్ని అమితంగా ఆకట్టుకుంటోంది...

# శతకోటి పాటలకు అనంతకోటి రాగాలు... రెడీ!

పాట గురించి చెప్పమంటే ఏం చెబుతాం? ఏ పనీ లేనప్పుడు వచ్చి పలకరిస్తుంది. బోలెడు పనిలో ఉన్నప్పుడు ఆ పని ఒత్తిడి నుంచి రిలాక్స్ కావడానికి పాట దగ్గరికి వెళ్లాలనిపిస్తుంది. 'పాట' అనేది నిత్యజీవితంలో భాగమై పోయింది. అలాంటి పాటకు మరింత దగ్గర కావడానికే కాదు మనమే సృష్టించడానికి గూగుల్ వారి 'మ్యూజిక్ ఎల్‌ఎమ్' ఒక వేదికలా ఉపయోగపడనుంది.

కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి ఈ సంవత్సరాన్ని 'ఇయర్ ఆఫ్ ఏఐ అండ్ ఆటోమేషన్' అంటున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఏఐ పవర్డ్ మ్యూజిక్ ప్రొడక్షన్ టూల్ 'మ్యూజిక్ ఎల్‌ఎం'ను సాంకేతిక దిగ్గజం గూగుల్ ప్రకటించింది.

'చాట్‌జీపీటీ'లాగే 'మ్యూజిక్ ఎల్‌ఎం' మన సందేహాలకు సమాధానం ఇస్తుంది.

టెక్స్ట్ ఆధారంగా అప్పటికప్పుడు మనం కోరుకున్న సంగీతాన్ని 'మ్యూజిక్ ఎల్‌ఎం' అందిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన 8-బిట్, బిగ్ బీట్, బ్రిటీష్ ఇండిరాక్, ఫోక్, హిప్‌హాప్, పెరూవియన్ పుంక్... మొదలైన జానర్స్‌లో షార్ట్, మీడియం, లాంగ్ ఫామ్ మ్యూజిక్‌లను క్రియేట్ చేస్తుంది.

మరో ప్రత్యేకత ఏమిటంటే 'మ్యూజిక్ ఎల్‌ఎం' అనేది ఏఐ ఇమేజ్‌కు సరిపోయేలా మ్యూజిక్‌ను క్రియేట్ చేయగలదు.

వందలాది గంటల మ్యూజిక్ డెటాసెట్ దీని సొంతం. యూజర్స్ కోరుకునే జానర్స్, ఇన్‌స్ట్రుమెంట్స్‌తో పాటు వైబ్, మూడ్, ఎమోషన్‌లతో కూడిన సంగీతాన్ని వినిపిస్తుంది.

ప్రస్తుతానికైతే 'మ్యూజిక్ ఎల్‌ఎం' మనదేశంలోని ప్రసిద్ధ హిందుస్థానీ, కర్నాటక సంగీతాలను సపోర్ట్ చేయడం లేదు.

'మ్యూజిక్ ఎల్‌ఎం అనేది వినోదం కోసం మాత్రమే అని నేను అనుకోవడం లేదు. ఏమీ తెలియనప్పుడు ఏదో ఒకటి తెలుసుకోవడం ముఖ్యం. మ్యూజిక్ ఎల్‌ఎం ద్వారా సంగీతాభిమానులైన యువతరం ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం దొరుకుతుంది' అంటుంది రీతిక సైనీ.

దిల్లీకి చెందిన 22 సంవత్సరాల రీతిక చక్కగా పాటలు పాడుతుంది. సంగీత జ్ఞానం లేకపోయినా తనకు తోచిన రీతిలో ట్యూన్స్ క్రియేట్ చేస్తుంది. మ్యూజిక్ కంపోజర్ కావాలనేది ఆమె కల.

'మ్యూజిక్ ఎల్‌ఎం' ప్రయాణం నల్లేరు మీద నడక కాదనే విషయం దాని పరిశోధకులకు తెలియనిదేమీ కాదు. నైతిక కోణం మొదలు ట్యూన్స్ పునరావృతం కావడం అనే సాంకేతిక విషయం వరకు ఎన్నో సవాళ్లు ఎదురు చూస్తున్నాయి.

హై డిమాండ్ ఉన్న 'మ్యూజిక్ ఎల్‌ఎం' ప్రపంచంలోకి వెళ్లడానికి రిజిస్ట్రేషన్ తరువాత 'వెయిట్ లిస్ట్' కోసం కాస్త సమయం ఎదురు చూడక తప్పదు.

'కంగ్రాచ్యులేషన్స్. యూ హ్యావ్ సక్సెస్‌ఫుల్లీ జాయిన్డ్ ది వెయిట్‌లిస్ట్ ఫర్ మ్యూజిక్ ఎల్‌ఎం' అని గూగుల్ నుంచి మెసేజ్ వచ్చిన తరువాత 'మ్యూజిక్ ఎల్‌ఎం'లోకి ప్రవేశ అనుమతి లభిస్తుంది. ఒక్కసారి యాక్సెస్ అయిన తరువాత సింపుల్‌గా మనం కోరుకుంటున్న మ్యూజిక్‌ను టెక్స్ట్ ఫీల్డ్‌లో టైప్ చేస్తే చాలు.

ప్రస్తుతం ప్రయోగదశలో ఉన్న 'మ్యూజిక్ ఎల్‌ఎం'లో రాబోయే కాలంలో ఎన్ని మార్పులు చోటు చేసుకోబోతున్నాయో, ఎన్ని వివాదాలు చెలరేగనున్నాయో, మన భారతీయ సంగీతం అందులో భాగం అవుతుందో లేదో, ఈ సంగీతానికి లోక గుర్తింపు లభిస్తుందో లేదో... మొదలైన విషయాలు తెలియక పోవచ్చుగానీ, ఇప్పటికైతే మాత్రం 'మ్యూజిక్ ఎల్‌ఎం' ప్రస్తావన యూత్‌కు ఎగ్జయిటింగ్‌గా ఉంది.

'వెయిట్ లిస్ట్' కోసం వెయిట్ చేయడం బాగుంది.



ప్రతీకాత్మక చిత్రం



స్నేహా ఖన్వాల్కర్

### సంగీత ప్రపంచం ప్లస్ సాంకేతిక ప్రపంచం

పాశ్చాత్య సంగీత పరికరాలు, భారతీయ సంగీత పరికరాలను ఒక దగ్గర చేర్చాలనే ఆసక్తి కంటే ఏ సందర్భానికి ఏది ముఖ్యం అనే అవగాహన ముఖ్యం. సంగీత ప్రపంచంలో ఒక దానికోసం వెదుక్కుంటూ వెళితే ఎన్నో రత్నాలు దొరుకుతాయి. కాబట్టి ప్రయాణం అనేది ఎప్పుడూ మంచిదే. అంతర్జాలం రూపంలో మనకు సమాచార, సాంకేతిక ప్రపంచం దగ్గరైంది. వాటి ప్రయోజనాలను ఉపయోగించుకోవాలి.

ఎప్పుడూ ఒకే దగ్గర ఉండిపోవడం కాకుండా ప్రయోగాలు చేస్తూ వెళ్లాలి. నా సంగీతం గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే... క్రియేటివ్ ఎక్స్‌పెరిమెంటల్ మ్యూజిక్ అంటాను. ఏ ట్యూన్ వచ్చి ఎప్పుడు పలకరిస్తోందో తెలియదు. అందుకే దాన్ని వెంటనే రికార్డ్ చేసుకోవాలి. నేనైతే సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేస్తుంటాను.

– స్నేహా ఖన్వాల్కర్, బాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్



## గోల్ఫర్ అదితి ఘనత... టాప్-50లో చోటు...

ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-50లోకి దూసుకొచ్చిన తొలి భారతీయ మహిళా క్రీడాకారిణిగా అదితి అశోక్ గుర్తింపు పొందింది. న్యూజెర్సీలో జరిగిన ఎల్‌పీజీఏ ఫౌండర్స్ కప్ టోర్నీలో అదితి సంయుక్తంగా ఐదో స్థానంలో నిలిచింది. దాంతో ఆమె ఏకంగా 15 స్థానాలు పురోగతి సాధించి 49వ ర్యాంక్‌కు చేరుకుంది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో అదితి నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. అమెరికాకు చెందిన నెల్లీ కోర్డా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

## తొలి రౌండ్‌లోనే సాకేత్ జోడీ ఓటమి



బీఎన్‌పీ పరిబా ప్రైమ్‌రోజ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-175 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీకి తొలి రౌండ్‌లోనే పరాజయం ఎదురైంది. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 4-6, 6-7 (3/7)తో రెండో సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జంట చేతిలో ఓటమి చవిచూసింది.

## హారిక శుభారంభం



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక శుభారంభం చేసింది. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో తొలి గేమ్‌లో హారిక తెల్లపావులతో ఆడుతూ 49 ఎత్తుల్లో బిబి సారా అసాబయేవా (కజకిస్తాన్)పై విజయం సాధించింది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తొలి ఎత్తు వేసి గేమ్‌ను ప్రారంభించాడు. 2022-2023 మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లో ఇది చివరిదైన నాలుగో టోర్నీ. నాలుగు సిరీస్‌లలో కలిపి మొత్తం 16 మంది బరిలో ఉన్నారు. నాలుగు సిరీస్‌లు ముగిశాక టాప్-2లో నిలిచిన ఇద్దరు క్రీడాకారిణులు 2023 క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు.

## రన్నరప్ సరయు



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-17 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి సరయు వేల్పుల రన్నరప్‌గా నిలిచింది. ఇదే టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణకే చెందిన వేముల అద్వైత్ విఘ్నేశ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పంజాబ్‌లో జరిగిన ఈ టోర్నీలో వరంగల్ జిల్లాకు చెందిన సరయు 8.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నిర్ణీత 11 రౌండ్ల పాటు జరిగిన ఈ టోర్నీలో సరయు ఆరు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. కోచ్ బొల్లం సంపత్ వద్ద చెస్‌లో ఓనమాలు నేర్చుకున్న సరయు గతంలో అండర్-11, అండర్-13 విభాగాల్లో జాతీయ చాంపియన్‌గా నిలిచింది. మరోవైపు అద్వైత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయాడు.

# లక్నో లక్కీగా...

- ఆఖరి ఓవర్‌తో గెలిపించిన మొహసిన్
- ముంబై 5 పరుగుల తేడాతో ఓటమి
- స్టొయినిస్ విధ్వంసం
- ఇషాన్ కిషన్ ఫిఫ్టీ వృథా



మొహసిన్ ఖాన్

లక్నో: ముంబై లక్ష్యం 178. ఒకదశలో రోహిత్ జట్టు 90/0తో లక్నోపై సునాయాసంగా గెలిచే దశలో ఉంది. క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్లు... చేతిలో 10 వికెట్లున్న ముంబై ఓడుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ 'లక్' లక్నో వెంట ఉండటంతో కీలకమైన వికెట్లు, హిట్టర్ల వైఫల్యంతో ముంబై లక్ష్యానికి దూరమైంది. అయితే రోహిత్ సేనను మళ్లీ డేవిడ్ మెరుపులు గెలుపు వాకిట తీసుకెళ్లాయి. 6 బంతుల్లో 11 పరుగులు ముంబైవైపు మొగ్గితే... ఆఖరి ఓవర్ వేసిన మొహసిన్ వికెట్ తీయకపోయినా 5 పరుగులే ఇచ్చి సూపర్ జెయింట్స్‌ను గెలిపించాడు. దీంతో ముంబై 5 పరుగులతో ఓటమి పాలైంది. మొదట లక్నో 20 ఓవర్లలో 3 వికెట్లకు 177 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (47 బంతుల్లో 89 నాటౌట్; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) మెరిపించాడు. కెప్టెన్ కృనాల్ పాండ్యా (42 బంతుల్లో 49 రిటైర్డ్‌హర్ట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. బెహ్రెన్‌డార్ఫ్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 59; 8 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. యశ్, రవి బిష్ణోయ్ చెరో 2 వికెట్లు తీశారు.

**ఆఖర్లో శివమెత్తిన స్టొయినిస్**

లక్నో ఇన్నింగ్స్ బ్యాటింగ్ పవర్‌ప్లే మొదలైతే... ముంబై బౌలర్లు 'పవర్' చూపారు. దీంతో టాపార్డర్ బ్యాటర్లు దీపక్ హుడా (5), డికాక్ (15 బంతుల్లో 16; 2 సిక్సర్లు), ప్రేరక్ మన్కడ్ (0) ఆరంభ ఓవర్లలోనే పెవిలియన్‌లో కూర్చున్నారు. హుడా, ప్రేరక్‌లను బెహ్రెన్‌డార్ఫ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. 35 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన లక్నోను కృనాల్, స్టొయినిస్ నడిపించారు. వికెట్లనైతే ఆపారు... పరుగులైతే వచ్చాయి కానీ... వేగం మాత్రం లోపించింది. ఇద్దరు 82 పరుగులు జోడించాక కృనాల్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. పూరన్ జతవగా స్టొయినిస్ ఆఖరి ఓవర్లలో సిక్సర్లతో శివమెత్తాడు. 17 ఓవర్లలో లక్నో స్కోరు 123/3 కాగా... జోర్డాన్ వేసిన 18 ఓవర్లో స్టొయినిస్ 6, 0, 4, 4, 6, 4లతో వీరబాదుడు బాదేశాడు. చివరి మూడు ఓవర్లలోనే 54 పరుగులు చేసింది.

**ఇషాన్ ధాటితో...**

ఓపెనర్లు ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ ముంబైకి ధాటైన ఆరంభమిచ్చారు. ఇషాన్ బౌండరీలతో, రోహిత్ భారీ సిక్సర్లతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. పరుగులు చకచకా రావడంతో పవర్ ప్లేలో ముంబై 58/0 స్కోరు చేసింది. ఆ తర్వాత కూడా ఓపెనర్ల జోరు తగ్గనేలేదు. ఓవర్‌కు సగటున 9 పైచిలుకు పరుగులతో స్కోరుబోర్డును కదిలించారు. 10వ ఓవర్లో 90 పరుగుల వద్ద రోహిత్ (25 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు)ను రవిబిష్ణోయ్ అవుట్ చేశాడు. అర్ధసెంచరీ పూర్తయ్యాక ఇషాన్, కాసేపటికే సూర్యకుమార్ (7) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో ముంబై కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన నేహల్ వధేరా (16), విష్ణు వినోద్ (2)లు నిరాశ పరచడంతో ముంబై లక్ష్యానికి దూరమైనట్లు కనిపించింది. అయితే 'హిట్టర్లు' టిమ్ డేవిడ్ (19 బంతుల్లో 32 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు), కామెరాన్ గ్రీన్ (4 నాటౌట్) ఉండటంతో ఏమూలనో మిణుకుమిణుకుమన్న ఆశల్ని మొహసిన్ ఆఖరి ఓవర్ ముంచేసింది.



### స్కోరు వివరాలు

**లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్:** దీపక్ హుడా (సి) డేవిడ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 5; డికాక్ (సి) కిషన్ (బి) చావ్లా 16; ప్రేరక్ (సి) కిషన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 0; కృనాల్ (రిటైర్డ్‌హర్ట్) 49; స్టొయినిస్ (నాటౌట్) 89; పూరన్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-35. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4-0-30-2, జోర్డాన్ 4-0-50-0, హృతిక్ 3-0- 20-0, చావ్లా 3-0-26-1, ఆకాశ్ 4-0-30-0, గ్రీన్ 2-0-16-0.

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** ఇషాన్ (సి) నవీనుల్ (బి) బిష్ణోయ్ 59; రోహిత్ (సి) హుడా (బి) బిష్ణోయ్ 37; సూర్యకుమార్ (బి) యశ్ 7; వధేరా (సి) సబ్- గౌతమ్ (బి) మొహసిన్ 16; డేవిడ్ (నాటౌట్) 32; విష్ణు వినోద్ (సి) పూరన్ (బి) యశ్ 2; గ్రీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1-90, 2-103, 3-115, 4-131, 5-145. **బౌలింగ్:** కృనాల్ పాండ్యా 4-0-27-0, మొహసిన్ ఖాన్ 3-0-26-1, నవీనుల్ 4-0-37-0, యశ్ ఠాకూర్ 4-0-40-2, స్వప్నిల్ 1-0-11-0, రవి బిష్ణోయ్ 4-0-26-2.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 13 | 9 | 4 | 0 | 18 | 0.835 |
| చెన్నై | 13 | 7 | 5 | 1 | 15 | 0.381 |
| లక్నో | 13 | 7 | 5 | 1 | 15 | 0.304 |
| ముంబై | 13 | 7 | 6 | 0 | 14 | -0.128 |
| బెంగళూరు | 12 | 6 | 6 | 0 | 12 | 0.166 |
| రాజస్తాన్ | 13 | 6 | 7 | 0 | 12 | 0.140 |
| కోల్‌కతా | 13 | 6 | 7 | 0 | 12 | -0.256 |
| పంజాబ్ | 12 | 6 | 6 | 0 | 12 | -0.268 |
| హైదరాబాద్ | 12 | 4 | 8 | 0 | 8 | -0.575 |
| ఢిల్లీ | 12 | 4 | 8 | 0 | 8 | -0.686 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

## తొలి రౌండ్‌లో సురేఖకు 'బై'



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్ రౌండ్‌లో భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రాణించింది. మొత్తం 693 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఈ ప్రదర్శనతో సురేఖకు వ్యక్తిగత విభాగం నాకౌట్ దశలో తొలి రౌండ్‌లో 'బై' లభించింది. ఆమె నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడుతుంది. భారత్‌కే చెందిన అదితి 689 పాయింట్లు స్కోరు చేసి 12వ ర్యాంక్‌లో, అవ్‌నీత్ కౌర్ 687 పాయింట్లతో 16వ ర్యాంక్‌లో నిలిచారు. ఈ ఇద్దరికి కూడా తొలి రౌండ్‌లో 'బై' లభించింది. సురేఖ, అదితి, అవ్‌నీత్‌లతో కూడిన భారత మహిళల జట్టు టీమ్ విభాగంలో 2069 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ జోడీ ఆరో ర్యాంక్‌లో నిలిచి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో ప్రణయ్



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కేరళకు చెందిన ప్రణయ్ రెండు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరుకొని భారత నంబర్‌వన్‌గా నిలిచాడు. లక్ష్య సేన్ 22వ ర్యాంక్‌లో, కిడాంబి శ్రీకాంత్ 23వ ర్యాంక్‌లో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ఒక స్థానం పురోగతి సాధించి 11వ ర్యాంక్‌లో నిలిచింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ రెండు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకోగా... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం రెండు స్థానాలు పడిపోయి ఏడో ర్యాంక్‌లో నిలిచింది.

## రజతం నెగ్గిన అనూష



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు ఆంధ్రప్రదేశ్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో మల్లాల అనూష రజతం... జి.కార్తీక కాంస్య పతకం సాధించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరుగుతున్న ఈ టోర్నీలో అనూష 13.11 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలువగా... కార్తీక 13.10 మీటర్ల దూరం దూకి మూడో స్థానాన్ని దక్కించుకుంది. పూర్వ సావంత్ (మహారాష్ట్ర; 13.27 మీటర్లు) స్వర్ణ పతకాన్ని సాధించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ, తెలంగాణ అమ్మాయి అగసార నందిని ఫైనల్‌కు అర్హత సాధించారు.

# సినిమా



ప్రభాస్



మహేశ్ బాబు



ఎన్టీఆర్

# పాన్ ఇండియా టైటిల్

ఇండస్ట్రీలో పాన్ ఇండియా ట్రెండ్ కనిపిస్తోంది. సినిమాలు దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదలవుతున్నాయి. దీంతో అన్ని భాషలవారికీ అనుగుణంగా ఉండే కథలను ఎంచుకుంటున్నారు. కథలు మాత్రమే కాదు.. టైటిల్ కూడా పాన్ ఇండియాకి సూట్ అయ్యేలా ఉండాలని ప్రయత్నం చేస్తున్నారు. ఒకే టైటిల్‌తో అన్ని భాషల్లో ఓ చిత్రం విడుదలైతే అది ఆడియన్స్‌కు మరింత చేరువ అవుతుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ క్రమంలో కొందరు టాప్ స్టార్స్ నటిస్తున్న చిత్రాల టైటిల్స్‌పై చర్చ జరుగుతోంది. 'ఫలానా టైటిల్ అనుకుంటున్నారట' అని వైరల్‌గా ఉన్న టైటిల్స్ 'పాన్ ఇండియా టైటిల్'లా ఉన్నాయి. మరి.. ఫైనల్‌గా ఆ టైటిల్స్‌నే ఫైనలైజ్ చేస్తారో? లేదో చెప్పలేం కానీ.. చర్చల్లో ఉన్న ఆ టైటిల్స్ గురించి మాత్రం చెప్పుకుందాం.

**రాజా డీలక్స్?**

ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె' వంటి భారీ యాక్షన్ సినిమాలు చేస్తున్నారు ప్రభాస్. కేవలం యాక్షన్ జానర్‌కే పరిమితం కాకుండా కాస్త కామెడీ తరహా పాత్రల్లో కూడా ప్రభాస్ నటించాలనుకుంటున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే దర్శకుడు మారుతితో ఓ సినిమా చేస్తున్నారు ప్రభాస్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. హారర్ అండ్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా కథ రాజా డీలక్స్ అనే థియేటర్‌లో జరుగుతుందని, అందుకే ఈ సినిమాకు 'రాజా డీలక్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనుకుంటున్నారని సమాచారం. ఒకవేళ ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో విడుదల చేయాలనుకుంటే.. అప్పుడు టైటిల్ మార్చే అవసరం లేకుండా పోతుంది.

**గుంటూరు కారమా? ఊరికి మొనగాడా?**

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే జనవరి 13న విడుదల కానుంది. ఫస్ట్ లుక్ కూడా విడుదలైంది. ఇక ఈ చిత్రానికి 'అయోధ్యలో అర్జునుడు', 'ఊరికి మొనగాడు', 'పల్నాటి పోటుగాడు', 'అమరావతికి అటు ఇటు', 'గుంటూరు కారం' టైటిల్స్ తెరపైకి వచ్చాయి. ఎక్కువగా 'గుంటూరు కారం', 'ఊరికి మొనగాడు' వినిపిస్తున్నాయి. సూపర్‌స్టార్ కృష్ణ నటించిన హిట్ చిత్రాల్లో 'ఊరికి మొనగాడు' ఒకటి అని తెలిసిందే. కాగా ఈ నెల 31న కృష్ణ బర్త్ డే సందర్భంగా టైటిల్ ప్రకటించే చాన్స్ ఉంది. మరి, ఇక్కడ పేర్కొన్న టైటిల్స్‌లో ఏదో ఒకటి ఉంటుందా? వేరే టైటిల్‌ని ఫిక్స్ చేస్తారా? అనేది చూడాలి.

**దేవర?**

'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. ఓ లీడ్ రోల్‌ను సైఫ్ అలీ ఖాన్ చేస్తున్నారు. కాగా ఈ సినిమాకు 'వస్తున్నా!', 'దేవర' టైటిల్స్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ తెర పైకి వచ్చింది. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను అధికారికంగా ప్రకటిస్తారట. కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

వీరే కాదు.. మరికొందరు స్టార్స్ చిత్రాల టైటిల్స్‌పైనా చర్చ జరుగుతోంది. ప్రేక్షకులను ఆకర్షించే విషయాల్లో 'టైటిల్' ఒకటి. ఆ విషయాన్ని, కథనీ దృష్టిలో పెట్టుకుని టైటిల్స్ పెడుతుంటారు. ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇక ఫ్యాన్స్ గురించి చెప్పాలంటే టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉంటే వారికి కిక్కే కిక్కు.

## ప్రేమిస్తున్నా.. పాట బాగా నచ్చింది - రష్మిక మందన్న



విరాజ్, వైష్ణవి, రష్మిక, ఆనంద్ దేవరకొండ

''బేబి' సినిమాలోని 'ప్రేమిస్తున్నా..' సాంగ్ మీకు (అభిమానులు) నచ్చిందా? అద్భుతంగా ఉంది కదా.. నాకూ బాగా నచ్చింది. ఆనంద్ మ్యూజిక్ సెన్స్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఈ మూవీ ఎప్పుడు చూస్తానా? అని ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. 'బేబి' పెద్ద హిట్ కావాలి'' అని హీరోయిన్ రష్మికా మందన్న అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ప్రేమిస్తున్నా...' అనే పాటని అభిమానుల సమక్షంలో రష్మికా మందన్న హైదరాబాద్‌లో విడుదల చేశారు. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ–''బేబి' జూలై రెండోవారం లేదా మూడో వారంలో వస్తుంది. ఇదొక మ్యూజికల్ ఫిల్మ్. ముప్పై, నలభై ఏళ్ల తర్వాత కూడా వినే అద్భుతమైన పాట 'ప్రేమిస్తున్నా..' అన్నారు. ''ప్రమోషన్స్ కోసం ఇంత ఖర్చు పెడుతున్న ఎస్‌కేఎన్, మారుతిగార్లకు థ్యాంక్స్'' అన్నారు సాయి రాజేశ్. ''ప్రస్తుతం పెద్ద సినిమాలనే పట్టించుకోవడం లేదు.. అలాంటిది 'బేబి'లాంటి చిన్న సినిమా జనాల్లోకి వెళ్లడం గొప్పగా ఉంది'' అన్నారు డైరెక్టర్ మారుతి.

## కాన్స్ కబురు



మృణాల్ ఠాకూర్

'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్‌కి కాన్స్ నుంచి కబురొచ్చింది. ప్రతి ఏడాది ఫ్రాన్స్‌లో జరిగే కాన్స్ చిత్రోత్సవాలు ఈ నెల 16న ఆరంభమయ్యాయి. 27 వరకు కొనసాగుతాయి. ఈ చిత్రోత్సవాల్లో మృణాల్ రెడ్ కార్పెట్‌పై తొలిసారి మెరవనున్నారు. ఈ విషయంపై మృణాల్ మాట్లాడుతూ – ''అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్‌మేకర్స్‌తో మాట్లాడటానికి ఈ వేదిక నాకు ఉపయోగపడుతుంది. భారతీయ చలన చిత్రపరిశ్రమ ఖ్యాతిని నేను అక్కడ ప్రస్తావించాలనుకుంటున్నాను'' అన్నారు మృణాల్. ఈ నెల 17 నుంచి 19 తేదీల్లో మూడు రోజుల పాటు మృణాల్ కాన్స్ చిత్రోత్సవాల్లో సందడి చేస్తారట.


## నేను స్టూడెంట్ సార్ అనేవాణ్ణి - విశ్వక్ సేన్



విశ్వక్ సేన్, బెల్లంకొండ గణేశ్, రాఖీ, అవంతిక

''నేను ప్రతిరోజూ విద్యార్థిలానే భావిస్తాను. 'నేను స్టూడెంట్ సర్' టైటిల్ విన్నప్పుడు నా కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి. ఏదైనా తింగరి పని చేసి పోలీసులకు దొరికినప్పుడు 'నేను స్టూడెంట్ సార్' అనేవాణ్ని'' అన్నారు హీరో విశ్వక్ సేన్. బెల్లంకొండ గణేశ్ హీరోగా రాఖీ ఉప్పలపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. 'నాంది' సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని '24/7 ఒకటే ధ్యాస..' అనే పాటని విశ్వక్ సేన్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నేను స్టూడెంట్ సర్' టీజర్ బాగుంది. సినిమా మంచి హిట్ కావాలి'' అన్నారు. ''ఫోన్ కొనడానికి కష్టపడే సమయంలో వచ్చే మాంటేజ్ సాంగ్ '24/7 ఒకటే ధ్యాస..'' అన్నారు బెల్లంకొండ గణేశ్. ''మా సినిమాని అందరూ చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు రాఖీ ఉప్పలపాటి. ''హీరో క్యారెక్టర్ ఏంటో ఈ పాట ద్వారా చెప్పాం'' అన్నారు సతీష్ వర్మ. కథారచయిత కృష్ణ చైతన్య, పాటల రచయిత హర్ష, హీరోయిన్లు అవంతిక, రితిక మాట్లాడారు.

## స్పైకి కథే హీరో - నిఖిల్



నిఖిల్, ఐశ్వర్యా మీనన్, గ్యారీ బీహెచ్

''ఈ మధ్య ప్రేక్షకులు ఇష్టపడుతున్నది మంచి కథనే. హీరో, ఎంటర్‌టైన్‌మెంట్ ఎంత ఉన్నా కథ అనే సోల్ లేకపోతే బ్లాక్ బస్టర్ అవ్వదు. 'స్పై' మూవీకి కథే హీరో'' అని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'స్పై'. ఈ సినిమా జూన్ 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో హీరో నిఖిల్ మాట్లాడుతూ – ''సుభాష్ చంద్రబోస్‌గారి గురించి, ఆయన స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ గురించి, ఆ సంస్థ సేవల గురించి చాలామందికి తెలియదు. దేశానికి తెలియాల్సిన ఆ విషయాలతో పాటు వినోదాత్మకంగా ఈ మూవీ ఉంటుంది'' అన్నారు. 'కార్తికేయ 2' తర్వాత ఓ పార్టీకి అనుకూలంగా మీరు 'స్పై' చేస్తున్నారనే ప్రచారంపై మీ స్పందన అని అడగ్గా – ''కృష్ణుడంటే నాకు నమ్మకం. అందుకే 'కార్తికేయ 2' చేశాను. ఇప్పుడు ఓ భారతీయుడిగా 'స్పై' చేశాను. నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు'' అన్నారు నిఖిల్. ''డైరెక్టర్‌గా నా తొలి సినిమా నిఖిల్‌తో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు గ్యారీ బీహెచ్. ''స్పై' చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అన్నారు చరణ్ తేజ్ ఉప్పలపాటి. సంగీత దర్శకులు శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, సినిమాటోగ్రాఫర్ వంశీ పచ్చిపులుసు, మాటల రచయిత అనిరుద్ కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు.

## అలాంటి వారిలో నేనూ ఒకణ్ణి - మిక్కీ జే మేయర్



''నా మ్యూజిక్ కంపోజర్స్ టీమ్ అందరూ అమెరికా, లండన్‌లో ఉంటారు. సో.. నేను అమెరికాలో ఉన్నప్పటికీ నిర్మాతలు ఇబ్బందిపడటంలేదు. ఓ సినిమా హిట్ అయితే హీరో, డైరెక్టర్స్‌తో పాటు సంగీత దర్శకుడికి మంచి పేరు వస్తుంది. అందుకే స్క్రిప్ట్ ముఖ్యమని నమ్ముతాను. ఇక ఇటు శేఖర్ కమ్ములగారి నుంచి హరీష్ శంకర్, అటు నాగ్ అశ్విన్ నుంచి నందినీ రెడ్డిగార్ల సినిమాలు.. ఇలా డిఫరెంట్ సినిమాలకు మ్యూజిక్ అందించిన అతి కొద్దిమంది మ్యూజిక్ డైరెక్టర్స్‌లో నేనూ ఒకణ్ణి'' అన్నారు సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్, స్వప్నా సినిమాస్ పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర సంగీతదర్శకుడు మిక్కీ జే మేయర్ మాట్లాడుతూ– ''మహానటి' తర్వాత వైజయంతీ మూవీస్‌లో నేను చేసిన సినిమా 'అన్నీ మంచి శకునములే'. ఇందులో ఆరు పాటలు ఉన్నాయి. నందినీ రెడ్డిగారు కథ చెప్పినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. అలాగే కథలో ఆమె క్రియేట్ చేసిన విక్టోరియాపురం ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న రెండు సినిమాలకు, దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలగారితో ఓ ప్రాజెక్ట్, 'చాంపియన్' అనే మరో ప్రాజెక్ట్, 'సెల్ఫిష్', అమెరికాలో ఉన్న మరో దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

## 1960లో ఏం జరిగింది?



అలేఖ్య

జీవన్, అలేఖ్య జంటగా అశ్విన్ కామరాజు కొప్పల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వృషభ'. ఉమా శంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. పలమనేరులో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం ట్రైలర్‌ను ఎమ్మెల్యే వెంకటయ్య గౌడ్, టైటిల్ పోస్టర్‌ను ప్రభుత్వ ఆస్పత్రి చైర్మన్ ఆర్. చెంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పవిత్రా మురళీ కృష్ణ రిలీజ్ చేశారు. ''మనుషులకు, గోవులకు మధ్య ఉన్న అనుబంధం నేపథ్యంలో 'వృషభ' కథ ఉంటుంది'' అన్నారు ఉమాశంకర్ రెడ్డి. ''1960 నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది'' అన్నారు అశ్విన్ కామరాజు కొప్పల.

సాక్షి బిజినెస్
బుధవారం
17-5-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 413 | 61,932 |
| నిఫ్టీ ▽ | 112 | 18,287 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,390 | △ | 24 |
| డోజోన్స్ | 33,118 | ▽ | 230 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,751 | ▽ | 27 |
| డాక్స్ | 15,898 | ▽ | 19 |
| షాంఘై | 3,291 | ▽ | 20 |
| నికాయ్ | 29,843 | △ | 217 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

| | |
|---|---|
| బంగారం (24 క్యారట్) | 61,066 |
| బంగారం (22 క్యారట్) | 60,821 |
| వెండి (కిలో) | 71,930 |



# కార్ల కంపెనీలు.. క్యాంపస్ బాట!

- కాలేజీల నుంచి జోరుగా హైరింగ్
- డేటా అనలిటిక్స్, ఎలక్ట్రిఫికేషన్ నైపుణ్యాలకు ప్రాధాన్యం



**న్యూఢిల్లీ:** ప్రతిభావంతులైన యువ సిబ్బందిని రిక్రూట్ చేసుకునే క్రమంలో ఆటోమొబైల్ కంపెనీలు గతంలో ఎన్నడూ లేనంతగా ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూల్స్ మీద దృష్టి పెడుతున్నాయి. దీంతో గౌహతి, మండీ లాంటి ప్రాంతాల్లోని ఐఐటీల్లో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు ఈసారి గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్యాసింజర్ కార్ల మార్కెట్లలో ఒకటిగా భారత్ ఎదుగుతున్న నేపథ్యంలో ఆటోమొబైల్ కంపెనీలు వివిధ విభాగాల్లో ప్రతిభావంతులను మరింతగా నియమించుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో హైరింగ్‌ను పెంచుకుంటున్నట్లు వివరించాయి. అనలిటిక్స్, ఎలక్ట్రిఫికేషన్, ఇండస్ట్రీ 5.0 నైపుణ్యాలు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నాయి. 2024 బ్యాచ్ నుంచి మేనేజ్‌మెంట్, గ్రాడ్యుయేట్ ట్రైనీలను తీసుకోవాలని జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భావిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి 15–20% ఎక్కువ మందిని తీసుకోబోతున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. క్యాంపస్ నుంచి రిక్రూట్ చేసుకున్న వారికి కొత్త టెక్నాలజీలు, ప్లాట్‌ఫాంలపై తగు శిక్షణ ఇచ్చి భవిష్యత్ అవసరాల కోసం సిద్ధం చేసుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఇప్పటికే డేటా అనలిటిక్స్ తదితర విభాగాల్లో నైపుణ్యాలున్న వారిని రిక్రూట్ చేసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించింది. డేటా మైనింగ్ తదితర సాంకేతికతలతో ఈ–కామర్స్ చానల్స్‌ను అభివృద్ధి చేసేందుకు, బ్యాక్–ఎండ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసేందుకు వీరిని వినియోగించుకోవాలనేది కంపెనీ యోచన.

**మారుతీ కూడా..**

గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు అమ్మకాల ఊతంతో భవిష్యత్ అవసరాల కోసం నియామకాలను మరింతగా పెంచుకునేందుకు మారుతీ సుజుకీ కూడా సన్నద్ధమవుతోంది. వ్యాపార విస్తరణకు అనుగుణంగా క్యాంపస్ నుంచి నియామకాలను కూడా పెంచుకుంటున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది క్యాంపస్‌ల నుంచి 1,000 మంది వరకూ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు పేర్కొన్నాయి. సంస్థలో అంతర్గతంగా కొత్త టెక్నాలజీలను ప్రవేశపెట్టడం, డిజిటల్ పరివర్తన మొదలైన వాటిని వేగంగా అమలు చేస్తున్నామని, ఇందుకోసం తత్సంబంధ నైపుణ్యాలున్న ప్రతిభావంతుల అవసరం చాలా ఉంటోందని వివరించాయి.

మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా కూడా ఇటీవలే తమ క్యాంపస్ హైరింగ్‌ల జాబితాలో మరిన్ని కొత్త ఐఐటీలు, ఎంబీఏ సంస్థలను కూడా చేర్చింది. 2022లో దాదాపు 50 పైగా ఇంజినీరింగ్, ఎంబీఏ సంస్థల నుంచి మహీంద్రా ఎంట్రీ లెవెల్ సిబ్బందిని తీసుకుంది. సగటున 500–600 మందిని రిక్రూట్ చేసుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. అటు హీరో మోటోకార్ప్ సంస్థ డిప్లొమా ఇంజినీర్ల నియామకం కోసం ఢిల్లీ స్కిల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ యూనివర్సిటీతో జట్టు కట్టింది. క్రితం సంవత్సరంతో పోలిస్తే తాము 40 శాతం ఎక్కువ మందిని క్యాంపస్ నుంచి రిక్రూట్ చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. వీరిలో ఎక్కువగా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకాట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్లు, ఎంబీఏలు ఉన్నట్లు పేర్కొన్నారు. కొరియా దిగ్గజం హ్యుందాయ్ మోటార్ భారత్‌లో తన కార్యకలాపాల కోసం వివిధ విభాగాల్లో, హోదాల్లో 1,000 పైగా ఉద్యోగాలను భర్తీ చేసే యత్నాల్లో ఉంది. క్యాంపస్‌ల విషయానికొస్తే.. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ నేపథ్యం ఉన్నవారికి ప్రాధాన్యం లభించనుంది.

### క్యాంపస్‌లలోనూ ఆసక్తి..

ఆటోమొబైల్ కంపెనీల నియామకాల ప్రణాళికలపై క్యాంపస్‌లలో కూడా ఆసక్తి నెలకొంది. ఐఐటీ–గౌహతిలో గతేడాదితో పోలిస్తే ఈసారి కోర్ ఇంజినీరింగ్ నైపుణ్యాలున్న వారికి ఆఫర్లు గణనీయంగా పెరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కోర్ ఇంజినీర్, డిజైన్ ఇంజినీర్, బిజినెస్ అనలిస్ట్, డేటా ఇంజినీర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ తదితరుల కోసం డిమాండ్ నెలకొన్నట్లు పేర్కొన్నాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి తమ దగ్గర నుంచి రిక్రూట్ చేసుకునే ఆటోమొబైల్ కంపెనీల సంఖ్య పెరిగినట్లు ఐఐటీ–మండీ వర్గాలు తెలిపాయి. కోవిడ్‌పరమైన మందగమనం ప్రభావం తగ్గడం ఇందుకు కారణం కావచ్చని భావిస్తున్నట్లు వివరించాయి.

## భారతీ ఎయిర్‌టెల్ లాభాలు ఆకర్షణీయం

- మార్చి క్వార్టర్‌కు రూ.3,006 కోట్లు
- రూ.193కి చేరిన ఏఆర్‌పీయూ
- ఏడాది చివరికి అన్ని పట్టణాలకూ 5జీ



**న్యూఢిల్లీ:** భారతీ ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 49% పెరిగి రూ.3,006 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలానికి సంస్థ లాభం రూ.2,008 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.31,500 కోట్ల నుంచి రూ.36,009 కోట్లకు ఎగసింది. 14 శాతం వృద్ధిని చూపించింది. భారతీ ఎయిర్‌టెల్ దేశీ వ్యాపారం (భారత్ వరకు) మార్చి త్రైమాసికంలో 12% వృద్ధితో రూ.25,200 కోట్లుగా ఉంటే, 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి 19% వృద్ధితో రూ.82,488 కోట్లుగా నమోదైంది. సగటు వినియోగదారు నుంచి వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ.193కు చేరుకుంది. 2022 మార్చి త్రైమాసికంలో ఏఆర్‌పీయూ 178గా ఉంది. ''నాణ్యమైన కస్టమర్లను సొంతం చేసుకోవడంపై దృష్టి సారించడంతో 74 లక్షల కొత్త 4జీ కస్టమర్లు మాకు తోడయ్యారు. 5జీ నెట్‌వర్క్‌ను ఈ ఏడాది చివరికి అన్ని ముఖ్య పట్టణాలు, కీలకమైన గ్రామాలకు చేరువ చేయాలన్నది మా లక్ష్యం'' ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విట్టల్ తెలిపారు.

2022–23 సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెట్టింపై రూ.8,346 కోట్లకు చేరుకుంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 19 శాతానికి పైగా పెరిగి రూ.1,39,145 కోట్లుగా నమోదైంది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా భేష్



168 శాతం ఎగసిన నికర లాభం

**ముంబై:** బ్యాంక్ ఆఫ్ బరోడా మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.4,775 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభంతో పోల్చి చూస్తే 168 శాతం వృద్ధి చెందింది. నికర వడ్డీ ఆదాయం 34 శాతం పెరిగి రూ.11,525 కోట్లుగా ఉంది. రుణాల్లో 19 శాతం వృద్ధి నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.53 శాతానికి పుంజుకుంది. ఇది క్రితం ఏడాది ఇదే కాలంలో 3.07 శాతంగానే ఉంది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 3.79 శాతానికి తగ్గాయి. 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరం లాభంతో పోల్చి చూస్తే రెట్టింపై రూ.14,110 కోట్లుగా నమోదైంది. అధిక నికర వడ్డీ మార్జిన్(నిమ్) తమనూ ఆశ్చర్యపరిచిందని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ, సీఈవో సంజీవ్ చద్దా పేర్కొన్నారు. 2023–24 సంవత్సరంలోనూ 3.5 శాతం మేర నిమ్‌ను కొనసాగిస్తామన్నారు.

## ఇండియన్ ఆయిల్‌కు భారీ లాభాలు

- 52 శాతం పెరిగి రూ.10,841 కోట్లు
- షేరుకు రూ.3 చొప్పున తుది డివిడెండ్



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 52 శాతం వృద్ధితో రూ.10,841 కోట్లుగా నమోదైంది. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.2,09,045 కోట్ల నుంచి రూ.2,30,711 కోట్లకు చేరుకుంది. 2022–23 సంవత్సరానికి ప్రతి షేరుకు రూ.3 చొప్పున తుది డివిడెండ్‌ను ఐవోసీ బోర్డు ప్రకటించింది. అనుబంధ సంస్థలు కాకుండా స్టాండలోన్ నికర లాభం మార్చి త్రైమాసికానికి 67 శాతం పెరిగి రూ.10,059 కోట్లుగా నమోదైంది. అంతకు ముందు డిసెంబర్ త్రైమాసికంలో వచ్చిన రూ.448 కోట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. గత ఐదు త్రైమాసికాల్లో ఐవోసీ లాభంలో వృద్ధిని చూడడం ఇదే మొదటి సారి. రిటైల్ ధరలను సవరించకుండా ఉండడంతో ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు కొన్ని త్రైమాసికాలుగా గడ్డు పరిస్థితులను చూశాయి. మార్చి త్రైమాసికంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఇవి తిరిగి లాభాల బాట పట్టాయి. విభాగాల వారీగా చూస్తే.. పెట్రోలియం ఉత్పత్తుల రూపంలో ఆదాయం 11 శాతం పెరిగి రూ.2,20,429 కోట్లుగా ఉంది. ఫలితాలు ఆకర్షణీయంగా ఉండడంతో బీఎస్‌ఈలో ఐవోసీ షేరు 4 శాతం లాభపడి రూ.87.40 వద్ద ముగిసింది.

## వేగన్-ఆర్ @ 30 లక్షలు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా హ్యాచ్‌బ్యాక్ వేగన్–ఆర్ 30 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు నమోదు చేసింది. 1999లో ఈ మోడల్ భారత మార్కెట్లో ఎంట్రీ ఇచ్చింది. 2008లో 5 లక్షల యూనిట్లు, 2012 నాటికి 10 లక్షల యూనిట్ల విక్రయాల మార్కును చేరుకుంది. ఆ తర్వాత అయిదేళ్లలోనే అమ్మకాలు రెండింతలయ్యాయి. 2021 నాటికి మొత్తం 25 లక్షల కార్లు రోడ్డెక్కాయి. ప్రస్తుతం థర్డ్ జనరేషన్ వేగన్–ఆర్ మార్కెట్లో ఉంది. ధర ఎక్స్‌షోరూంలో రూ.5.54–7.42 లక్షల మధ్య పలుకుతోంది. కె–సిరీస్, డ్యూయల్ జెట్, డ్యూయల్ వీవీటీ 1.0, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ ఆప్షన్స్‌లో లభిస్తోంది. మాన్యువల్, ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో రూపుదిద్దుకుంది. సీఎన్‌జీ వేరియంట్ కూడా ఉంది. యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, హిల్ హోల్డ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. వేగన్–ఆర్ కస్టమర్లలో 24 శాతం మంది ఇదే మోడల్‌కు అప్‌గ్రేడ్ అవుతున్నట్టు మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. 2021–22లో 1,89,000 యూనిట్లు, 2022–23లో 2,12,000 యూనిట్లతో దేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా వేగన్–ఆర్ స్థానం దక్కించుకుంది.

## రెండు రోజుల ర్యాలీకి బ్రేక్



సెన్సెక్స్ 413, నిఫ్టీ 112 పాయింట్లు డౌన్

**ముంబై:** రెండు హెచ్‌డీఎఫ్‌సీ సంస్థలు, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజాల షేర్లు క్షీణించడంతో దేశీ సూచీల రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. మంగళవారం సెన్సెక్స్ 413 పాయింట్లు తగ్గి 61,932 వద్ద, నిఫ్టీ 112 పాయింట్లు క్షీణించి 18,287 వద్ద క్లోజయ్యాయి. లాభాల స్వీకరణ జరగడంతో సెన్సెక్స్ కీలకమైన 62,000 మార్కు దిగువున ముగిసిందని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ విభాగం హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. గత కొద్ది వారాలుగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు, ఆశావహ ఆర్థిక గణాంకాలు మొదలైనవి ర్యాలీకి ఊతంగా నిల్చాయని పేర్కొన్నారు. అయితే వడ్డీ రేట్ల కదలికలపై అనిశ్చితి, డిమాండ్ మందగించడం వంటి అంశాల కారణంగా ఇన్వెస్టర్లు తరచుగా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉందని చౌహాన్ వివరించారు. హెవీ వెయిట్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్ పరుగుకు బ్రేక్ పడిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మంగళవారం.. సెన్సెక్స్ సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మొదలైనవి క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, టైటాన్ మొదలైనవి లాభపడ్డాయి. ఆటో సూచీ 0.97%, ఆర్థిక సర్వీసులు 0.53 శాతం, బ్యాంకెక్స్ 0.36 శాతం క్షీణించాయి.

# భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## జాబ్ పాయింట్

### ఎన్ఆర్ఎస్‌సీ, హైదరాబాద్‌లో 70 గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడాది అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం ఖాళీల సంఖ్య: 70

» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–17, టెక్నీషియన్ అప్రెంటిస్–30, డిప్లొమా అప్రెంటిస్–23. » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్.

» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, డిప్లొమా ఇంజనీరింగ్ (కమర్షియల్ ప్రాక్టీస్) ఉత్తీర్ణులై ఉండాలి. » **స్టయిపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000, టెక్నీషియన్/డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.8000.

» **ఎంపిక విధానం:** డిగ్రీ/డిప్లొమా స్థాయిలో అభ్యర్థులు సాధించిన అకడమిక్ స్కోరు ఆధారంగా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.06.2023.

» **వెబ్‌సైట్:** www.nrsc.gov.in

### ఎన్‌టీపీసీ, న్యూఢిల్లీలో 120 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 120

» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్)–100, అసిస్టెంట్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్)–20. » **అర్హత:** బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్), పని అనుభవంతోపాటు గేట్–2022 స్కోరు సాధించి ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.55,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, షార్ట్‌లిస్టింగ్, సెలక్షన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.05.2023.

» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

### ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 24 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 24

» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్)–22, ఎగ్జిక్యూటివ్(పీ–ఎస్)–02.

» **అర్హత:** బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 18.05.2023.

» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

## మెరైన్ కోర్సులు.. కెరీర్ మెరిసె

ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయూ). ఇది కేంద్రీయ విశ్వవిద్యాలయం. భారత ప్రభుత్వానికి చెందిన షిప్పింగ్, వాటర్‌వేస్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఐఎంయూకు దేశవ్యాప్తంగా ఆరు క్యాంపస్‌లు, 17 అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఉన్నాయి. వీటిల్లో యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఎంయూ సెట్–2023లో ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో.. ఐఎంయూ అందించే కోర్సులు, అర్హతలు, ప్రవేశ పరీక్ష తదితర వివరాలు..

» ఐఎంయూ సెట్ 2023 నోటిఫికేషన్ విడుదల

» డిగ్రీ, పీజీ, బీబీఏ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీలో ప్రవేశాలు




#### అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- **బీటెక్(మెరైన్ ఇంజనీరింగ్):** ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇది చెన్నై, కోల్‌కతా, ముంబై పోర్ట్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- **బీటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్):** ఈ కోర్సు వ్యవధి కూడా నాలుగేళ్లు. విశాఖపట్నం క్యాంపస్ ఈ కోర్సును అందిస్తోంది.
- **బీఎస్సీ(నాటికల్ సైన్స్):** ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు. చెన్నై, కొచ్చిన్, నవీ ముంబై క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- **బీబీఏ(లాజిస్టిక్స్, రిటైలింగ్ అండ్ ఈ కామర్స్):** ఇది మూడేళ్ల కోర్సు. చెన్నై, కొచ్చిన్ క్యాంపస్‌లు ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఇందులో చేరేందుకు ఐఎంయూ సెట్ రాయాల్సిన అవసరం లేదు. ఐఎంయూ అడ్మిషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కోర్సులో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **డీఎన్ఎస్(డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్):** ఇది ఏడాది కోర్సు. చెన్నై, నవీ ముంబై క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- **అర్హత:** అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారు కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్)లో ఉత్తీర్ణత సాధించాలి.

#### పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు

- **ఎంబీఏ(పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్):** కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. చెన్నై, కొచ్చిన్ క్యాంపస్‌లు ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.
- **ఎంబీఏ(ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్):** కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. చెన్నై, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చిన్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- **ఎంటెక్(మెరైన్ టెక్నాలజీ):** కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇది కోల్‌కతా క్యాంపస్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.
- **ఎంటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్):** కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. ఈ కోర్సును విశాఖపట్నం క్యాంపస్ అందిస్తోంది.
- **ఎంటెక్(డ్రెడ్జింగ్ అండ్ హార్బర్ ఇంజనీరింగ్):** కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. దీన్ని విశాఖపట్నం క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- **అర్హత:** పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలంటే.. ఆయా ప్రోగ్రాములను అనుసరించి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత తప్పనిసరి.వయసుతో సంబంధం లేదు.

#### పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మెరైన్ ఇంజనీరింగ్

- ఇది ఏడాది కోర్సు. ముంబై పోర్ట్ క్యాంపస్‌లో అందుబాటులో ఉంది. సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.
- పీహెచ్‌డీ అండ్ ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

#### పరీక్ష విధానం

- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 200 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్/10+2 స్థాయి ఇంగ్లిష్, జనరల్ ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలొస్తాయి.
- ఎంబీఏ కోర్సుకు నిర్వహించే ప్రవేశ పరీక్షలో 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పీజీ కోర్సులకు సంబంధించిన ఎంట్రెన్స్ టెస్ట్‌లో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. లాజికల్ రీజనింగ్, మ్యాథమేటిక్స్, మెకానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్/నావల్ ఆర్కిటెక్చర్/మెరైన్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **పీహెచ్‌డీ, ఎమ్మెస్(రీసెర్చ్):** ప్రవేశ పరీక్షను పార్ట్–1, పార్ట్–2 పద్ధతిలో నిర్వహిస్తారు. పార్ట్–1లో 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. జనరల్ మెంటల్ ఎబిలిటీ, నాలెడ్జ్ ఆఫ్ మారిటైం సెక్టార్ అండ్ నాలెడ్జ్ ఆఫ్ ది స్కూల్/ఏరియా ఆఫ్ రీసెర్చ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పార్ట్–2లో స్కూల్/ఏరియాకు సంబంధించిన వ్యాసం ఇస్తారు. పరీక్ష సమయం ఒక గంట. రుణాత్మక మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 శాతం మార్కు కోత ఉంటుంది.

#### ఉద్యోగావకాశాలు

ఈ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఎస్సైకే గ్రూప్, అదానీ, సీపోల్, టీవీఎస్, ఏసీటీఎల్, టీమ్ గ్లోబల్, స్విఫ్ట్ లాజిస్టిక్స్ తదితర సంస్థల్లో కొలువులు దక్కించుకోవచ్చు. అదేవిధంగా బెటా, క్యాట్ లాజిస్టిక్స్, సెంచూరీ ప్లై మ్యాక్, దమ్కో, డీహెచ్‌ఎల్, జీవీకే, హోండా, ఆదానీ, టీవీఎస్, టీసీఈ, లాజిస్టిక్స్, బ్లూలైన్ లాంటి సంస్థలు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నాయి.

#### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 18.05.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** 26.05.2023
- **ఐఎంయూ–సెట్ తేదీ:** 10.06.2023
- **వెబ్‌సైట్:** http://www.imu.edu.in

## ఇంటర్‌తోనే టీచర్

టీఎస్ డీఈఈసెట్.. తెలంగాణ స్టేట్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే.. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డి.ఇఎల్.ఇడి.), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డి.పి.ఎస్.ఇ) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిని పూర్తిచేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో బోధన వృత్తిలో కెరీర్ ప్రారంభించొచ్చు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు పోటీపడొచ్చు. తెలంగాణ రాష్ట్రంలో టీఎస్ డీఈఈ సెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షకు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...

» టీఎస్ డీఈఈసెట్-2023 ప్రకటన విడుదల

» ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనకు మార్గం




#### అర్హతలు

- కనీసం 50 శాతం(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్స్ సమయానికి ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు:** 2023, సెప్టెంబర్ 1 నాటికి 17 ఏళ్లు నిండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.

#### పరీక్ష విధానం

టీఎస్ డీఈఈసెట్ ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రంలో పార్ట్–1, పార్ట్–2, పార్ట్–3 అనే మూడు విభాగాలు ఉంటాయి. పార్ట్–1లో 10 ప్రశ్నలు–10 మార్కులకు, పార్ట్–2లో 30 ప్రశ్నలు–30 మార్కులకు, పార్ట్–3లో 60 ప్రశ్నలు–60 మార్కులకు చొప్పున పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థుల ఎంపికకు అనుగుణంగా ప్రశ్నపత్రం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.

#### పార్ట్-1

ఈ విభాగంలో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10మార్కులకు–10 ప్రశ్నలు ఇస్తారు.

#### పార్ట్-2

ఈ విభాగంలో తెలుగు మీడియం విద్యార్థులకు జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ తెలుగు నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లిష్ మీడియం అయితే జనరల్ ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఉర్దూ మీడియం వారికి జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ ఉర్దూ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.

#### పార్ట్-3

ఈ విభాగంలో మ్యాథమెటిక్స్ నుంచి 20 ప్రశ్నలు, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10 ప్రశ్నలు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నల చొప్పున అడుగుతారు.

#### ప్రిపరేషన్ ఇలా

- టీచింగ్ ఆప్టిట్యూడ్‌లో ఉపాధ్యాయ వృత్తి, తరగతి గది నిర్వహణ, పాఠశాల వాతావరణం, బోధన సామర్థ్యం తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- జీకే అండ్ కరెంట్ అఫైర్స్‌లో భాగంగా క్రీడలు, అవార్డులు, రాజకీయ పరిణామాలు, ఆర్థిక, రక్షణ, భౌగోళిక పరమైన అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- ఇంగ్లిష్‌కు సంబంధించి ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్; సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్సెస్; డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్ తదితర అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి.
- తెలుగులో సంధులు, ఛందస్సు, సమాసాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, రచయితలు–రచనలు తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ స్టడీస్‌లలో పదో తరగతి స్థాయి అంశాలను చదవాలి.
- పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. ఏయే అంశాలకు వెయిటేజీ ఎక్కువగా ఉందో గమనించాలి.
- వీలైనన్నీ ఎక్కువ మోడల్ టెస్టులు రాయాలి. మోడల్ టెస్టులు రాస్తూ.. తప్పులను సరిదిద్దుకుంటూ.. ఎప్పటికప్పుడు సాధనను మెరుగుపరచుకోవాలి.

#### సీట్ల కేటాయింపు

- రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్)లు, ప్రైవేటు అన్ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్(మైనారిటీ,నాన్ మైనారిటీలతో సహా) డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఇఎల్.ఇడి.), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డి.పి.ఎస్.ఇ.) కోర్సులను అందిస్తున్నాయి.
- వీటిలో ఎక్కడ చేరాలన్నా.. డీఈఈ సెట్ రాయాల్సిందే. డీఈఈసెట్‌లో అర్హత పొందాలంటే.. పరీక్షలో కనీసం 35 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన లేదు.
- పరీక్షలో ర్యాంకు సాధించిన అభ్యర్థులకు రిజర్వేషన్లు అనుసరించి కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ డైట్ కళాశాలల్లో వంద శాతం, ప్రైవేటు అన్ఎయిడెడ్ నాన్ మైనారిటీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్, ప్రైవేటు అన్ఎయిడెడ్ మైనారిటీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 80 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో కేటగిరీ 'ఎ' కింద భర్తీ చేస్తారు. 20 శాతం సీట్లకు కేటగిరీ 'బి'లో ఆయా విద్యాసంస్థలే ప్రవేశాలు కల్పిస్తాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లకు అందరూ పోటీపడవచ్చు.

#### ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 22.05.2023
- **డీఈఈసెట్ తేదీ:** 01.06.2023
- **వెబ్‌సైట్:** http://deecet.cdse.telangana.gov.in

## క్లుప్తంగా...

### సేంద్రియ వ్యవసాయంలో దేశానికి ఆదర్శం సిక్కిం

- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: భారత్‌లో మొట్టమొదటి పూర్తి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా నిలిచిన సిక్కిం దేశానికి ఆదర్శమని గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అన్నారు. సిక్కిం సంప్రదాయాలు, కళలు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ 'ఏక్ భారత్... శ్రేష్ఠ భారత్' నినాదం దేశ అభివృద్ధికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. దేశ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కిం ప్రతినిధులతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలో సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో మంగళవారం తెల్లవారు జామున విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా విద్యుత్ ఉత్పత్తిని ఆపారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసిన మొదటి యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. సాయంత్రం 4 గంటలకు యూనిట్ నుంచి పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరిగిందని, ప్రస్తుతం నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# పిట్ట కొంచెం.. వ్యాపారం ఘనం

జపాన్ కౌజు పిట్టలకు క్రేజ్



వీటి పెంపకంతో వ్యాపారం చేస్తున్న రాఘవపురం యువకుడు ● 100 పిట్టలతో ప్రారంభించి 10 వేల పిట్టలకు ఫామ్ విస్తరణ

పిఠాపురం: కౌజు పిట్టల పెంపకం చేపట్టి అభివృద్ధి బాటలో నడుస్తున్నాడు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు రామరాఘవపురానికి చెందిన దొడ్డి సురేంద్ర. వ్యవసాయ కుటుంబానికి చెందిన సురేంద్ర గ్రాడ్యుయేషన్ పూర్తి చేసాడు. కొంతకాలం చిన్నచిన్న ఉద్యోగాలు చేసాడు. సొంతంగా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో కౌజు పిట్టల పెంపకం చేపట్టాడు. తక్కువ పెట్టుబడితో చిన్న కౌజు పిట్టల (క్వయిల్) ఫామ్ ప్రారంభించాడు. సొంత పొలంలోనే షెడ్లు వేసి 100 పిట్టల్ని పెంచడం ప్రారంభించాడు. రెండేళ్లలోనే ఆ ఫామ్ 10 వేల పిట్టల సామర్థ్యానికి పెరగ్గా.. మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు.



### ఐదారు వారాల్లోనే పెరుగుతాయి

భారతదేశంలో కౌజు పిట్టల పెంపకం, విక్రయం, వాటిని చంపడంపై నిషేధం ఉండటంతో జపాన్ నుంచి దిగుమతి చేసుకున్న కౌజు పిట్టల పెంపకం చేపడుతున్నారు రైతులు. ఒక కోడిని పెంచే స్థలంలో 8 కౌజు పిట్టలను పెంచవచ్చు. కొవ్వు తక్కువగా.. ప్రొటీన్లు, పోషకాలు ఎక్కువగా ఉండటంతో వీటిని తినడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు మాంసాహార ప్రియులు. ఐదు వారాల్లోనే ఇవి అమ్మకానికి సిద్ధమవడంతోపాటు గుడ్లు కూడా పెడతాయి. ఒక్కో కౌజు పిట్ట ఏడాదికి సుమారు 250 వరకు గుడ్లు పెడతాయి. వీటి మాంసం, గుడ్లకు ఎక్కువ డిమాండ్ ఉంది.

### తక్కువ పెట్టుబడితో ప్రారంభించాను

సొంతంగా వ్యాపారం చేయాలనేది నా కోరిక. నా స్నేహితుల ద్వారా కౌజు పిట్టల పెంపకం గురించి తెలుసుకుని మా పొలంలో చిన్న పాక వేసి వీటి పెంపకం ప్రారంభించాను. ఏడాదిలోనే వ్యాపారం పెరిగింది. నెలకు 10 వేల పిట్టల్ని అమ్మే విధంగా పెంపకం చేస్తున్నాను. కోరుకొండ నుంచి పిల్లల్ని కొనుగోలు చేసి ఇక్కడ పెంచుతున్నాను. ఒకరోజు పిల్ల ఒక్కొక్కటి రూ.9కి దొరుకుతుంది. ఒక్కొక్క పిల్ల పెంచడానికి రూ.20 వరకు ఖర్చవుతుంది. నెల రోజులు పెంచితే ఒక్కో పిట్ట రూ.45 నుంచి రూ.50 వరకు వస్తుంది. గుడ్లు పొదిగే యంత్రాలను కొనుగోలు చేసి సొంతంగా గుడ్లు కొని పిల్లల్ని ఇక్కడే తయారు చేయాలనుకుంటున్నాను. ఫంక్షన్లకు, దాబాలు, రెస్టారెంట్లకు వీటిని సరఫరా చేస్తున్నాం.

– దొడ్డి సురేంద్ర, కౌజు పిట్టల పెంపకందారు

### డిమాండ్ బాగుంది

కౌజు పిట్టలకు డిమాండ్ బాగుంది. క్వయిల్ ఫామ్‌లు తక్కువగా ఉండటం వల్ల వీటికి డిమాండ్ ఎక్కువ ఉంది. వీటికి రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వల్ల పెద్దగా వైద్య అవసరాలు ఉండవు. మన వాతావరణంలో బాగా పెరుగుతాయి. కేవలం దాణా విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

– డాక్టర్ హిమజ, పశు వైద్యాధికారి, గొల్లప్రోలు

## సెల్‌ఫోన్ వినియోగదారుల రక్షణకు 'సంచార్ సాథి'

- నకిలీ సిమ్ కనెక్షన్లకు అడ్డుకట్ట వేస్తున్నాం
- టెలికాం శాఖ ఏపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్

సాక్షి, అమరావతి: దేశంలో సెల్‌ఫోన్ వినియోగదారుల రక్షణ కోసం 'సంచార్ సాథి' పేరుతో వెబ్ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్టు టెలికాం శాఖ ఏపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టి.వరప్రసాద్ చెప్పారు. మంగళవారం కేంద్ర టెలికాం శాఖ నిర్వహించిన 'సంచార్ సాథి' పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో విజయవాడ నుంచి వర్చువల్‌గా ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఒక వ్యక్తి పేరుపై నమోదైన సిమ్ కనెక్షన్లు, మోసపూరిత, అవసరం లేని కనెక్షన్‌ల రద్దు, చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్‌లను బ్లాక్ చేయడం తదితర సేవలను సంచార్ సాథి అందిస్తోందని చెప్పారు. సెంట్రలైజ్డ్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్)లో ఫోన్ దొంగతనంపై పోలీసు ఫిర్యాదు కాపీతో పాటు ఐఎంఈఐ నంబర్‌ను సమర్పించి ఫోన్ పని చేయకుండా బ్లాక్ చేయొచ్చన్నారు. ఆ తర్వాత ఎవరైనా ఉపయోగించడానికి ప్రయత్నిస్తే ట్రేస్ చేయొచ్చని చెప్పారు. ఫోన్ దొరికిన తర్వాత తిరిగి దానిని అన్‌బ్లాక్ చేసుకోవచ్చని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 'అస్త్ర(ఏఎస్‌టీఆర్)' ద్వారా నకిలీ, మోసపూరిత సిమ్ కనెక్షన్లను గుర్తిస్తున్నట్టు తెలిపారు. తొలి దశలో 87 కోట్లకు పైగా కనెక్షన్లను విశ్లేషించినట్టు చెప్పారు. ఇందులో 40.87 లక్షల అనుమానిత కనెక్షన్లను గుర్తించామన్నారు. ఇప్పటికే 36.61 లక్షల కనెక్షన్లను రద్దు చేశామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 55 వేల వరకు నకిలీ కనెక్షన్లను రద్దు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీవీ మనోజ్, ఏడీజీలు ఎం.రాజ్‌అనూప్, జి.దినేష్ జనార్దన్, ఏడీ బి.సుబ్బారావు, వినోద్, సంధ్యా సమీరా పాల్గొన్నారు.

## నూతన వేతనాల కోసం కదం తొక్కిన కార్మికులు



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు రహదారిపై బైఠాయించిన కార్మికులు

### అడ్మిన్ ముట్టడిలో స్వల్ప ఉద్రిక్తత

ఉక్కునగరం (గాజువాక): నూతన వేతనాల కోసం స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. తమకు వెంటనే నూతన వేతనాలు అమలు చేయాలంటూ కార్మికులు కదం తొక్కారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన ధర్నా కార్యక్రమాన్ని యాజమాన్యం ప్రకటనతో విరమించారు. యువ కార్మికుల ఒత్తిడితో నూతన వేతనాల కోసం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అడ్మిన్ ముట్టడి ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. యువ కార్మికులు పెద్ద ఎత్తున అడ్మిన్ కూడలికి చేరుకుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈలోగా వివిధ కార్మిక సంఘాల నాయకులు చేరుకున్నారు. జనరల్ షిఫ్ట్ విధులకు అడ్మిన్ బిల్డింగ్‌లోకి, ప్లాంట్‌కు వెళ్తున్న ఉద్యోగులను అడ్డుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మోహరించారు. పోలీసులు టౌన్‌షిప్ నుంచి వస్తున్న ఉద్యోగులను ప్రగతి మైదాన్ వైపు, కూర్మన్నపాలెం నుంచి వస్తున్న ఉద్యోగులను ప్రాజెక్ట్ ఆఫీసు వైపు మళ్లించారు. కార్మికులు బారికేడ్లు దాటుకుని అడ్మిన్ బిల్డింగ్ గేటుకు చేరుకున్నారు. కార్మికులు, పోలీసుల మధ్య స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. మధ్యాహ్నం స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం కె.సంజీవరావు వచ్చి ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ముట్టడి కార్యక్రమాన్ని విరమించారు.

## 20న 'గురుకుల' ప్రవేశ పరీక్షలు

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహణలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఈ నెల 20వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను https//aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థి ఐడీ, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# ముగింపు దశకు మహాయజ్ఞం

### నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా అఖండ పూర్ణాహుతి

- అమ్మవారికి అభిషేకం కూడా..
- పండితులు, పీఠాధిపతులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం ముగింపు దశకు చేరింది. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ వేదపండితుల మంత్రోచ్చారణతో కూడిన సంకల్పం తీసుకొని ఆరు రోజుల క్రితం ఈ మహాయజ్ఞాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది బుధవారం పండితులు నిర్ణయించిన సుముహూర్తాన తిరిగి సీఎం జగన్ చేతుల మీదుగానే అఖండ పూర్ణాహుతి కార్యక్రమంతో ముగియనుంది. బుధవారం ఉదయం 8.55 గంటలకు సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి యజ్ఞ మండపం వద్దకు చేరుకుంటారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం యజ్ఞశాల వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బుధవారం 9.10 గంటలకు పంచరాత్ర యాగశాలలో, 9.20కి వైదిక స్మార్త యాగశాలలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 9.50 గంటలలోపు రాజశ్యామల అమ్మవారు వేంచేసి ఉన్న వైఖానస యాగశాలలో పూర్ణాహుతికి సంబంధించిన పూజా కార్యక్రమం చేస్తారని తెలిపారు. 10.10 గంటలకు శైవ ఆగమశాలకు సీఎం జగన్ వస్తారన్నారు. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన నలకులవలతో వేదమంత్రోచ్చారణల మధ్య రుత్వికులు, ఘనాపాటిలు, పండితులు విశేష పూజా కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు. 10.20 గంటలకు అభిషేక మండపంలో తన కోసం ఏర్పాటు చేసిన ఆసనంలో సీఎం ఆసీనులవుతారని తెలిపారు. కంచి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన స్వర్ణ ప్రతిమ రూపంలో ఉన్న అమ్మవారికి సీఎం జగన్ ప్రత్యేకంగా అభిషేకం జరుపుతారని చెప్పారు. ఈ సందర్భంగా రుత్వికులు, వేద పండితులు, పీఠాధిపతులు సీఎంకు వేదాశీర్వచనం అందజేస్తారన్నారు. అనంతరం వేద పండితులను, పీఠాధిపతులను సీఎం సత్కరిస్తారని వివరించారు. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామీజీ, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర స్వామి అన్వయంతో మహాపూర్ణాహుతి ఆగమోక్తంగా జరుగుతుందన్నారు. దీనికి మంత్రాలయం, అహోబిలం పీఠాధిపతులు తదితరులు హాజరవుతారని చెప్పారు. కాగా, మంగళవారం యజ్ఞ కార్యక్రమాల్లో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీస్వామి పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. మీడియా సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. కాగా గణపతి సచ్చిదానంద స్వామి కూడా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

# హజ్ యాత్రికులకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్

- కృతజ్ఞతలు తెలిపిన ఏపీ హజ్ కమిటీ
- ముస్లిం పెద్దలు, సంఘాల నేతల హర్షం



ముస్లిం మత పెద్దలకు స్వీట్స్ తినిపిస్తున్న హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్

సాక్షి, అమరావతి/అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా ఆదుకుని అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ హజ్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్‌లాజమ్ అధ్యక్షతన విజయవాడలోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ గౌస్‌లాజమ్ మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరుతో పోలిస్తే విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే 1,813 మందిపై దాదాపు రూ.83 వేల వంతున అదనపు భారం పడుతుందని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించారని చెప్పారు. రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులపై పడుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ రూ.14.51 కోట్లు విడుదల చేయడం ముస్లిం సమాజం పట్ల ఆయనకున్న ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. దీంతో సమావేశం సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపింది. హజ్ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను ఈ సమావేశంలో చర్చించారు. హజ్ యాత్రికులకు బస, భోజనం, నీరు, రవాణా తదితర ఏర్పాట్లకు హజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, ముస్లిం మతపెద్దలు, సంఘాల నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హజ్ యాత్రికులకు రూ.14.51 కోట్లు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో హజ్ యాత్రికులను చిన్నచూపు చూశారని, అప్పటి టీడీపీ నాయకుడు సుజనాచౌదరి కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ కనీసం విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ కూడా సాధించలేకపోయారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ తీసుకురావడంతోపాటు హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వ నిధులు విడుదల చేయడం గొప్ప విషయమని వారు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఏపీ ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్, ఎంఎస్ బేగ్, మతపెద్దలు మహ్మద్ అక్బర్‌బాషా, డీఎస్ హబీబుల్లా, నసీర్ అహ్మద్ ఉమ్రీ, ముక్తి అబ్దుల్ బాషిత్, ముక్తి అబ్దుల్ హబీబ్ తదితరులు మాట్లాడారు.

**వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా చెప్పారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు రాయితీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేయడాన్ని హర్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మంగళవారం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాలలో సముచిత స్థానం లభి స్తోందని చెప్పారు. ప్రతి ముస్లిం సోదరుడు సీఎం జగనన్నకు ఎల్లవేళలా అండగా నిలుస్తారని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ పెద్దలు ప్రత్యేక దువా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మై నార్టీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత, మున్నీ, జిలానీ, రెహ్మాన్, ఖలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# మామిడి ముంచేసింది

- వాతావరణ మార్పులతో భారీగా తగ్గిన దిగుబడి
- నాణ్యత లేక గిట్టుబాటు ధర కరవు
- అయోమయంలో మామిడి రైతులు



నూజివీడు మండలం దిగవల్లిలో వడదెబ్బకు రాలిన మామిడి కాయలు

ఏలూరు(మెట్రో): ఈ ఏడాది మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో మామిడి పంట దిగుబడి బాగా పడిపోయింది. వచ్చిన పంట కూడా నాణ్యంగా లేకపోవడంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దీంతో ఈ ఏడాది బాగా నష్టపోయామని రైతు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడి రైతు ఈ ఏడాది నష్టపోయాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతయ్యే మామిడికి ప్రస్తుతం సొంత రాష్ట్రంలోనూ సరైన ధర దక్కని పరిస్థితి. అసలే కాపు తక్కువగా రావడం, మూడు దఫాలుగా వచ్చిన గాలి దుమ్ములు, అకాల వర్షాలకు, ఎండ వేడిమికి పూత పిందె, కాయ ఇలా అన్ని దశల్లోనూ రాలిపోయింది. అక్కడక్కడా కొన్ని కాయలు ఉన్నా, ఆ కాయలకు మంగు మచ్చ ఆశించడంతో కనీసం ఎకరాకు రూ.30 వేలు కూడా దక్కని పరిస్థితి.

**కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి**

జిల్లాలో బంగినపల్లి, రసాలు అధికంగా ఉత్పత్తి అయ్యేవి. రైతుకు ఈ రకాలే అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టేవి. ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, ఏప్రిల్ నెలలో విపరీతమైన ఎండల వల్ల పంట దెబ్బతింది. దీంతో కనీసం కూలీ ఖర్చులు కూడా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలకు, అధిక ఉష్ణోగ్రతలకు మామిడి నాణ్యత లేకుండా రైతును ముంచేసింది.

**ఇతర రాష్ట్రాలకు తగ్గిన ఎగుమతులు**

కాయపై మచ్చ ఏర్పడటంతో మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎగుమతి కావాల్సిన మామిడి స్థానికంగానే ఉండిపోతోంది. గతంలో నూజివీడు రసాలు అంటే ఇతర రాష్ట్రాలకు ఎంతో ప్రసిద్ధి. అలాంటి నూజివీడు ప్రాంతంలో రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు. ఆగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి, ముసునూరు, చింతలపూడి మండలాల్లో 14 వేల హెక్టార్లలో మామిడి విస్తరించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులంతా నష్టపోయారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి మాట పక్కన పెడితే స్థానికంగా ఉన్న నున్న మార్కెట్‌లోనూ రైతు ఆశించిన ధర లభించడం లేదు.

**మొగల్తూరులోనూ అదే పరిస్థితి**

గతంలో మంచి రంగు, మచ్చలేని మామిడి కాయలను టన్ను రూ.40 వేలకు విక్రయించేవారు. ప్రస్తుతం స్థానిక నున్న మార్కెట్‌లో మచ్చలున్నవి కనీసం రూ.10 వేలకు కూడా కొనడం లేదు. గతంలో 20 వేల టన్నుల దిగుబడి ఉన్న మామిడి ఈ ఏడాది 3 నుంచి 5 టన్నుల కూడా ఉత్పత్తి రాలేదు. వచ్చిన కాయ సైతం మంగు, మచ్చలతో ఉండటంతో కనీసం కొనే నాథుడే కరవవయ్యాడు. ఇదిలా ఉండగా, ఆలస్యంగా వచ్చే నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 2 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న మామిడి కాపు ప్రస్తుతం ఆశాజనకంగా లేదని రైతులు చెబుతున్నారు. మామిడికి ప్రసిద్ధి చెందిన ఉమ్మడి జిల్లాలో రైతు ఢీలా పడ్డాడు. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో పూర్తిగా రైతులు మామిడి పంటను తొలగించేశారు. గతంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం మండలాల్లో మామిడి పంట ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాలుగా ఉన్న అరకొర చెట్లను సైతం పెకిలించేశారు. రానున్న రోజుల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులే కొనసాగితే జిల్లాలో మామిడి పంట అంతరించిపోయే పరిస్థితి ఏర్పడనుంది.

### కొనేందుకు ముందుకు రావడం లేదు



గతంలో ఎకరాకు రూ. 40 వేలు కౌలు వచ్చేది. అకాల వర్షాలతో వాతావరణ మార్పులతో ప్రస్తుతం పేనుబంక, మంగు మచ్చలు రావడంతో మామిడి కాయ పూర్తి నాణ్యత కోల్పోయింది. ఆశించిన ధర లేదు సరికదా, స్థానికంగా కూడా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు.

– శీలపురెడ్డి నాగిరెడ్డి, మామిడి రైతు

# రైతులకు కరెంటు కష్టాలు రానివ్వం

- నాలుగేళ్లలో 2.19 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం
- పగలే కోతల్లేని 9 గంటల విద్యుత్ ఇస్తున్నాం
- రైతులకు ఉచిత కరెంటుకు ఏడాదికి రూ.5,196 కోట్ల వ్యయం
- అడిగిన రోజే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసే సామర్థ్యం వచ్చింది
- 'సాక్షి'తో ఎస్పీడీసీఎల్ ఎండీ సంతోషరావు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'ఎన్ని ఇబ్బందులున్నా రైతుకు ఏమాత్రం కష్టం కలగకుండా అండగా నిలిచిన ప్రభుత్వమిది. మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కటే చెప్పారు. రైతుకు విద్యుత్ సరఫరా విషయంలో ఎక్కడా లోపం రానివ్వకూడదన్నారు. ఎంత వ్యయమైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీంతో మేము కరెంటు సరఫరాలో రైతులకు పూర్తి మద్దతుగా నిలిచాం..' అని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) ఎండీ సంతోషరావు చెప్పారు. ఆయన మంగళవారం అనంతపురంలో 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో ఒక్క ఏడాదిలోనే రైతులకు ఉచిత కరెంటు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.5,196 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఎన్ని కష్టాలున్నా రోజూ పగలే 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ముఖ్యంగా బోర్లమీద ఆధారపడి సాగుచేస్తున్న అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య తదితర జిల్లాల్లో ఏ ఒక్క రైతుకు కరెంటు అందడం లేదన్న పదం వినపడకుండా పనిచేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంటే 2019 నుంచి 2023 మధ్యకాలంలో రికార్డుస్థాయిలో 2.19 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. అంతకుముందు ఐదేళ్లలో 2.05 లక్షల కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ పరిధిలో 11 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయని చెప్పారు.

**దరఖాస్తు చేసిన రోజే ట్రాన్స్‌ఫార్మర్**

ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే గతంలో చాలా ఇబ్బందులుండేవని, నెలల తరబడి వేచిచూడాల్సి వచ్చేదని తెలిపారు. ఇప్పుడు దరఖాస్తు చేసిన రోజే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎవరికీ ఒక్కపైసా లంచం లేకుండానే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా డబ్బు అడిగితే 1912కు ఫోన్‌చేస్తే ఆ రైతుల వివరాలు గోప్యంగా ఉంచి, సదరు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. లంచం అడిగారనిగానీ, తీసుకున్నారనిగానీ తేలితే అవసరమైతే సస్పెండ్ కూడా చేస్తామని తెలిపారు.

**ఖాళీ పోస్టులు భర్తీచేస్తాం**

ఎస్పీడీసీఎల్ పరిధిలో ఖాళీలన్నీ భర్తీచేసేందుకు సర్కారు అనుమతి ఇచ్చిందని చెప్పారు. జూనియర్ లైన్‌మెన్ నుంచి ఏఈల వరకు అన్ని పోస్టులు భర్తీచేస్తామన్నారు. ఇకపై డివిజన్ వారీగా పనితీరును అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఎవరు ఏంపని చేస్తున్నారని తాము ఆరా తీయాల్సిన పనిలేదని, సిబ్బంది పనితీరుపై వారే నోట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. దీన్ని క్రాస్‌చెక్ చేసి దానిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జిల్లాల్లో రోడ్‌క్రాసింగ్‌ల వద్ద సర్వేచేసినట్లు తెలిపారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే అభివృద్ధి పనులకు రూ.141 కోట్లు వ్యయం అవుతోందని చెప్పారు. దశలవారీగా పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

# క్రూసెంటర్ క్లోజ్

- నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్‌కు ఘన చరిత్ర
- వచ్చేనెల 6న నాటికి డెడ్‌లైన్
- తట్టా..బుట్టా సర్దుకుంటున్న లోకో పైలెట్లు
- సదరన్ రైల్వేలో 'నందలూరు'ప్రత్యేక గుర్తింపు

నందలూరు (రాజంపేట): బ్రిటీషు రైల్వే పాలకుల నుంచి కొనసాగిన ఎంతో ఘన చరిత్ర కలిగిన నందలూరు రైల్వే రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ (మిగిలిన ఏకైక డిపార్టుమెంట్) ఎత్తివేతకు డెడ్‌లైన్ విధించారు. ముందుగా నందలూరుకు మోడర్ రన్నింగ్‌రూం కోటి వ్యయంతో మంజూరు చేశారు. దానిని అర్ధాంతరంగా రద్దుచేశారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్‌స్టాఫ్ డిపో ఏర్పాటు అనుకూలం కాదని చెబుతున్నా గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోలేదని.. వారి అనాలోచిత నిర్ణయాలతో నందలూరు డిపోకు మంగళం పాడారని రైల్వే కార్మిక వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**6న క్రూసెంటర్ క్లోజ్..**

వచ్చేనెల 6న రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్‌ను క్లోజ్ చేయనున్నారు. ఈ మేరకు సంబంధితశాఖ అధికారులకు గుంతకల్ నుంచి సంకేతాలు కూడా వచ్చేశాయి. ఇప్పటికే దశలవారీగా లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, గార్డులను గుంతకల్ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్న డిపోకు తరలించారు. ఇక పూర్తి స్థాయిలో నందలూరు క్రూ సెంటర్‌ను మూసేసేందుకు రంగంసిద్ధం చేశారు.

రన్నింగ్‌స్టాఫ్ సిబ్బందిని ఇప్పటికే గుంతకల్ రైల్వే ఉన్నతాధికారులు ఎర్రగుంట్ల డిపోకు వెళ్లేలా మానసికంగా సిద్ధం చేశారు. వచ్చే నెల 6 నాటికి నందలూరులో క్లోజ్ చేయనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి లోకోపైలెట్లు, ఏఎల్‌పీ, గూడ్స్‌గార్డులు తట్టా బుట్టా సర్దుకుంటున్నారు. దీంతో నాగిరెడ్డిపల్లె అర్బన్ పంచాయతీలో అద్దె ఇళ్లను ఖాళీ చేసుకుంటున్నారు. ఎర్రగుంటల్లో నివాసం ఉండలేమని వారు అంటున్నారు. కాలుష్యం లేని, తాగునీటి వసతి తదితర సమస్యలు లేని సమీప నగరాల్లో ఉండేందుకు అద్దె ఇళ్లను అన్వేషించుకుంటున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)